విజయవాడ
ఆదివారం,
22 మార్చి 2026
సంపుటి: 22, సంచిక: 80
వెల : 6/- పేజీలు :12

# నినాదం

నిఖార్సైన జర్నలిజం



Published From Vijayawada, Visakhpatnam, Tirupati

## ఇరాన్ అధ్యక్షుడికి నరేంద్ర మోదీ ఫోన్

### పెజెష్కియాన్‌కు రంజాన్, నౌరుజ్ శుభాకాంక్షలు తెలిపిన ప్రధాని

నౌకాయానం స్వేచ్ఛగా కొనసాగాలని మోదీ సూచనలు



పశ్చిమాసియాలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్న వేళ ఇరాన్ అధ్యక్షుడు పెజెష్కియాన్‌తో ప్రధాని మోదీ ఫోన్‌లో మాట్లాడారు. ఈ సందర్భంగా రంజాన్, నౌరు జ్ (పర్షియన్ నూతన సంవత్స రం) శుభాకాంక్షలు తెలియజేసిన ఆయన.. ఈ పర్వదినాలు పశ్చిమా సియాలో శాంతి, స్థిరత్వం తీసుకు వస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు.

-2లో

## యుద్ధం చేయబోమని ట్రంప్ హామీ ఇవ్వాలి

### అప్పటి వరకు కాల్పులను ఆపబోమన్న ఇరాన్

దాడుల నిలిపివేతకు అమెరికా సిద్ధంగా లేదు

శత్రు నౌకలకే హోర్ముజ్ నో ఎంట్రీ : మంత్రి అబ్బాస్



ఇరాన్, అమెరికా మధ్య జరుగుతున్న యుద్ధం 22వ రోజుకు చేరుకుంది. ఇరాన్‌పై సైనిక చర్యను క్రమంగా తగ్గించే విషయాన్ని పరిశీలిస్తున్నట్టు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కీలక ప్రకటన చేశారు.

-2లో



### తిరుమల పవిత్రతకు

# భంగం కలగొద్దు

## భక్తులకు చిన్న ఇబ్బంది కూడా రావొద్దు

- ప్రసాదాలు, తాగునీటిలో నాణ్యత కోసం
- టెక్నాలజీని సమర్థంగా వినియోగించాలి
- కల్తీ నివారణే లక్ష్యంగా పని చేయాలి
- అధికారులకు సీఎం చంద్రబాబు నిర్దేశం
- తిరుమలలో స్టేట్ ఫుడ్ ల్యాబ్ ప్రారంభం

తిరుమలలో భక్తులకు నాణ్యమైన ప్రసాదాన్ని, తాగునీటిని అందించేందుకు టెక్నాలజీని సమర్థవంతంగా వినియోగించుకోవాలని అధికారులను చంద్రబాబు ఆదేశించారు. కల్తీ నివారణ లక్ష్యంగా పనిచేయాలని నిర్దేశించారు.

**తిరుమల, మార్చి 21** దాదాపు రూ.25 కోట్లతో తిరుమలలో ఏర్పాటుచేసిన స్టేట్ ఫుడ్ ల్యాబ్‌ను చంద్రబాబు శనివారంప్రారంభించారు. 1981లో నీటి పరీక్షల కోసం చిన్నదిగా ప్రారంభమైన ఈ విభాగాన్ని అత్యాధునికసదుపాయాలతో తీర్చిదిద్దారు. ఈ సందర్భంగా మంత్రి సత్యకుమార్‌తో కలిసి ల్యాబ్‌లో ఏర్పాటు చేసిన 50కిపైగా పరికరాలను స్వయంగా పరిశీలించారు. న్యూఢిల్లీ నుంచి వచ్చిన 'ఎఫ్ఎవీసఎవీసఏఐ' ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పాండా, 'సీఎవీఫటీఆర్ఐ' డైరెక్టర్ గిరిధర్, సీనియర్ సైంటిస్ట్ ఉషారాణి, మైక్రో బయాలజిస్ట్ దామిని సింఘానీ ల్యాబ్‌లోని పరికరాల పనితీరును సీఎంకు వివరించారు. కొవ్వు ఆమ్లాలు, పురుగుమందులను పరీక్షించే జీసీ-ఎంఎస్; మైక్రో టాక్సిన్లు, ఔషధాలు, యాడిటివ్‌ల పరీక్షకు వినియోగించే హెచ్‌పీఎల్‌సీ-ఎల్‌సీ ఎంఎస్; ఆహారం, నీటిలో లోహాల గుర్తింపు కోసం వాడే ఏఏఎవీస-ఐసీపీ-ఎంఎస్ మిషన్; ఫైబర్, ప్రొటీన్, ఫ్యాట్ అనలైజర్లు, బ్యూటిరో రిఫ్రాక్టోమీటర్, యూవీ-విజిబుల్ స్పెక్ట్రోఫొటోమీటర్ వంటి యంత్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా సీఎం అధికారులతో మాట్లాడుతూ, భక్తుల నమ్మకానికి చిన్నపాటి విఘాతం కూడా కలిగించకూడదని స్పష్టం చేశారు. ప్రసాదాల తయారీలో వాడే ముడి పదార్థాల నాణ్యతను ఏ స్థాయిలో విశ్లేషించవచ్చని సీఎం అడిగి తెలుసుకున్నారు. బ్యాక్టీరియా గుర్తింపు కోసం ప్రత్యేకంగా క్లీన్ రూమ్, ఎయిర్ హ్యాండ్లింగ్ సిస్టమ్ వంటి భద్రతా ప్రమాణాలను చూసిన సీఎం.. అధికారులను అభినందించారు. ల్యాబ్

- మిగతా 2వ పేజీలో

## ముగిస్తాం.. విరుచుకుపడతాం

### యుద్ధంపై అమెరికా, ఇజ్రాయెల్ చెరో మాట

- ఇరాన్‌లోని నతాంజ్ అణుశుద్ధి కేంద్రంపై వైమానిక దాడులు
- డిగో గార్సియాపైకి క్షిపణులు ప్రయోగించిన టెహ్రాన్
- ఇరాన్ చమురుపై ఆంక్షలు ఎత్తేసిన అమెరికా
- హర్మ్యూజ్‌ను తెరవండి.. 22 దేశాల విజ్ఞప్తి

-2లో



పశ్చిమాసియాలో యుద్ధ కల్లోలం చల్లారట్లేదు. ఓ వైపు అమెరికా-ఇజ్రాయెల్ విరుచుకు పడుతుంటే.. ఇరాన్ అంతే స్థాయిలో ప్రతిఘటిస్తోంది. శనివారం.. తమ దేశానికి దాదాపు 4 వేల కిలోమీటర్ల దూరంలో ఉన్న బ్రిటన్-అమెరికా సంయుక్త సైనిక స్థావరం డిగో గార్సియాపై ఇరాన్ బాలిస్టిక్ క్షిపణులను ప్రయోగించి పాశ్చాత్య దేశాల్ని కలవరపాటుకు గురిచేసింది.

## యుద్ధం ఆపడానికి ఆలోచిస్తున్నా..

### కానీ కాల్పుల విరమణకు సిద్ధంగా లేం

మిత్ర దేశాలకు భద్రత కల్పిస్తున్నాం : ట్రంప్

హర్మ్యూజ్ బాధ్యత తీసుకోవాలని వివిధ దేశాలకు పిలుపు



పశ్చిమాసియాలో కొనసాగుతోన్న యుద్ధ జ్వాలలపై ప్రపంచ వ్యాప్తంగా ఆందోళనలు వ్యక్తమ వుతున్నాయి. ఈ క్రమంలో ఇరాన్‌తో యుద్ధం ముగించే విషయంపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కీలక ప్రకటన చేశారు. ఇరాన్‌పై సైనిక చర్యను క్రమంగా తగ్గించే విషయాన్ని పరిశీలిస్తున్నట్లు తెలిపారు.

-2లో

## అడవుల రక్షణ సామూహిక బాధ్యత

### డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్

'అడవులు భూమాతకు ఊపిరితిత్తులు. నదులకు, జీవవైవి ధ్యానికి మూలం. వాటిని రక్షించడం అంటే మన ఉనికిని రక్షించుకోవడం' అని ఉపముఖ్య మంత్రి, అటవీశాఖ మంత్రి పవన్‌కల్యాణ్ పేర్కొన్నారు. మార్చి 21న ప్రపంచ అటవీ దినోత్సవం సందర్భంగా శనివారం ఆయన ఎక్స్ వేదికగా సందేశం ఇచ్చారు.

-6లో



## పట్టణ వ్యర్థాలతో గ్యాస్ ఉత్పత్తి

### 59.85 కోట్లతో 5 సీబీజీ ప్లాంట్ల ఏర్పాటు

- రాజమహేంద్రవరం, నెల్లూరు, గుంటూరు, ఒంగోలు ప్రాంతాల్లో కొత్తగా స్థాపన
- విజయవాడలో అప్‌గ్రేడ్.. ప్రభుత్వం ఆమోదం

-6లో



పట్టణ వ్యర్థాల నిర్వహణలో స్థిరత్వం సాధించడంతో పాటు శుభ్ర ఇంధన ఉత్పత్తిని ప్రోత్సహించే దిశగా ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలోని పట్టణ స్థానిక సంస్థల్లో 5 కంప్రెస్డ్ బయో గ్యాస్ (సీబీజీ) ప్లాంట్ల ఏర్పాటు కోసం రూ.59.85 కోట్లకు పరిపాలనా ఆమోదం మంజూరు చేసింది.




## భారత్‌కు భారీ ఉపశమనం

### హోర్ముజ్ నుంచి ప్రయాణానికి సిద్ధమైన జగ్ వసంత, పైన్ గ్యాస్ ఎల్పీజీ నౌకలు

గల్ఫ్ ప్రాంతంలో ఇంకా భారత్ నౌకలు 22

అత్యంత ఉద్రిక్తతలు నెలకొన్న హోర్ముజ్ జలసంధి నుంచి భారత్‌కు చెందిన రెండు ఎల్పీజీ నౌకలు జగ్ వసంత, పైన్ గ్యాస్ నౌకలు ప్రయాణానికి సిద్ధమయ్యాయి.

-2లో

# తిరుమల పవిత్రతకు భంగం కలగొద్దు

(మొదటి పేజీ తరువాయి)

పరీక్షలకే పరిమితం కాకుండా అన్నప్రసాద కేంద్రాల్లోని వంటశాలల శుభ్రతపై కూడా దృష్టి సారించాలని సీఎం ఆదేశించారు. ఈ ల్యాబ్‌లో ప్రస్తుతం నెలకు వెయ్యి నుంచి 1,500 శాంపిళ్లను విశ్లేషిస్తున్నామని అధికారులు తెలిపారు. తిరుమల పర్యటనలో భాగంగా టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు, ఈవో రవిచంద్ర, అదనపు ఈవో వెంకయ్య చౌదరితో సీఎం చంద్రబాబు సమావేశం నిర్వహించారు. భక్తులకు అందుతున్న సౌకర్యాలు, చేస్తున్న అభివృద్ధి పనులపై ఆరా తీశారు. అలాగే గతంలో ఆదేశించిన పనులు ఏ స్థాయిలో ఉన్నాయని అడిగి తెలుసుకున్నారు. అలిపిరిలో ఏర్పాటు చేయదలుచుకున్న ఇంటిగ్రేటెడ్ టౌన్‌షిప్ ఏర్పాటుపై కూడా చర్చించారు. ఈక్రమంలో దాదాపు 10 ఎకరాల్లో ఉన్న శిల్ప కళాశాలను మినహాయించి మిగిలిన ప్రాంతంలో టౌన్‌షిప్‌ను ఏర్పాటు చేసే అంశాన్ని అధికారులు సీఎంకు వివరించారు. అయితే అలిపిరిలో లేదా జూపార్క్ రోడ్డులో ఈ టౌన్ షిప్ ఏర్పాటు చేసే అంశంపై పూర్తిస్థాయిలో పరిశీలన చేసి నివేదిక ఇవ్వాలని సీఎం ఆదేశించారు. తిరుమల మొత్తం దివ్య ఔషధ మొక్కలను ఏర్పాటు చేయాలన్నారు. బయోగ్యాస్ ప్లాంట్, విద్యుత్ సరఫరాపై కూడా చర్చించారు.



**కంట్రోల్ సెంటర్ ప్రత్యేకతలివే..**

**ఆధ్యాత్మికం, సేవ, సాంకేతిక, స్థిరత్వం అనే నాలుగు లక్ష్యాలతో గత ఏడాది ఇంటిగ్రేటెడ్ కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్‌ను ఏర్పాటైంది.**

- **తిరుమల పవిత్రతను పరిరక్షించడం.**
- **రద్దీ నిర్వహణలో క్రమశిక్షణ**
- **సేవల్లో పారదర్శకత**
- **టీటీడీ పాలనలో సాంకేతిక వినియోగం.**

టీటీడీ పరిధిలోని ఆలయాలను అత్యాధునిక సదుపాయాలతో కూడిన ఆధ్యాత్మిక కేంద్రాలుగా తీర్చిదిద్దాలని, మరిన్ని ఆలయాల నిర్మాణాలకు చర్యలు తీసుకోవాలని సీఎం సూచించారు. వైకుంఠం క్యూకాంప్లెక్స్‌లోని ఏఐ ఆధారిత ఇంటిగ్రేటెడ్ కమాంట్ అండ్ కంట్రోల్ సెంటర్‌ను అధికారులతో కలిసి ఆయన సందర్శించారు. అధికారులు ఈ సెంటర్‌పై ఇచ్చిన పవర్‌పాయింట్ ప్రజెంటేషన్‌ను తిలకించారు. అమెరికాకు చెందిన దాత జయప్రసాద్, కార్య ఫౌండేషన్ సహకారంతో ఈ సెంటర్ ద్వారా అందిస్తున్న సేవలను సీఎంకు అధికారులు వివరించారు. దీనిపై అధికారులతో ఆయన కొద్ది సమయం సమీక్షించారు. భక్తుల సమస్యలను ముందుగానే గుర్తించి వెంటనే పరిష్కరించే విధంగా ప్రస్తుత వ్యవస్థను మరింత బలోపేతం చేయాలన్నారు. క్యూలైన్‌లో ప్రవేశించిన క్షణం నుంచి దర్శనం పూర్తయ్యే వరకు వారికి అందించే సేవలన్నిటినీ ఈ సెంటర్ ద్వారా ప్రత్యక్ష పర్యవేక్షణ చేయాలన్నారు. తిరుమల పవిత్రతకు భంగం కలిగించే చర్యలను అరికట్టేందుకు అత్యాధునిక సీసీ కెమెరాలు, ఫేసియల్ రికగ్నిషన్ వ్యవస్థలను ఏర్పాటు చేయాలన్నారు.

## ఇరాన్ అధ్యక్షుడికి నరేంద్ర మోదీ ఫోన్

**న్యూఢిల్లీ, మార్చి 21**



ప్రాం తీయ స్థిరత్వానికి ముప్పు, ప్రపంచ సరఫరా గొలుసుకు ఆటంకం కలిగించే కీలక మౌలిక సదుపాయాల పై దాడులను ప్రధాని మోదీ ఖండించారు. నౌకాయానం స్వేచ్ఛగా కొనసాగాలని.. నౌకామార్గాలు తెరచి ఉంచడం, వాటి ని సురక్షితంగా చూసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఇరాన్‌లోని భారతీయుల రక్షణకు దేశం తీసుకుంటున్న చర్యలను ప్రధాని మోదీ ప్రశంసిం చారు. యుద్ధం మొదలైన తర్వాత ఇరాన్ అధ్యక్షుడితో ప్రధాని మోదీ ఫోన్‌లో మాట్లాడటం ఇది రెండోసారి. మార్చి 12న ఓసారి ఫోన్ లో సంభాషించిన ప్రధాని.. ఈ ప్రాంతంలో ఉద్రిక్తతలు పెరగడంపై ఆందోళన వ్యక్తం చేశారు.

## యుద్ధం చేయబోమని ట్రంప్ హామీ ఇవ్వాలి

**టెహ్రాన్, మార్చి 21**

దీనిపై తాజాగా ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాగ్చి స్పందించారు. కాల్పులను ఆపేందుకు తాము అంగీకరించేది లేదని స్పష్టం చేశారు. గత అనుభవాలు పునరావృతం కావాలని తాము కోరుకోవడం లేదన్నారు. యుద్ధం ముగించేందుకు ఎలాంటి చర్యలు తీసుకున్నా తాము వినడానికి, పరిశీలించడానికి సిద్ధంగా ఉన్నామని తెలిపారు. ప్రస్తుతం కొన్ని దేశాలు పరిష్కారం కోసం ప్రయత్నిస్తున్నాయని, దాడులను నిలిపివేసేందుకు అమెరికా సిద్ధంగా ఉన్నట్టు కనిపించడం లేదని, దీంతో తాము మా దేశాన్ని కాపాడుకునేందుకు యుద్ధం కొనసాగిస్తూనే ఉంటామని అబ్బాస్ అరాగ్చి తెలిపారు. యుద్ధానికి ముగింపు అంటూ జరిగితే అది పూర్తిగా, ఎప్పటికీ యుద్ధానికి దిగకుండా ఉంటామనే హామీ రూపంలో ఉండాలని డిమాండ్ చేశారు. ఇరాన్‌కు జరిగిన నష్టానికి పరిహారం చెల్లించాల్సి ఉంటుందని కూడా స్పష్టం చేశారు. కేవలం దేశ పరిరక్షణ కోసమే ఇరాన్ యుద్ధం సాగిస్తోందని చెప్పారు. వ్యూహాత్మక హోర్ముజ్ జలసంధిని మూసివేయడంపై అబ్బాస్ అరాగ్చి మాట్లాడుతూ, శత్రుదేశాల నౌకలకు మాత్రమే ఆ మార్గం మూసేశామని చెప్పారు. అమెరికా దాడులకు స్పందనగా మార్చి 2న హోర్ముజ్‌ను ఇరాన్ బంద్ చేసింది. దీంతో ఇంధన సరఫరాపై ప్రపంచ దేశాల్లో ఆందోళన నెలకొంది. ఇటు ఇరాన్ కానీ, అటు అమెరికా– కానీ వెనక్కి తగ్గేందుకు సిద్ధంగా లేకపోవడంతో సమస్య మరింత బిగుసుకుంటోంది. కచ్చితమైన హామీలు, పరిహారం ఇవ్వాలని ఇరాన్ పట్టుబడుతోంది. అమెరికా సైతం తామ అనుకున్న లక్ష్యాలకు చేరువలో ఉన్నామని సంకేతాలు ఇస్తూనే సైనిక చర్యలను నిలిపివేసేందుకు నిరాకరిస్తోంది.

## యుద్ధం ఆపడానికి ఆలోచిస్తున్నా..

**వాషింగ్టన్, మార్చి 21**

అయితే, కాల్పుల విరమణకు మా త్రం తాను సిద్ధంగా లేనని పేర్కొన్నారు. ఇరాన్‌పై సాధించిన సైనిక విజయాలను వివరిస్తూ ట్రూత్ సోషల్ వేదికగా ట్రంప్ ఒక పోస్టు పెట్టారు. ఇరాన్‌పై తమ లక్ష్యాలను చేరుకోవడానికి చాలా దగ్గరగా ఉన్నామన్నారు. మా సైనిక చర్యను ముగించే విషయంపై ఆలోచిస్తున్నట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా ఇరాన్ క్షిపణి సామర్థ్యాలను, వైమానిక, నావికా వ్యవస్థలను పూర్తిగా ధ్వంసం చేసినట్లు తెలిపారు. ఆ దేశం మరోసారి అణ్వాయుధాలను తయారుచేయకుండా అమెరికా చూసుకుంటుంద న్నారు. ఒకవేళ అలాంటి పరిస్థితి వస్తే.. తాము తగినవిధంగా స్పందిస్తామని హెచ్చరించారు. ఇక, అమెరికా దాని మిత్ర దేశాలకు భద్రత కల్పించిందని ట్రంప్ అన్నారు. ఇజ్రాయెల్, సౌదీ అరేబియా, ఖతర్, యూఏఈ, బహ్రెయిన్, కువైట్ సహా పశ్చిమాసియాలోని మిత్ర దేశాలకు అత్యున్నత స్థాయిలో రక్షణ కల్పిస్తున్నామని ట్రంప్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా హర్మూజ్ జలసంధి గురించి కూడా ట్రంప్ కీలక ప్రకటన చేశారు. దీనిపై ఆధారపడిన దేశాలు నౌకల సురక్షిత ప్రయాణానికి బాధ్యత తీసుకోవాలని పిలుపునిచ్చారు. ఒకవేళ తమ సాయం కోరితే.. సహాయం అందించేందుకు తాము సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు.

# అమెరికా మాపై దాడిచేస్తే మేం భారత్‌పై బాంబులేస్తాం

- ఢిల్లీ, ముంబై మా లక్ష్యాలు
- పాక్ మాజీ హైకమిషనర్ అబ్దుల్ బాసిత వాచాలత్వం

కరడుగట్టిన ఛాందసవాదం, వితండ వాదానికి పాకిస్తాన్ చిరునామా అని ఆ దేశ మాజీ దౌత్యవేత్త అబ్దుల్ బాసిత్ మారోమారు నిరూపించారు. భారత్ మీద తమ అంతులేని విద్వేషాన్ని తన వాచాలత్వం ద్వారా బాసిత్ మరోమారు రుజువుచేసుకున్నారు. పశ్చిమాసియా యుద్ధం దక్షిణాసియాకు విస్తరించి అమెరికాగనక పాకిస్తాన్‌పై దాడి చేస్తే ప్రతిగా అమెరికాపై దాడిచేయాల్సిందిపోయి భారత్‌పై బాంబులేస్తామని బాసిత్ అత్యంత నిర్లక్ష్యంగా మాట్లాడారు. దీంతో పాకిస్తాన్ దౌత్యవర్గాల్లోనూ జిహాదీవాదం ఒంటబట్టించుకున్న వితండవాదులకు కొదవలేదని భారత్ నుంచి తీవ్రస్థాయిలో విమర్శలు వెల్లువెత్తాయి. సీఎన్ఎన్‌న్యూస్18తో జరిగిన ఒక చర్చావేదికలో బాసిత్ మాట్లాడారు. "యుద్ధంలో ఇరాన్‌పై ఇజ్రాయెల్ పైచేయి సాధిస్తే ఆ తర్వాత సమీపంలో ఉన్న పాకిస్తానే ఇజ్రాయెల్‌కు తదుపరి లక్ష్యంకావొచ్చు. ఇజ్రాయెల్ చెప్పుడుమాటలు వినే అమెరికాకు అప్పుడు పాకిస్తాన్ అణుకార్యక్రమాలు రుచించకపోవచ్చు. అప్పుడు పాకిస్తాన్‌పై అమెరికా దాడులు చేయొచ్చు. ఇలా జరగడానికి అవకాశం లేదు. కానీ ఒకవేళ దాడి చేస్తే ప్రతిదాడి చేసే సత్తా పాకిస్తాన్‌కు ఉంది. అయితే ప్రతిదాడి కోసం అమెరికా ప్రధాన భూభాగం లేదా గల్ఫ్ లేదా ఇజ్రాయెల్‌పై మేం దాడిచేయడం కష్టమవుతుంది. అవన్నీ మాకు సుదూరంగా ఉన్నాయి. సమీప లక్ష్యం మీదే మేం దాడిచేయగలం. అలాంటి సమీప లక్ష్యం ఒక్క భారత్ మాత్రమే. ఏమాత్రం ఆలస్యంచేయకుండా ముంబై, న్యూఢిల్లీలపై దాడులుచేస్తాం. తర్వాత ఏం జరుగుతుందనే దానితో మాకు సంబంధంలేదు. అప్పటి పరిస్థితులకు తగ్గట్లుగా అప్పటికప్పుడు నిర్ణయాలు తీసుకుంటాం"అని అన్నారు. "మాపై దాడులు జరుగుతున్నప్పుడు మాకు కనిపించే ఏకైక మార్గం ఇండియానే. భారత్‌లోని మెట్రోపాలిటన్ నగరాలపై దాడులు చేస్తాం"అని అన్నారు. దీంతో భవిష్యత్‌లో అమెరికాతో సంబంధాలు చెడిపోతే దాని విపరిణామాలను భారతే ఎదుర్కోవాల్సి ఉంటుంది అన్నట్లు బాసిత్ మాట్లాడటంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. శత్రుదేశం(అమెరికా)పై ఎదురుదాడి చేసే దమ్ములేక పొరుగుదేశంపై బాంబులేసే నిస్సహాయ పాకిస్తాన్ వైఖరి బాసిత్ మాటలతో బహిర్గతమైందని అంతర్జాతీయ రాజకీయవిశ్లేషకులు తప్పుబడుతున్నారు. "బాసిత్ వ్యాఖ్యలను తేలిగ్గా కొట్టేయడానికి వీల్లేదు. సైన్యం కనుసన్నల్లో నడిచే పాక్ ప్రభుత్వాల కుటిలనీతిలో నిర్లజ్జ నియమాలు ఎలా ఉంటాయో బాసిత్ మాటలు తేటతెల్లం చేస్తున్నాయి. యుద్ధం దక్షిణాసియాకు విస్తరిస్తే పాకిస్తాన్ పట్ల మనం ఇంకెంత అప్రమత్తంగా ఉండాలనే విషయాన్ని బాసిత్ మాటలు హెచ్చరిస్తున్నాయి"అని భారత నిఘా వర్గాలు సూచించాయి.

## భారత్‌కు భారీ ఉపశమనం

**టెహ్రాన్, మార్చి 21**

ప్రపంచ ఇంధన సరఫరాకు అత్యం త కీలకమైన హోర్ముజ్ జలసంధి గుండా ప్రయాణించేందుకు ఈ రెండు ఎల్పీజీ ట్యాం కర్లు సన్నద్ధమవుతున్నాయి. గత 24 గంటలుగా ఈ మార్గంలో ముడి చమురు రవాణా పూర్తిగా నిలిచిపోయినప్పటికీ, భారత్ నౌకలు 'పైన్ గ్యాస్', 'జగ్ వసంత' తమ ప్రయాణాన్ని తిరిగి ప్రారంభించే సూచనలు కనిపిస్తున్నాయి. ఇరాన్ హెచ్చరికల నేపథ్యంలో ఈ ప్రాంతం లో వందలాది నౌకలు నిలిచిపోయిన తరుణంలో, భారత నౌకల కదలికలు కీలకంగా మారాయి. ప్రపంచవ్యాప్తంగా సరఫరా అయ్యే చమురు, సహజ వాయువులో దాదాపు 20 శాతం ఈ ఇరుకైన జలసంధి గుండానే వెళుతుంది. ప్రస్తుతం ఈ ప్రాంతంలో అమెరికా –ఇజ్రాయెల్, ఇరాన్ మధ్య ఘర్షణ వాతావరణం నెలకొంది. తమపై ఆంక్షలు విధిస్తే గల్ఫ్ నుంచి వెళ్లే నౌకలను లక్ష్యంగా చేసుకుంటామని ఇరాన్ హెచ్చరించడంతో ఇంధన మార్కె ట్ ఆందోళనలో ఉంది. మార్చి 18న ఒక ఖాళీ చమురు ట్యాంకర్ వెనక్కి తిరిగి వెళ్లడం ఇక్కడి తీవ్రతకు అద్దం పడుతోంది. ప్రస్తుతం గల్ఫ్ ప్రాంతంలో భారత్కు చెందిన 22 నౌకలు ఉన్నాయి. వీటి సురక్షిత ప్రయాణం కోసం కేంద్ర విదేశీ వ్యవహారాల శాఖ తీవ్రంగా కృషి చేస్తోంది. భారత నౌకల ప్రయాణానికి ఎలాం టి ఆటంకం కలగకూడదని, సురక్షిత మార్గం ఉండాలని విదేశీ వ్యవహారాల శాఖ ప్రతినిధి రణధీర్ జైస్వాల్ స్పష్టం చేశారు. ప్రధాని నరేం ద్ర మోదీ కూడా ఈ విషయంలో ప్రపంచ దేశాల నాయకులతో సంప్రదింపులు జరుపుతున్నారు.

# ముగిస్తాం.. విరుచుకుపడతాం

**దుబాయ్, మార్చి 21**



ఈ దాడి యత్నం ద్వారా సుదీర్ఘ దూరంలోని లక్ష్యాలనూ ఢీ కొట్టగలమన్న సంకేతాన్ని పంపింది. మరోవైపు ఇరాన్‌లోని కీలక అణుశుద్ధి కేంద్రమైన నతాంజ్‌పై శనివారం అమెరికా బాంబుల వర్షం కురిపించింది. ఈ కేంద్రంపై గతేడాది జరిగిన 12 రోజుల యుద్ధంలోనూ అమెరికా తీవ్రస్థాయిలో దాడి చేసిన సంగతి తెలిసిందే. ఈ దాడులు.. ప్రతిదాడుల మధ్య అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కీలక ప్రకటన చేశారు. యుద్ధాన్ని ముగించే అవకాశాన్ని పరిశీలిస్తున్నట్లు పేర్కొన్నారు. ఇప్పటికే తాము చేపట్టిన సైనిక చర్యలు అనుకున్న లక్ష్యానికి చేరువయ్యాయని చెప్పారు. ట్రంప్ నుంచి ఈ ప్రకటన వెలువడిన కొద్ది సేపటికే.. వచ్చే వారం ఇరాన్‌పై తీవ్రస్థాయిలో విరుచుకుపడతామంటూ ఇజ్రాయెల్ భిన్నమైన ప్రకటన చేయ డం గమనార్హం. "ఇరాన్‌పై దాడులు మరింత ముమ్మరం కానున్నాయి. పశ్చిమాసియాలో ఇజ్రాయెల్ భద్రతకు, అమెరికా ప్రయోజనాలకు పొంచి ఉన్న ముప్పు తొలగిపోయే వరకు.. ఆ దేశ పాలనాయం త్రాంగాన్ని, కమాండర్లను, వ్యూహాత్మక సామర్థ్యాలను లక్ష్యంగా చేసుకుంటాం. యుద్ధ లక్ష్యాలన్నీ సాధించే వరకు విశ్రమించేది లేదు" అని ఇజ్రాయెల్ రక్షణ మంత్రి ఇజ్రాయెల్ కట్జ్ పేర్కొన్నారు. ముడి చమురు ధరల నియంత్రణపై దృష్టిపెట్టిన ట్రంప్ యంత్రాంగం ఇరాన్ చమురు విషయంలో కీలక నిర్ణయం తీసుకుంది. ఆ దేశ చమురుపై గతంలో విధించిన ఆంక్షలను తాత్కాలికంగా ఎత్తివేస్తున్నట్లు ప్రకటించింది.

నతాంజ్ అణుశుద్ధి కేంద్రంపై వైమానిక దాడులు జరిగాయని ఇరాన్ శనివారం ప్రకటించింది. అయితే అణుకేంద్రం నుంచి ఎలాంటి రేడియేషన్ వెలువడలేదని పేర్కొంది. దాడి సమాచారాన్ని ఐక్యరాజ్యసమితికి చెందిన అంతర్జాతీయ అణు ఇంధన సంస్థ (ఐఏఈఏ)కు అందించినట్లు పేర్కొంది. అయితే తాము దాడి చేయలేదని ఇజ్రాయెల్ సైన్యం పేర్కొంది. అమెరికా చేసిందా లేదా అన్న విషయంపై స్పష్టత వ్వలేదు. నతాంజ్‌పై ఈ నెల తొలివారంలోనూ దాడి జరిగింది. ఈ అణుకేంద్రంపై దాడిని రష్యా ఖండిం చింది. ఇది అంతర్జాతీయ న్యాయసూత్రాలను ఉల్లంఘిం చడమేనని పేర్కొంది.

ఇరాన్‌పై సాధించిన సైనిక విజయాలను వివరిస్తూ తన సొంత సామాజిక మాధ్యమం 'ట్రూత్ సోషల్' వేదికగా ట్రంప్ పోస్టు పెట్టారు. ఇరాన్‌పై సైనిక చర్యను ముగించే విషయంపై ఆలోచిస్తున్నట్లు వెల్లడించారు. ఇరాన్ క్షిపణి సామర్థ్యాలను, వైమానిక, నౌకా వ్యవస్థలను పూర్తిగా ధ్వంసం చేసినట్లు తెలిపారు. ఆ దేశం మరోసారి అణ్వాయుధాలను తయారుచేయకుం డా అమెరికా చూసుకుంటుందన్నారు. ఒకవేళ అలాంటి పరిస్థితి వస్తే.. తాము తగిన విధంగా స్పందిస్తామని హెచ్చరించారు. ఇరాన్‌పై తీవ్రస్థాయిలో దాడులు చేస్తున్న అమెరికా ఆ దేశ చమురుపై తాత్కాలికంగా ఆంక్షలను ఎత్తివేస్తూ నిర్ణయం తీసుకుంది. వచ్చే నెల 19 వరకు ఇరాన్ చమురును ఏ దేశమైనా దిగుమతి చేసుకోవచ్చని అమెరికా ఆర్థికశాఖ మంత్రి స్కాట్ బెసెంట్ పేర్కొన్నారు. ఇప్పటికే నౌకల్లో ఉన్న ఇరాన్ చమురుకు మాత్రమే ఈ మినహాయింపు వర్తిస్తుందని స్పష్టంచేశారు. యుద్ధం కారణంగా పెరుగుతున్న ముడి చమురు ధరలను నియంత్రించడానికి అమెరికా తీవ్ర ప్రయత్నాలు చేస్తోంది. ఆ నేపథ్యంలోనే ఇటీవల రష్యా చమురుపైనా ఆంక్షలు తాత్కాలికంగా ఎత్తివేస్తూ నిర్ణయం తీసుకుంది. అమెరికా నిర్ణయంపై ఇరాన్ స్పందించింది. ప్రస్తుతం అంతర్జాతీయ మార్కెట్లకు సరఫరా చేసేందుకు తమ వద్ద అదనపు చమురు లేదని స్పష్టం చేసింది. చమురు సరఫరాపై ఆందోళనలు తగ్గించేందుకు, కొనుగోలుదారులకు భరోసా ఇవ్వడం కోసం అమెరికా ఈ ప్రకటన చేసిందని ఆరోపించింది.

### టెహ్రాన్, బీరుట్‌పై ఇజ్రాయెల్ దాడులు

ఇరాన్ రాజధాని టెహ్రాన్, లెబనాన్ రాజధాని బీరుట్‌లపై శనివారం ఇజ్రాయెల్ దాడులు నిర్వహించింది. సెంట్రల్ బీరుట్‌లో భారీ పేలుళ్ల శబ్దాలు వినిపించాయి. లెబనాన్‌పై ఇజ్రాయెల్ చేస్తున్న దాడుల్లో ఇప్పటివరకు 1000 మంది ప్రాణాలు కోల్పోయారు. 10 లక్షల మందికి పైగా పౌరులు నిరాశ్రయులయ్యారు.

ఇజ్రాయెల్ తమ నిఘా కేంద్ర కార్యాలయంపై దాడి చేసి ఓ అధికారిని హతమార్చిందని ఇరాన్ పేర్కొంది.

ఇజ్రాయెల్, గల్ఫ్ దేశాలపై ఇరాన్ దాడులు శనివారమూ కొనసాగాయి. టెహ్రాన్ క్షిపణి దాడిలో చిన్న పిల్లల పాఠశాల భవనమొకటి దెబ్బతిందని ఇజ్రాయెల్ పేర్కొంది. ఎవరికీ గాయాలు కాలేదని వెల్లడించింది. ఇజ్రాయెల్‌లోని దిమోనాపై ఇరాన్ శనివారం సాయంత్రం జరిపిన క్షిపణి దాడిలో 21 మంది గాయపడ్డారు. ఇరాన్ క్షిపణి నేరుగా ఓ భవంతిని తాకడంతో అది ధ్వంసమైంది.

బహ్రెయిన్ రాజధాని మనామాపై ఇరాన్ క్షిపణులు ప్రయోగించినట్లు తెలుస్తోంది. మనామాలో బాంబుల శబ్దాలు వినిపించాయని స్థానికులు పేర్కొన్నారు.

ఇరాన్ ప్రయోగించిన మూడు బాలిస్టిక్ క్షిపణులను, 8 డ్రోన్లను అడ్డుకున్నామని యూఏఈ రక్షణ మంత్రిత్వశాఖ తెలిపింది. తమ చమురు క్షేత్రాలపైకి దూసుకొస్తున్న 20 డ్రోన్లను కూల్చినట్లు సౌదీ పేర్కొంది.

కొత్త సంవత్సర పండగైన నౌరోజ్ వేడుకలు జరుపుకోంటున్న ఇరానియన్లకు రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ శుభాకాంక్షలు తెలిపారు. ప్రస్తుతం ఎదురవుతున్న తీవ్రమైన పరీక్షలను ఇరాన్ గౌరవప్రదంగా అధిగమిస్తుందన్న ఆశాభావాన్ని ఆయన వ్యక్తంచేశారు. ఇరాన్‌కు నమ్మకమైన స్నేహితుడిగా, విశ్వసనీయమైన భాగస్వామిగా మాస్కో ఉంటుందని తెలిపారు. హర్మూజ్ జలసంధిపై దాడులు ఆపాలని బ్రిటన్, ఫ్రాన్స్, జపాన్, బహ్రెయిన్, యూఏఈ సహా 22 దేశాలు ఇరాన్‌కు శనివారం సూచించాయి. ప్రపంచ చమురు, సహజవాయువు సరఫరాలకు కీలకమైన ఈ జలసంధిని తెరవాలని విజ్ఞప్తి చేశాయి.

హిందూ మహా సముద్రంలోని బ్రిటన్–అమెరికా సంయుక్త సైనిక స్థావరమైన డిగో గార్సియాపై ఇరాన్ రెండు మధ్యశ్రేణి బాలిస్టిక్ క్షిపణులు ప్రయోగించింది. ఈ స్థావరం.. ఇరాన్‌కు దాదాపు 4 వేల కిలోమీటర్ల దూరంలో ఉంది. అయితే ఇరాన్ ప్రయోగించిన క్షిపణులు లక్ష్యాన్ని చేరలేదని సమాచారం. ఒక క్షిపణి మార్గం మధ్యలోనే విఫలమైంది. మరొకదాన్ని అమెరికా అడ్డుకుందని తెలుస్తోంది. ఈ దాడిని బ్రిటన్ తీవ్రంగా ఖండించింది. "పశ్చిమాసియా వ్యాప్తంగా దాడులు చేయడం, హర్మూజ్ జలసంధిని మూసివేయడం.. బ్రిటన్ ప్రయోజనాలకు, మా మిత్రులకు ముప్పు" అని బ్రిటన్ రక్షణ శాఖ పేర్కొంది. డిగో గార్సియాపై దాడి వివరాలను మాత్రం బ్రిటన్ అధికారులు వెల్లడించలేదు. యూఎస్ బాంబర్లు.. ఇరాన్‌పై దాడి చేయడానికి తమ వైమానిక స్థావరాలను వినియోగించుకోవచ్చని బ్రిటన్ శుక్రవారం తెలిపింది. దీనిపై ట్రంప్ స్పందించారు. బ్రిటన్ ఈ నిర్ణయాన్ని ఇంకా వేగంగా తీసుకోవాల్సిందని అన్నారు. బ్రిటన్ తీసుకున్న ఈ నిర్ణయంపై ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాఘ్చీ తీవ్రంగా స్పందించారు. బ్రిటన్ ప్రభుత్వం తన సొంత ప్రజల ఇష్టానికి వ్యతిరేకంగా అమెరికా–ఇజ్రాయెల్ యుద్ధంలో భాగస్వామి అవుతోందని ఆయన విమర్శించారు. దీనివల్ల బ్రిటన్ ప్రజల ప్రాణాలు ప్రమాదంలో పడతాయని హెచ్చరించారు.

# సేవాగుణంలోనే ఆమె జ్ఞాపకం





● ఆశ్రమ పిల్లలకు అన్నదానం

**నార్పల, మార్చి 21**

మండల కేంద్రానికి చెందిన సాకే కృష్ణమూర్తి, కమలమ్మల కుమార్తె బుడగల ఉమాదేవి ప్రథమ వర్ధంతిని పురస్కరించుకుని ఆమె కుటుంబ సభ్యులు సేవా దృక్పథాన్ని చాటుకున్నారు. ఏడాది క్రితం స్వర్గస్తు రాలైన ఉమాదేవి జ్ఞాపకార్థం, వారి కుటుంబ సభ్యులు నార్పల మండల కేంద్రం సమీపంలోని సత్యసా యి ఆశ్రమంలో ఉంటున్న చిన్నారులకు ఒకరోజు అన్న వితరణ (అన్నదానం) కోసం రూ. 4,000 నగదు ను దివంగత ఉమాదేవి భర్త, రాప్తాడు జర్నలిస్ట్ బుడగల శ్రీనివాసులు, కుమారుడు అక్షయ్ సాగర్, కుమార్తె నిత్యశ్రీలు ఆశ్రమ నిర్వాహకులకు ఆర్థిక సాయంగా అందజేశారు. ఈ సందర్భంగా నిరుపేదలకు, అనాథ పిల్లలకు అండగా నిలవడమే ఉమాదేవికి ఇచ్చే నిజమైన నివాళి అని ఈ సందర్భంగా వారు పేర్కొన్నారు. ఆడంబరాలకు పోకుండా ఆమె స్మృతిలో ఇటువంటి సేవా కార్యక్రమాలు నిర్వహించడం పట్ల స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. తోటి వారికి సాయం చేయ డంలో ఉమాదేవి ఎప్పుడూ ముందుండేవారని, ఆమె ఆశయాలకు అనుగుణంగానే ఈ కార్యక్రమం చేపట్టి నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో కుటుంబ సభ్యులు సాకే రాజశేఖర్, కళావతి, తలారి కుమారి, శివ, హర్ష, లోహిత్ రాజ్, తదితరులు పాల్గొన్నారు.

## మసీదు పునర్నిర్మాణానికి

# వైఎస్ఆర్‌సీపీ నాయకుల రూ. 2.60 లక్షల విరాళం

● గన్నవరం మాజీ ఎమ్మెల్యే డాక్టర్ వల్లభనేని వంశీ మోహన్ సూచన మేరకు, మసీదు కమిటీకి నిధుల అందజేత



**విజయవాడ రూరల్, మార్చి 21**

రంజా పండుగను పురస్కరించుకుని, గన్నవరం నియోజకవర్గం పరిధిలోని ఎన్‌టీఆర్ జిల్లా, విజయవాడ రూరల్ మండలం, పి. నైనవరం గ్రామంలోని మసీదు పునర్నిర్మాణం కోసం వైఎస్ఆర్‌సీపీ నాయకులు ఉదారంగా ఆర్థిక సహాయం అందించారు. గన్నవరం మాజీ ఎమ్మెల్యే డాక్టర్ వల్లభనేని వంశీ మోహన్, గొల్లపూడి వ్యవసాయ మార్కెట్ కమిటీ (ఏఎంసీ) మాజీ చైర్మన్, సీనియర్ వైఎస్ఆర్‌సీపీ నాయకులు కొమ్మ కోటేశ్వరరావు (కోట్లు) మార్గదర్శకత్వంలో ఈ కార్యక్ర మం శనివారం జరిగింది. ఈ మంచి కార్యానికి సహ కరించేందుకు పలువురు స్థానిక నాయకులు మరియు ప్రజా ప్రతినిధులు ముందుకు వచ్చారు. రంజాన్ పండుగ వేడుకల సందర్భంగా శనివారం నాడు, పి. నైనవరం మసీదు కమిటీకి మొత్తం రూ. 2.60 లక్షల విరాళం అందజేయబడింది. ఇందులో రూ. 1 లక్షను వైఎస్ఆర్‌సీపీ విజయవాడ రూరల్ మండల అధ్యక్షుడు అంగజాల హనుమాన్, మాజీ ఎంపీపీ యార్లారెడ్డి నాగిరెడ్డి, పార్టీ నాయకులు దేవగిరి ఓంకర్ రెడ్డి, కలకోటి బ్రహ్మానంద రెడ్డి, భీమవరపు శివరామి రెడ్డి, కలపాల అబ్రహం, నల్లమోతు చంద్రశేఖర్, జి. సీనయ్య తదితరులు సమిష్టిగా సమకూర్చారు. విజయవాడ రూరల్ మండలం మాజీ వైస్ ఎంపీపీ, నున్న గ్రామం మాజీ సర్పంచ్ జీతం శ్రీనివాసరావు రూ. 50,000 విరాళంగా ఇచ్చారు. అదేవిధంగా, పి. నైనవరం వైఎస్ఆర్‌సీపీ అధ్యక్షుడు దావు వెంకటేశ్వరరావు (డీవీఆర్) రూ. 50,000, గ్రామ సర్పంచ్ బట్టా సోమయ్య కూడా రూ. 50,000 విరాళం అందించారు. పునర్నిర్మాణ పనుల కోసం మాజీ సర్పంచ్ దావు కోటేశ్వ రరావు అదనంగా రూ. 10,000 సమకూర్చారు. అనంతరం, వైఎస్ఆర్‌సీపీ నాయకులు పి. నైనవరం లోని మసీదు వద్ద జరిగిన రంజాన్ వేడుకల్లో పాల్గొని, మసీదు కమిటీ సభ్యులు, ముస్లిం సమాజ పెద్దలకు తాము సేకరించిన విరాళాలను లాంఛనంగా అందజే శారు. ఈ చర్యను స్థానిక నివాసితులు అభినందించారు, గ్రామంలో మత సామరస్యాన్ని ప్రోత్సహించి, మతపరమైన మౌలిక సదుపాయాలకు మద్దతు ఇచ్చినందుకు నాయకులను ప్రశంసించారు.

# ధర్మాచరణము ద్వారా పాపము నశిస్తుంది

● డాక్టర్ మల్లు వేంకట రెడ్డి, తితిదే

● మన్నెగుంటలో ఘనంగా ముగిసిన తితిదే ధార్మిక కార్యక్రమాలు





**కర్నూలు, మార్చి 21**

మానవజాతి మనుగడకు ధర్మాచరణమే ఆధారమని, ధర్మాన్ని ఆచరిస్తే సమస్త పాపముల నుండి విముక్తుడ వుతాడని, ఇహమునందు, పరమునందు సుఖ సంతో షాలతో వర్ధిల్లుతాడని, అటువంటి ధర్మాచరణ ప్రతి మానవుడి కర్తవ్యం కావాలని తిరుమల తిరుపతి దేవస్థా నములు హిందూ ధర్మ ప్రచార పరిషత్తు ఉమ్మడి కర్నూ లు జిల్లా శాఖ కార్యనిర్వాహకులు డాక్టర్ మల్లు వేంకట రెడ్డి పిలుపునిచ్చారు. తిరుమల తిరుపతి దేవస్థాన ములు హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో క్రిష్ణగిరి మండలం, మన్నెగుంట గ్రామంలోని శ్రీ సుంకుల పరమేశ్వరి దేవస్థానం నందు గత ఐదు రోజులుగా నిర్వహిస్తున్న ధార్మిక, ఆధ్యా త్మిక, సాంస్కృ తిక కార్యక్ర మాలు గోపూజ మరియు కుంకుమార్చన కార్యక్ర మాలతో ఘనంగా ముగి శాయి. ముగింపు సందర్భంగా నిర్వహించిన ధార్మిక సభా కార్యక్రమంలో వారు ప్రవచించారు. స్వాత్మానం దస్వామి మరియు తెలుగు పండితులు డాక్టర్ ఎం. మధుసూదనాచార్యులు చేసిన ధార్మిక ప్రవచనాలు, స్థానిక భజన మండలి నిర్వహించిన భజన కార్యక్ర మాలు భక్తులను పరవశిం పచేశాయి. తిరుమల తిరుపతి దేవస్థానములనుండి ఏర్పాటు చేసిన ఈ ధార్మిక కార్యక్రమాలు గ్రామ ప్రజలలో ఎంతో భక్తి భావ నను కలిగించాయని భాం తీయ జనతా పార్టీ క్రిష్ణగిరి మండల అధ్యక్షులు సి. రామలింగం కొనియాడారు. ఈ కార్యక్రమంలో ధర్మప్ర చారకులు బోయ వేంకటేశ్వర్లు, చిందుకూరి నడిపి వెంకటేశ్వర్లు, సి. రాముడు, కూరా కుల రాముడు, చిన్న హనుమంతు, పూల వెంకటేశ్వర్లు, పెద్దకురువ బజారి, కె. వెంకటేశ్వర్లు, పూజారి చిందుకూరి వెంకట రాము డు, బోయ చంద్రన్న, లక్ష్మీదేవి, వి.రాముడు, కె. సుంక న్న,కె. లచ్చప్ప, కె. నాగరాజు, మరియు భజన మండలి సభ్యులతో పాటు పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

# పేద ముస్లింలకు సహాయం

● రంజాన్ సందర్భంగా మంత్రి పార్ధసారధి దాతృత్వం

● 1500 మందికి వస్త్రాలు పంపిణీచేసిన మంత్రి



నూజివీడు పట్టణంలో రంజాన్ సందర్భంగా రాష్ట్రగృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్ధసారధి దర్గాలో ముస్లిం సోదరులత కలిసి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం ముస్లిం సోదరులను వ్యక్తిగతంగా పలకరించి రంజాన్ శుభాకాంక్షలు తెలియజేస్తూ సోదరభావంతో ఆలింగనం చేసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రిపేద ముస్లిం సోదరులకు దానధర్మాలు నిర్వహించారు. రంజాన్ పర్వదినానికి ముందుగానే తన సొంత నగదు నుంచి సుమారు రూ. 15 లక్షలు వెచ్చించినియోజక వర్గంలోని సుమారు 1,500 మంది ముస్లిం సోదరులకు నూతన వస్త్రాలను కానుకగా అందజేశారు. దీంతో పండుగకు ముందే ఆనందాన్ని పంచినట్లు అయ్యింది. మంత్రి పార్ధసారధి మాట్లాడుతూ రంజాన్ పండుగ శాంతి, సహనం, పరమత సహనం, క్రమశిక్షణకు ప్రతీక అని తెలిపారు. ఉపవాసం ద్వారా ఆత్మ నియంత్రణ పెరుగుతుందని, ప్రేమ, త్యాగం, సహాయం వంటి విలువలను ముస్లిం సోదరులు సమాజానికి చాటుతు న్నారని అన్నారు. పవిత్ర ఖురాన్ అవతరించిన ఈ నెల ఎంతో విశిష్టమైందని, ప్రతి ముస్లిం తన ఆదాయంలో కొంత భాగాన్ని పేదలకు పంచడం ద్వారా సమానత్వ భావన పెంపొందుతుందని పేర్కొన్నారు. మైనార్టీల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి తెలిపారు. ఇప్పటికే ముస్లిం సోదరుల సంక్షేమానికి సుమారు రూ. 180 కోట్లు కేటాయించామని, హజ్ యాత్ర కోసం రూ. 100 కోట్లు మంజూరు చేసినట్లు వెల్లడించారు. వచ్చే బక్రీద్ నాటికి ఈద్గా నిర్మాణాన్ని పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. త్వరలో షాదీఖానా నిర్మాణాన్ని పూర్తిచేసి ఆధునిక సౌకర్యాలతో అందుబాటులోకి తీసుకువస్తామని తెలిపారు. కడప, విజయవాడ దర్గాల అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించామని పేర్కొన్నారు. రాష్ట్ర వక్ఫ్ బోర్డు నూతన కమిటీ చురుకుగా పనిచేస్తోందని ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, ముస్లిం మత పెద్దలు, స్థానిక నాయకులు, ప్రజలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.



# జీజీహెచ్‌లో ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ తనిఖీలు

## వైద్యసేవలతో పాటు యూత్ టైం బ్యాంకు సేవల పరిశీలన

**విజయవాడ, మార్చి 21**

ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డా. లక్ష్మీశ శనివారం విజయవాడలోని న్యూ జీజీహెచ్‌ను సందర్శించి ఆసుపత్రి ద్వారా రోగులకు అందుతున్న సేవలను పరిశీలించారు. అదేవిధంగా ఆసుపత్రిలో ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన యూత్ టైం బ్యాంక్ సేవలను ఈరోజు పరిశీలించారు. ఈరోజు యూత్ టైం బ్యాంక్ సేవల్లో భాగంగా నలంద డిగ్రీ కళాశాల యూత్ రెడ్ క్రాస్ 31 మంది వాలంటీర్లు, వాసవ్య మహిళా మండలి వాలంటీర్లు ఆసుపత్రికి వచ్చిన రోగులకు సేవలు అందించారు. ఆసుపత్రిలోని ఓపీడీ కౌంటర్, క్యాజువాలిటీ వార్డు, ఫార్మసీ, ఎక్స్‌రే, జనరల్ సర్జికల్ ఓపీ, ఆర్థో ఓపీ, న్యూరో వార్డ్, మెయిన్ బ్లాక్, డా. ఎన్టీఆర్ వైద్యసేవ తదితర ప్రాంతాల్లో టైం బ్యాంక్ వాలంటీర్లు ఎంతో ఉత్సాహంగా సేవలు అందించగా కలెక్టర్ లక్ష్మీశ సంతృప్తి వ్యక్తం చేశారు. యూత్ టైం బ్యాంక్ మొబైల్ యాప్‌ను పరిశీలించి వాలంటీర్, రోగి వివరాలు టైం బ్యాంకులో నమోదయ్యే విధంగా చర్యలు చేపట్టారు. ఇంత మంచి కార్యక్రమంలో భాగస్వాములు అయిన వాలంటీర్లను కలెక్టర్ లక్ష్మీశ అభినందించారు. కార్యక్రమంలో జిల్లా యువజన సంక్షేమ శాఖ ముఖ్య కార్యనిర్వాహణాధికారి డా. కొల్లేటి రమేష్, సూపరింటెండెంట్ డా. ఏడుకొండలు, నలంద కళాశాల యూత్ రెడ్ క్రాస్ కోఆర్డినేటర్ సుబ్బారావు, రెడ్ క్రాస్ జిల్లా కోఆర్డినేటర్ కనకరాజు, ఆసుపత్రి అధికారులు, వాసవ్య మహిళా మండలి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# రైజ్ ఆధ్వర్యంలో నేటివ్ అరకు కాఫీ వర్క్‌షాప్

## ఎస్‌హెచ్‌జీ మహిళలకు స్వయం ఉపాధి అవకాశాలపై అవగాహన

## మహిళల సాధికారతకు ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ ప్రోత్సాహం




**విజయవాడ, మార్చి 21**

విజయవాడ రూరల్ మండలంలోని గొల్లపూడి డీఆర్‌డీఏ కార్యాలయంలో రైజ్ కేంద్రం ఆధ్వర్యంలో శనివారం నేటివ్ అరకు కాఫీపై ప్రత్యేక వర్క్‌షాప్ నిర్వహించారు. గ్రామీణ మహిళలలో స్వయం ఉపాధి అవకాశాలపై అవగాహన కల్పించడం, ఆర్థికంగా స్వావలంబన దిశగా ముందుకు నడిపించడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశ్యం. ఈ కార్యక్రమంలో 102 మంది స్వయం సహాయక సంఘాల (ఎస్‌హెచ్‌జీ) మహిళలు పాల్గొనగా.. నేటివ్ అరకు కాఫీ సంస్థ సీఈవో రామ్ కుమార్ వర్మ ప్రస్తుతం కాఫీ రంగంలో ఉన్న విస్తృత అవకాశాలపై సమగ్రంగా వివరించారు. అరకు ప్రాంతానికి చెందిన కాఫీ ప్రత్యేకతలు, సహజ పద్ధతుల్లో సాగు, నాణ్యమైన గింజల ఎంపిక, ప్రాసెసింగ్ విధానాలతో పాటు పలు సాంకేతిక అంశాలను వివరించారు. అదేవిధంగా విలువ ఆధారిత కాఫీ ఉత్పత్తుల తయారీ విధానాలపై అవగాహన కల్పించారు. మార్కెటింగ్ పరంగా స్థానిక మార్కెట్లు, బ్రాండింగ్, ప్యాకేజింగ్ ప్రాధాన్యత, వినియోగదారుల అభిరుచులకు అనుగుణంగా ఉత్పత్తులను అభివృద్ధి చేయడం వంటి అంశాలపై సూచనలు ఇచ్చారు. ఈ కార్యక్రమానికి హాజరైన జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ మాట్లాడుతూ మహిళల ఆర్థిక సాధికారతకు ఇలాంటి శిక్షణ కార్యక్రమాలు ఎంతో దోహదపడతాయని పేర్కొన్నారు. స్వయం సహాయక సంఘాల మహిళలు కొత్త రంగాలలో నైపుణ్యాలను సంపాదించి, స్వయం ఉపాధి ద్వారా కుటుంబ ఆర్థిక స్థితిని మెరుగుపరచాలని సూచించారు. ప్రభుత్వ పథకాల ద్వారా అందుబాటులో ఉన్న రుణ సదుపాయాలు, శిక్షణా కార్యక్రమాలను వినియోగించుకోవాలని సూచించారు. రైజ్ కేంద్రం ద్వారా మహిళలకు మరిన్ని ఉపాధి అవకాశాలను కల్పించే కార్యక్రమాలను కొనసాగించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ ఏఎన్‌వీ నాంచారరావు తదితరులు పాల్గొన్నారు.

## ఆంధ్రాభద్రాద్రిగా రామదుర్గం

# క్షేత్రాన్ని అభివృద్ధి చేసుకుందాం

### బిజెపి సీనియర్ నేత ఏపీ ఆర్ చౌదరి



**రంపచోడవరం, మార్చి20**

తూర్పుగోదావరి జిల్లా, పోలవరం జిల్లాల సరిహద్దునున్న పురాతన పుణ్యక్షేత్రం రామదుర్గం ఆలయానికి బిజెపి సీనియర్ నాయకులు ఎపిఆర్ చౌదరి, మట్టా మంగరాజు ఆధ్వర్యంలో రహదారి నిర్మాణం ప్రారంభమైంది. శ్రీరామనవమికి వేలా దిగా వచ్చే భక్తుల సౌకర్యార్థము గ్రేవల్ రోడ్డు నిర్మాణాన్ని చేపట్టడం జరిగిం దని ఏపీ ఆర్ చౌదరి, మట్టా మంగరాజు తెలిపారు ఈ సందర్భంగా ఏపీ ఆర్ చౌదరి మాట్లాడుతూ భద్రాచల క్షేత్రం తెలంగాణకు వెళ్ళిపోయింది కనుక రామదు ర్గం క్షేత్రాన్ని మన ప్రాంతానికి ప్రధాన శ్రీరామ క్షేత్రముగా అభివృద్ధి చేసుకో వలసిన బాధ్యత ఈ ప్రాంతంలో ఉన్నటువంటి రామ భక్తులందరి పైన ఉందని అందు కోసం ఈ సంవత్సరము నుండి శ్రీరామ నవమి ఉత్సవాలు రామదుర్గం కొండపైన అంగరంగ వైభవంగా నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు.

# జగ్గయ్యపేటలో అంగరంగ వైభవంగా రంజాన్ వేడుకలు





● మతసామరస్యానికి ప్రతీకగా ఈద్గా ఉత్సవం

**జగ్గయ్యపేట, మార్చి 21** జగ్గయ్యపేట పట్టణంలో రంజాన్ పండుగ వేడుకలుభక్తిశ్రద్ధల మధ్య అంగరంగ వైభవంగా నిర్వహించారు. పట్టణంలోని బలుసుపాడు రోడ్డులో గల ఈద్గామైదానంలో నిర్వహించిన సామూహిక నమాజ్‌లోవేలాది మంది ముస్లిం సోదరులు పాల్గొని అల్లాహ్ కృపకోసం ప్రార్థనలు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా స్థానిక ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్(తాతయ్య), కేడీసీసీ బ్యాంక్ చైర్మన్ నెట్టెం రఘురాం,మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర హాజరై ముస్లిం సోదరులకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య)మాట్లాడుతూ రంజాన్ పండుగ క్రమశిక్షణ, దాతృత్వానికి ప్రతీకగా నిలుస్తుందని అన్నారు. జగ్గయ్యపేటఎల్లప్పుడూ మత సామరస్యానికి నిలయమని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ తమ మతాన్ని గౌరవించడమే కాకుండా ఇతర మతాల పట్ల గౌరవభావం కలిగి ఉండాలని, అప్పుడే సమాజంలో శాంతి నెలకొంటుందని తెలిపారు. మైనార్టీల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్న ఆయన, ఈద్గా అభివృద్ధికి సహకరించిన కమిటీ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. అందరికీ సుఖసంతోషాలు కలగాలని ఆకాంక్షించారు. కేడీసీసీ బ్యాంక్ చైర్మన్ నెట్టెం రఘురాం మాట్లాడుతూ రంజాన్ పండుగ సమైక్యతకు ప్రతీక అని, కులమ తాలకు అతీతంగా అందరూ కలిసి జీవించాలనే సందే శాన్ని ఇస్తుందని అన్నారు. మైనార్టీల ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వం పలు పథకాలు అమలు చేస్తోందని తెలిపారు. మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర మాట్లాడుతూ మున్సిపాలిటీ పరిధిలో మైనార్టీలకు అవసరమైన అన్ని సౌకర్యా లు కల్పిస్తున్నామని తెలిపారు. పట్టణ అభివృద్ధిలో ముస్లిం సోదరుల భాగస్వామ్యం కీలకమని అన్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వం అమలు చేస్తున్న పలు సంక్షేమ పథకాలను నేతలు వివరించారు. ఇమామ్‌లు, మౌజన్లకు గౌరవ వేతనాలు, హజ్ యాత్ర సబ్సిడీ, ముస్లిం యువతుల వివాహాల కోసం దుల్హన్ పథకం, హమామ్‌ల మరమ్మతులకు నిధుల విడుదల వంటి చర్యలు మైనార్టీల సంక్షేమానికి దోహదపడుతున్నాయని తెలిపారు. ఈద్గా మైదానంలో సుమారు రూ.10 లక్షల వ్యయంతో చేపట్టిన అభివృద్ధి పనులు- చప్టా నిర్మాణం, ప్రహరీ గోడ, నీటి సౌకర్యం- పూర్తి చేసినందుకు ఈద్గా కమిటీ సభ్యులు ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ (తాత య్య), యువ నాయకుడు శ్రీరాం చిన్నబాబు, మున్సిపల్ చైర్మన్ రాఘవేంద్రకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. మైనార్టీల సమస్యలపై వెంటనే స్పందిస్తున్న ఎమ్మెల్యే తాతయ్య చొరవను ముస్లిం సోదరులు కొనియాడారు. ఈ కార్యక్ర మంలో మైనార్టీ నాయకులు, మసీదు కమిటీ సభ్యులు, పట్టణ ప్రముఖులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

# బహుజనసేన జిల్లా కార్యదర్శిగా నాగరాజు నియామకం



**చిత్తూరు, మార్చి 21**

చిత్తూరు జిల్లా బహుజనసేన జిల్లా కార్యదర్శిగా రామకుప్పం మండలం విజిలాపురం గ్రామానికి చెందిన నాగరాజును నియమించారు. బహుజనసేన వ్యవస్థాపక అధ్యక్షులు చందు ఆదేశాల మేరకు రాష్ట్ర కార్యదర్శి గోవిందప్ప, జిల్లా అధ్యక్షుడు బుర్ర సతీష్ ఆధ్వర్యంలో ఈ నియామకం శనివారం జరిగింది. గత 15 సంవత్సరాలుగా బడుగు బలహీన వర్గాల హక్కుల కోసం నిరంతరం పోరాటం చేస్తున్న నాగరాజు సేవలను గుర్తిస్తూ ఆయనను జిల్లా కార్యవర్గంలోకి తీసుకున్నట్లు నాయకులు తెలిపారు. సమాజంలోని పీడిత వర్గాల సమస్యలను బహుజనసేన వేదికగా మరింత బలంగా ముందుకు తీసుకువెళ్లాలని, పార్టీ అభివృద్ధికి కృషి చేయాలని ఈ సందర్భంగా నాయకులు ఆకాంక్షించారు. నూతన బాధ్యతలు స్వీకరించిన నాగరాజు మాట్లాడుతూ, తనపై నమ్మకం ఉంచి బాధ్యతలు అప్పగించిన పార్టీ నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. బడుగు బలహీన వర్గాల సంక్షేమం కోసం మరింత కృషి చేస్తానని, పార్టీ సిద్ధాంతాలను గ్రామ స్థాయిలో బలపరచడానికి కట్టుబడి ఉంటానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో విజిలాపురం గ్రామానికి చెందిన పార్టీ కార్యకర్తలు, నాయకులు పాల్గొని నాగరాజుకు శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమం ముగింపులో "జై భీమ్" నినాదాలతో సభ ముగిసింది.



# 25న కుప్పంలో మెగా జాబ్ మేళా

చిత్తూరు జిల్లా కుప్పంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈ నెల 25వ తేదీ బుధవారం మెగా జాబ్ మేళాను నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ ఎల్.బి. ప్రదీప్ కుమార్ తెలిపారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాల మరియు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో ఈ జాబ్ మేళా ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కుప్పం నియోజకవర్గంలో నిరుద్యోగ సమస్యను తగ్గించే లక్ష్యంతో డాక్టర్ కంచర్ల శ్రీకాంత్ దార్శనికతలో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. దాదాపు 3000 మంది నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించడమే ప్రధాన ఉద్దేశ్యమని అన్నారు. ఈ జాబ్ మేళాలో సుమారు 33 ప్రముఖ కంపెనీల ప్రతినిధులు పాల్గొని అభ్యర్థులను ఎంపిక చేయ నున్నట్లు చెప్పారు. ఇంటర్మీడియట్, డిగ్రీ, పాలిటెక్నిక్, ఐటీఐ, ఇంజనీరింగ్, ఎంబీఏ, ఎంసీఏ అర్హతలు కలిగిన నిరుద్యోగ యువతీ యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఎంపికైన అభ్యర్థులకు నెలకు రూ.15,000 నుండి రూ.40,000 వరకు వేతనం లభించే అవకాశముందని తెలిపారు. కాబట్టి చిత్తూరు జిల్లా పరిధిలోని నిరుద్యోగ యువతీ యువకులు ఈ నెల 25వ తేదీ బుధవారం ఉదయం 10 గంటలకు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జరిగే మెగా జాబ్ మేళాకు హాజరై అవకాశాన్ని వినియోగించుకోవాలని ప్రిన్సిపల్ పిలుపునిచ్చారు.

# పల్లె ప్రాంతాల ప్రగతే కూటమి ప్రభుత్వ ధ్యేయం

- స్వచ్ఛాంధ్ర సాధనే ఏపీ సీఎం చంద్రబాబు లక్ష్యం
- పూతలపట్టు నియోజకవర్గం సర్వతోముఖాభివృద్ధి కోసం అహర్నిశలు శ్రమిస్తున్నాం
- చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు, ఎమ్మెల్యే మురళీమోహన్
- తవణంపల్లి మండలంలో పలు అభివృద్ధి, ప్రారంభోత్సవ కార్యక్రమాల్లో పాల్గొన్న ఎంపీ, ఎమ్మెల్యేలు





పల్లె ప్రాంతాల ప్రగతే కూటమి ప్రభుత్వ ధ్యేయమని చిత్తూరు పార్లమెంటు సభ్యులు దగ్గుమళ్ళ ప్రసాదరావు, పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్ ఉద్ఘాటించారు. స్వచ్ఛాంధ్ర సాధనే లక్ష్యంగా రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పనిచేస్తున్నారని, సీఎం కృషిని కొనియాడారు. ముఖ్యమంత్రి చంద్రబాబు స్ఫూర్తి, ఆయన ప్రోత్సాహంతో పూతలపట్టు నియోజకవర్గం సర్వతోముఖాభివృద్ధి కోసం అహర్నిశలు శ్రమిస్తున్నామని ఎంపీ, ఎమ్మెల్యేలు తెలియజేశారు. పూతలపట్టు నియోజకవర్గం, తవణంపల్లి మండలంలో శనివారం నిర్వహించిన పలు అభివృద్ధి పనులు, ప్రారంభోత్సవ కార్యక్రమాల్లో ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు, ఎమ్మెల్యే మురళీమోహన్ పాల్గొన్నారు. తెలుగు దేశం పార్టీ చిత్తూరు జిల్లా ప్రధాన కార్యదర్శి సునీల్ చౌదరి, మాజీ ప్రధాన కార్యదర్శి కోదండ యాదవ్లతో కలిసి, ప్రజలు, కూటమి నాయకులు, కార్యకర్తలతో మమేకమవుతూ.. కూటమి ప్రభుత్వ సంకల్పాన్ని స్థానిక ప్రజలకు తెలియజేస్తూ ముందుకు సాగారు. అంతకు ముందు తవణంపల్లెకు చేరుకున్న ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు, ఎమ్మెల్యే మురళీమోహన్ ఆ మండలం తెలుగు దేశం పార్టీ మండలాధ్యక్షులు వెంకటేశ్వర చౌదరి నేతృత్వంలో కూటమి నాయకులు, కార్యకర్తలు, ప్రజలు సాదర స్వాగతం పలికారు. అడుగడుగునా కర్పూర హారతులతో నీరాజనాలు పలికారు. ముందుగా తవణంపల్లి మండలంలోని కొంద్రాజు కాలువ గ్రామ పంచాయతీలో నూతనంగా ఏర్పాటు చేస్తున్న స్వర్గీయ నందమూరి తారక రామారావు కాంస్యం విగ్రహాన్ని పరిశీలించిన ఎంపీ, ఎమ్మెల్యేలు. ఐఏఎస్ అధికారి నక్కల ప్రభాకర్ రెడ్డి చొరవతో కూటమి ప్రభుత్వం మంజూరు చేసిన.., కోటి పదిలక్షల రూపాయల వ్యయంతో వెంగంపల్లిలో నిర్మించి తలపెట్టిన శ్రీరాముల వారి ఆలయం నూతన నిర్మాణ భూమి పూజకార్యక్రమంలో పాల్గొన్నారు. అలాగే వెంగంపల్లిలో నూతనంగా నిర్మించిన అంగన్వాడీ భవనం వద్దకు చేరుకుని.., ఆధునిక హంగులతో నిర్మించిన ఆ బిల్డింగ్ను పరిశీలించారు. అనంతరం అంగన్వాడీ భవనాన్ని ప్రారంభించారు. అక్కడి నుంచి రోడ్డు మార్గాన గోవిందరెడ్డిపల్లికి చేరుకున్న ఎంపీ ఎమ్మెల్యేలు.. ఆ గ్రామంలో నూతనంగా నిర్మించిన అంగన్వాడి భవనాన్ని ప్రారంభించారు. అదేవిధంగా అక్కడే ఏర్పాటు చేసిన వాటర్ ప్లాంట్ను కూడా ప్రారంభించి, తాగునీటిని ప్రజలకు అందుబాటులోకి తెచ్చారు. అదేవిధంగా ఏ గొల్లపల్లెలో నూతనంగా నిర్మించిన అంగన్వాడి భవనాన్ని ప్రారంభించారు. కూటమి ప్రభుత్వ చిత్తశుద్ధిని స్థానిక ప్రజలకు తెలియజేస్తూ ముందుకు సాగారు. అదే గ్రామానికి సంబంధించిన స్మశాన వాటికలో ఏర్పాటు చేసిన వాటర్ ప్లాంట్ను, మౌలిక సదుపాయాల కల్పనను పరిశీలించిన చిత్తూరు పార్లమెంటు సభ్యులు దగ్గుమళ్ళ ప్రసాదరావు, ఎమ్మెల్యే మురళీమోహన్.., స్మశాన వాటిక భద్రతను దృష్టిలో ఉంచుకొని, ప్రభుత్వ నిధులతో ఏర్పాటుచేసిన కాంపౌండ్ వాల్ను వారు ప్రారంభించారు. తర్వాత ఆ ప్రాంతంలో నిర్వహించిన స్వచ్ఛాంధ్ర- స్వచ్ఛ భారత్ , అన్నదాత సుఖీభవ కార్యక్రమంలో పాల్గొని, తడి చెత్త- పొడి చెత్తను వేరు చేసి డంప్ చేసేందుకు స్థానిక మహిళలకు ఎరుపు , పచ్చరంగు డబ్బాలు.., మామిడి కాయల భద్రతను దృష్టిలో ఉంచుకుని మ్యాంగో హార్టికల్చర్ అధికారులు తయారుచేయించిన, కవర్లను మామిడి రైతులకు పంపిణీ చేశారు. మామిడి రైతుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని వారు తెలిపారు. అదే మండలంలోని మాధవరం ఎంపిపి పాఠశాలలో జిల్లా పరిషత్ నిధులతో నూతనంగా నిర్మించిన ప్రహరీ గోడను ప్రారంభించారు. ఇకపోతే గోవింద రెడ్డి పల్లెలో నూతనంగా నిర్మించిన రెండు ఓం శక్తి ఆలయాలను ప్రారంభించారు. ఓం శక్తి భక్తులతో కలిసి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు, ఎమ్మెల్యే మురళీమోహన్ మాట్లాడుతూ. పూతలపట్టు నియోజకవర్గం సర్వతోముఖాభివృద్ధికి ఎంపీ, ఎమ్మెల్యేలమైన తాము సమన్వయంతో పని చేస్తున్నామని తెలిపారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ..ప్రజా సంక్షేమం కోరి కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సూపర్ సిక్స్ పథకాలను ప్రజలకు చేరువ చేస్తున్నామని వారు తెలిపారు. ఏపీ సీఎం చంద్రబాబు నేతృత్వంలో ప్రజల ఆకాంక్షల కనుగుణంగా పనిచేస్తున్న కూటమి ప్రభుత్వాన్ని ప్రజలు ఆదరించాలని ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు, ఎమ్మెల్యే మురళీమోహన్ ఆ ప్రాంత ప్రజలను కోరారు. కార్యక్రమంలో టీడీపీ క్లస్టర్ ఇన్చార్జులు ప్రవీణ్, మోహన్ నాయుడు, బంగారుపాలెం మండల అధ్యక్షులు ధరణి, టిడిపి సీనియర్ నేత ఎన్.పి. ప్రకాష్ నాయుడు ,మాజీ కన్వీనర్ దిలీప్ కుమార్, మార్కెట్ చైర్మన్ భాస్కర్ నాయుడు, టిడిపి మహిళా నేతలు ఇందిరమ్మ, చిట్టెమ్మ,ఏ.గొల్లపల్లి పంచాయతీ సర్పంచ్ సవిత, టిడిపి నాయకులు గోపి యాదవ్, వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

# సంపాదకీయం



## దురాక్రమణ వాదం!

**ఇరాన్ తరువాత తమ లక్ష్యం క్యూబానే అంటూ అమెరికా అధ్యక్షుడు బెదిరించడం అత్యంత గర్హనీయం. ఒక సర్వసత్తాక సార్వభౌమ దేశంపై ఇలా తెగబడడం సామ్రాజ్యవాదుల దురహంకార, దురాక్రమణ ధోరణికి నిదర్శనం. ఇజ్రాయిల్‌తో కలిసి ఇరాన్‌పై బాంబుల వర్షం కురిపించి ఖమేనీని, అక్కడి ముఖ్య నాయకుల్ని హత్య గావించి గెలిచేశాననుకున్న అమెరికాకు ఇప్పుడు ఇరాన్ ముచ్చెమటలు పోయిస్తోంది. ట్రంప్-నెతన్యాహులు ప్రారంభించిన దురాక్రమణ యుద్ధం దుష్ప్రభావాలు ఇప్పుడు భూగోళాన్ని చుట్టుముట్టాయి. బ్యారెల్ చమురు ధర 120 డాలర్లకు చేరువ కావడమేగాక ప్రధాన చమురు క్షేత్రాల విధ్వంసంతో ఇంధన భద్రత కొరవడుతుందని యావత్ ప్రపంచమూ బెంబేలెత్తుతున్న పరిస్థితి ఏర్పడింది. అమెరికా, ఇజ్రాయిల్‌లలో సైతం ప్రజలు యుద్ధాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. హోర్ముజ్ జలసంధి వద్దకు తమ దళాలను పంపడానికి నాటో దేశాలు తిరస్కరించడం, అమెరికాకు ఆయుధాల ఎగుమతికి స్విట్జర్లాండ్ నిరాకరించడం వంటివి అమెరికా శిబిరంలోనే చోటుచేసుకుంటున్నాయి. అయినా అమెరికా, ఇజ్రాయిల్ యుద్ధోన్మాద విధ్వంసాన్ని పెంచుతుండడం దుర్మార్గం.**

ఇటీవల వెనిజులా అధ్యక్షుడు మదురోను, ఆయన భార్యను కిడ్నాప్ చేసి దారుణానికి పాల్పడిన అమెరికా ఇప్పుడు క్యూబాపై పంజా విసురుతానని బెదిరిస్తోంది. అయితే, అమెరికా విధిస్తున్న ఆంక్షలను ఎదుర్కొంటూనే గత ఏడు దశాబ్దాలుగా క్యూబా సోషలిజం బాటలో ముందుకు సాగుతూనే వుంది. ముఖ్యంగా విద్య, వైద్య రంగాల్లో బ్రహ్మాండమైన ప్రగతి సాధించింది. దేశ ప్రజలకు అవసరమైన ఆహార ధాన్యాల స్వయంసమృద్ధికి కృషి చేస్తోంది. తన పెట్రోలియం అవసరాల్లో 40 శాతాన్ని మాత్రమే సొంతంగా ఉత్పత్తి చేసి తీర్చుకోగలుగుతోంది. అలాగే విద్యుత్‌ను కూడా సొంతంగా ఉత్పత్తి చేసుకుంటున్నా.. దేశీయ అవసరాలకు అది సరిపోవడం లేదు. ఇటీవల సౌర, పవన విద్యుదుత్పత్తికి ప్రణాళికలు వేసినా అవి పూర్తి స్థాయిలో ఆచరణకు రాలేదు. ఇటువంటి స్థితిలో క్యూబాకు చమురు విక్రయించే లేదా సరఫరా చేసే ఏ దేశంపై అయినా సుంకాలు విధిస్తామని అమెరికా అధ్యక్షులు డొనాల్డ్ ట్రంప్ జనవరిలో చేసిన హెచ్చరిక చాలా దేశాలను నిలవరించింది. పర్యవసానంగా క్యూబాలో విద్యుత్ సంక్షోభం తీవ్రతరమవుతున్నది. ఈ నెల 16న దేశవ్యాప్తంగా విద్యుత్ కోత ఏర్పడింది. సుమారు కోటి మంది ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. గతేడాది డిసెంబర్ ప్రారంభంలో కూడా పశ్చిమ క్యూబాలో భారీ విద్యుత్ అంతరాయం ఏర్పడింది. గత నాలుగు నెలల్లో క్యూబాకు ఇది మూడో భారీ విద్యుత్ అంతరాయం. సోమవారం విద్యుత్ కోతతో దాదాపు పది వేల మందికి పైగా ప్రజలకు జరగాల్సిన శస్త్ర చికిత్సలను వాయిదా వేయాల్సి వచ్చిందని అధ్యక్షులు డియాజ్ కానెల్ తెలిపారు. చిన్న పిల్లలు చదివే పాఠశాలలపై గాజాలో, ఇరాన్ లో బాంబులు వేసి వేలాదిమందిని బలి తీసుకున్న నరహంతకులకు ఇది బాధ కలిగించకపోవచ్చు కానీ మనసున్న ఏ మనిషినైనా కదిలిస్తుంది. రోగులపట్ల సానుభూతి కలిగిస్తుంది.

విద్యుత్ సంక్షోభంతో క్యూబా ఆర్థిక వ్యవస్థ కూడా దెబ్బతింటున్నది. సోషలిస్టు వ్యవస్థ నిర్మాణాన్ని అడ్డుకోవడానికి అమెరికా చేస్తున్న కుయత్నాల్ని అక్కడి ప్రజల సహకారంతో క్యూబా కమ్యూనిస్టు పార్టీ ప్రభుత్వం తిప్పిగొడుతూ పట్టుదలగా ముందుకు సాగుతోంది. 'క్యూబా ప్రజలపై అమెరికా ఫాసిస్టు ప్రభుత్వం తమ దురాక్రమణను కొనసాగిస్తోంది. ఈ నేరపూరిత, నయా వలసవాద సామ్రాజ్యవాదమే ఈ ప్రాంతంలో, ప్రపంచంలో శాంతికి నిజమైన ఏకైక ముప్పు. 67 ఏళ్లుగా వారు మమ్మల్ని ఓడించలేకపోయారు. ఇకపై కూడా ఓడించలేరు' అన్న దృఢ విశ్వాసంతో కమ్యూనిస్టు పార్టీ, ప్రభుత్వం పోరాడుతున్నాయి. క్యూబన్ల ధర్మ పోరాటానికి యావత్ ప్రపంచమూ ముఖ్యంగా అభివృద్ధి చెందుతున్న దేశాలు సంఘీభావంగా నిలవాలి. అమెరికా దిగ్బంధాన్ని నిరసించాలి. ఒకప్పుడు అలీన దేశాల కూటమిలో భారత్, క్యూబా లు సమిష్టి కృషితో ప్రపంచ శాంతికి దన్నుగా నిలిచిన చరిత్రను గుర్తు చేసుకోవాలి. నేడున్న కేంద్ర ప్రభుత్వం అమెరికాకు లొంగుబాటుగా వ్యవహరిస్తోంది. అమెరికా యుద్ధ విమానాలను మా భూభాగంలోకి రానివ్వబోమని చిన్న ద్వీప దేశం శ్రీలంక ధైర్యంగా చెప్పగలిగినా భారత ప్రభుత్వం మాత్రం ట్రంప్ దొరకు సలాం కొడుతుండడం సిగ్గుచేటు! ప్రపంచంలో ఎక్కడ యుద్ధం జరిగినా మొదటగా నశించేది మానవత్వం, ఎక్కువగా నష్టపోయేది బాల్యం. బాంబులు పడుతున్నప్పుడు కూలిపోతున్నది కేవలం భవనాలు కాదు. వేలాది బాలల కలలు, భవిష్యత్తు కూడా. ఉక్రెయిన్, గాజా, ఇరాన్ వంటి ప్రాంతాల్లో కొనసాగుతున్న యుద్ధాలు లక్షలాది పిల్లలను అనాథలుగా, శరణార్థులుగా మార్చుతున్నాయి. చదువు, ఆరోగ్యం, భద్రత వంటి ప్రాథమిక హక్కులు కూడా వారికి అందకుండా పోతున్నాయి. బాలలు యుద్ధాలకు కారణం కాకపోయినా, ప్రతి యుద్ధంలో అత్యధికంగా బాధపడుతున్నవారు వారే. అందుకే బాలల హక్కులను కాపాడటం అంటే యుద్ధాలను ఆపడం, శాంతిని కాపాడటం. ప్రపంచంలో ఎక్కువ యుద్ధాలు ప్రధానంగా నాలుగు అంశాల కోసం జరుగుతున్నాయి. మొదటిది రాజకీయ అధికారం. కొంతమంది నాయకులు 'విదేశీ శత్రువు' అనే బూచిని సృష్టించి జాతీయతను రెచ్చగొట్టి తమ అధికారాన్ని పటిష్టపరుచుకుంటారు. రెండవది ఆయుధ వ్యాపారం. ఆయుధ తయారీ సంస్థలు ప్రపంచంలో అత్యధిక లాభాలను పొందే రంగాల్లో ఒకటి. యుద్ధం మొదలైతే కోట్ల డాలర్ల వ్యాపారం జరుగుతుంది. మూడవది సహజ వనరులపై ఆధిపత్యం. చమురు, గ్యాస్, ఖనిజాలు, నీరు వంటి వనరుల కోసం యుద్ధాలు జరుగుతున్నాయి. నాలుగవది మతం లేదా జాతీయత. ఇవి చాలాసార్లు నిజమైన కారణాలు కాకుండా ప్రజలను యుద్ధానికి ప్రేరేపించే ఒక ముసుగుగా ఉపయోగపడతాయి. ఈ నాలుగు కారణాల్లో ఒక్కటి కూడా సాధారణ ప్రజల ప్రయోజనం కోసం కాదు. లాభం కొద్ది మందికి, నష్టం కోట్లాది మందికి.



## తెదేపా యువ నాయకుడికి కన్నీటి వీడ్కోలు

శుక్రవారం రాత్రి గుండిశెట్టిపల్లి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మరణించిన అదే గ్రామానికి చెందిన శాంతిపురం మండల ఐటీడీపీ యువ నాయకుడు రవి కి తెదేపా పార్టీ నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొని నివాళులర్పించారు. ఈ సందర్భంగా తెదేపా నేతలు మాట్లాడుతూ రవి ప్రమాదవశాత్తు జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆకస్మికంగా మరణించడం తీవ్ర విషాదాన్ని కలిగించిందని ఆయన మరణ వార్త విని ఎంతో దిగ్భ్రాంతి కలిగిందని అన్నారు. తెలుగుదేశం పార్టీ బలోపేతానికి రవి చేసిన సేవలు చిరస్మరణీయమైనవని, పార్టీ అభివృద్ధి కోసం ఆయన చూపిన కృషి, నిబద్ధత ప్రతి ఒక్కరికీ ఆదర్శప్రాయంగా నిలుస్తాయని తెలియజేశారు. సమాజానికి సేవ చేయాలనే తపనతో పనిచేసిన యువ నాయకుడిని కోల్పోవడం పార్టీకి మరియు స్థానిక ప్రజలకు అపూర్వ నష్టమని తమ బాధను వ్యక్తం చేశారు. రవి ఆత్మకు సద్గతి కలగాలని భగవంతుని మనస్ఫూర్తిగా ప్రార్థిస్తున్నామని ఈ విషాద సమయంలో వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ, వారికి ధైర్యం, ఆత్మస్థైర్యం కలగాలని ఆకాంక్షిస్తున్నామని ఈ కష్టకాలంలో పార్టీ తరఫున పూర్తి మద్దతు ఎల్లప్పుడూ వారి కుటుంబానికి ఉంటుందని ఎమ్మెల్సీ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్, ఏపీఎస్ఆర్టీసీ వైస్ చైర్ పర్సన్ పి ఎస్ మునిరత్నం, కుప్పం పలమనేరు మదనపల్లి అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ చైర్మన్ డాక్టర్ సురేష్, శాంతిపురం మండల తెదేపా పార్టీ అధ్యక్షులు ఉదయ్ కుమార్ మొదలగు నాయకులు తమ సంతాపాన్ని తెలియజేశారు.

## రోజా నోరు అదుపులో పెట్టుకో

### మాజీ మంత్రి రోజా వ్యాఖ్యల పై తెలుగు మహిళల ఆగ్రహం




**చిత్తూరు, మార్చి 21**

మాజీ మంత్రి రోజా నోరు అదుపులో పెట్టుకొని మాట్లాడాలని చిత్తూరు నియోజకవర్గ తెలుగు మహిళా అధ్యక్షురాలు లీలావతి హెచ్చరించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, రాష్ట్ర మంత్రులపై అనుచిత వ్యాఖ్యలు చేయడం మానుకోవాలన్నారు. తమ అధినేత నేర్పిన సంస్కారంతో తెలుగు మహిళలు ఎంతో ఓపికగా వ్యవహరిస్తున్నట్లు తెలిపారు. జగన్మోహన్ రెడ్డి నేర్పిన సంస్కారంతో ఆ పార్టీ నేతలు రెచ్చిపోయి మాట్లాడటం సమంజసం కాదన్నారు. గత ఐదేళ్ల పాలనలో జరిగిన అభివృద్ధి ఏమిటో ప్రజలందరూ గమనించి 11 సీట్లకు పరిమితం చేసిన విషయాన్ని గుర్తు చేశారు. సంక్షేమ పథకాలు కూటమి ప్రభుత్వంలో రెండింతలుగా అమలు చేస్తున్నట్లు చెప్పారు. మాజీ మంత్రి రోజా ఇష్టపకారం కూటమినేతలపై నోరు పారేసుకుంటే రాష్ట్రంలోని తెలుగు మహిళలు ఊరుకునేది లేదని రాష్ట్రవ్యాప్తంగా ఎదుర్కొంటామని హెచ్చరించారు. ఈ విలేకరుల సమావేశంలో తెలుగు మహిళా నాయకులు సుమతి, హేమ, పుష్ప, హీర, మేరీ, దుర్గా, షీలా పాల్గొన్నారు.

## నాయనూరులో తాగునీటి తీవ్ర సమస్య

### పది నెలలుగా పట్టించుకోలేదని గ్రామస్తుల ఆవేదన




**కుప్పం, మార్చి 21**

చిత్తూరు జిల్లా కుప్పం మండలం నాయనూరు పంచాయతీ పరిధిలో తాగునీటి సమస్య తీవ్రంగా మారింది. గ్రామంలో గుక్కెడు నీళ్లు దొరకని పరిస్థితి నెలకొనగా, గత పది నెలలుగా సమస్యను ప్రజాప్రతినిధులు, అధికారులు పట్టించుకోలేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలో బోర్లు ఎండిపోవడం, పైపులైన్ ద్వారా నీటి సరఫరా నిలిచిపోవడం వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. తాగునీటి కోసం మహిళలు, వృద్ధులు కిలోమీటర్ల దూరం నడిచి నీరు తెచ్చుకోవాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ పరిస్థితుల్లో చిన్నారులు, వృద్ధుల ఆరోగ్యం కూడా దెబ్బతింటోందని ఆందోళన చెందారు. సమస్యను పలుమార్లు స్థానిక ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారుల దృష్టికి తీసుకువెళ్లిన వారి నుండి ఎటువంటి స్పందన లేదని గ్రామస్తులు ఆరోపించారు. పది నెలలుగా ఇలాంటి పరిస్థితి కొనసాగుతుండటంతో గ్రామ ప్రజల్లో ఆగ్రహం వ్యక్తమవుతోంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి గ్రామానికి తక్షణం తాగునీటి సౌకర్యం కల్పించాలని, శాశ్వత పరిష్కారం కోసం చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు.

## ఐటీడీపీ ప్రతినిధి బి. రవి మృతి పట్ల సీఎం చంద్రబాబు సంతాపం

**కుప్పం, మార్చి 21**



చిత్తూరు జిల్లా ఐటీడీపీ అధికార ప్రతినిధి బి. రవి రోడ్డు ప్రమాదంలో మృతి చెందటంపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తీవ్ర విచారం వ్యక్తం చేశారు. కుప్పం నియోజకవర్గంలోని శాంతిపురం మండలానికి చెందిన రవి ప్రమాదవశాత్తు మరణించడం పట్ల సీఎం దిగ్భ్రాంతి వ్యక్తం చేసినట్లు తెలిపారు. పార్టీ కోసం అంకితభావంతో పనిచేసిన యువ నాయకుడిని కోల్పోవడం బాధాకరమని అన్నారు. రవి ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించిన ముఖ్యమంత్రి, వారి కుటుంబ సభ్యులను ఫోన్ ద్వారా పరామర్శించారు. ఈ విషాద సమయంలో కుటుంబానికి అండగా ఉంటామని, ప్రభుత్వం, పార్టీ తరఫున అన్ని విధాల సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. రవి మరణంతో స్థానికంగా విషాద వాతావరణం నెలకొనగా, పలువురు నాయకులు, కార్యకర్తలు ఆయనకు నివాళులు అర్పిస్తూ కుటుంబ సభ్యులకు సానుభూతి తెలియజేస్తున్నారు.

# రైజ్ కేంద్రానికి నీతి ఆయోగ్ పట్టం






- రూ. 1.55 కోట్ల ఆర్థిక మద్దతుకు ఉత్తర్వులు
- మహిళలు పారిశ్రామికవేత్తలుగా ఎదిగేందుకు విలువైన చేయూత
- సీఎం నిత్యనూతనం-వినూత్నం నినాదానికి అనుగుణంగా అడుగులు
- ఎన్‌టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ

**విజయవాడ, మార్చి 21** స్వర్ణాంధ్ర విజన్ ఏ 2047, వికసిత్ భారత్ సాకారందిశగా చేస్తున్న వినూత్న ప్రయత్నాల్లో భాగంగా ఆకాంక్షిత బ్లాకు అయిన ఇబ్రహీంపట్నం మండలం గుంటుపల్లిలో జిల్లా యంత్రాంగంఏర్పాటు చేసిన రూరల్ఇన్నొవేషన్స్ ఇంక్యుబేషన్, స్కిల్లింగ్ అండ్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ సెంటర్ (రైజ్) కేంద్రానికి నీతి ఆయోగ్పట్టంకట్టిందని కలెక్టర్ డా. జి.లక్ష్మీశ తెలిపారు.గ్రామీణ మహిళలు పారిశ్రామికవేత్తలుగా ఎదిగేందుకుచేపడుతున్న కార్యక్రమాలకు రూ. 1.55 కోట్ల ఆర్థికమద్దతుకు ఆమోదం తెలుపుతూ తాజాగా ఉత్తర్వులిచ్చినట్లు వెల్లడించారు.రైజ్ కేంద్రానికి నీతి ఆయోగ ఆర్థికమద్దతుపై కలెక్టర్ లక్ష్మీశ అధికారులతో కలిసి శనివారంకలెక్టరేట్‌లో జరిగిన మీడియా సమావే శంలో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ గ్రామీణమహిళలు ముఖ్యంగా స్వయం సహాయ క సంఘాలమహిళలను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దేందుకు గౌరవ సీఎం ఆకాంక్ష అయిన ఒక కుటుంబం-ఒక పారిశ్రామికవేత్త స్ఫూర్తికి అనుగుణంగా అడుగులు వేసి వినూత్నంగా రైజ్ కేంద్రాన్ని ఏర్పాటు చేశామని, మహిళల ఆర్థిక సాధికారత, స్వయం ఉపాధి అవకాశాల విస్తరణ లక్ష్యంగా రూపొందించిన ఈ వినూత్న కార్యాచరణ ప్రణాళికకు నీతి ఆయోగ్ నుంచి గుర్తింపు లభించిందని పేర్కొన్నారు. రైజ్ కేంద్రం ప్రణాళికపై నీతి ఆయోగ్‌కు సవివర నివేదిక పంపగా పరిశీలించి ఆర్థిక మద్దతుకు ప్రత్యేక కమిటీ ఆమోదం తెలిపినట్లు వివరించారు. ఈ నిధులు ఇబ్రహీంపట్నం బ్లాకులో ఏఐ ఆధారిత నైపుణ్య సర్వే, నైపుణ్యాభివృద్ధి, శిక్షణ కార్యక్రమాలు, మౌలిక సదుపాయాల కల్పన తదితరాలకు ఉపయోగపడతాయని తెలిపారు. ఈ మద్దతు మండలంలోని స్వయం సహాయక సంఘాల మహిళలకు పెద్ద చేయూత అని కలెక్టర్ లక్ష్మీశ పేర్కొన్నారు.

### ఏఐ సహా విభిన్న అంశాల్లో శిక్షణ...

ముఖ్యమంత్రి ప్రోత్సహిస్తున్న "నిత్య నూతనం-వినూత్నం" నినాదానికి అనుగుణంగా మరిన్ని సృజనాత్మక కార్యక్రమాలను అమలు చేస్తామని, మహిళలు అన్ని రంగాల్లో అవకాశాలను అందిపుచ్చుకునేలా టీమ్ ఎన్‌టీఆర్ కృషిచేస్తుందని కలెక్టర్ స్పష్టం చేశారు. రైజ్ కేంద్రంలో హెల్ప్ డెస్క్, ఐడియా డెస్క్, స్కిల్లింగ్ డెస్క్, ప్లేస్‌మెంట్ డెస్క్, బ్యాంకింగ్ డెస్క్ లను ప్రత్యేకంగా ఏర్పాటు చేసినట్లు వివరించారు. అన్ని రకాల సేవలు ఒకేచోట అందేలా రైజ్ కేంద్రాన్ని తీర్చిదిద్దుతున్నట్లు తెలిపారు. రైజ్ కేంద్రంలో ఇప్పటికే వెయ్యిమందికి పైగా మహిళలకు ఏఐ, స్పోకెన్ ఇంగ్లీష్, పేపర్ క్రాఫ్ట్, కార్ డ్రైవింగ్, మైక్రో ఫుడ్ ప్రాసెసింగ్, సోలార్ ప్యానెల్ ఫిక్సింగ్ తదితర అంశాలపై శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు. ఓపెన్ నెట్‌వర్క్ ఫర్ డిజిటల్ కామర్స్ (ఓఎన్‌డీసీ), ఏ2 ఫీ వంటి వాటిపై వర్క్‌షాప్‌లు కూడా నిర్వహించినట్లు వెల్లడించారు. అదేవిధంగా ప్రభుత్వ పథకాలను, రైజ్ కార్యాచరణను సద్వినియోగం చేసుకొని 300 కుటుంబాలకు పైగా ఇప్పటికే వివిధ యూనిట్లు ప్రారంభించి పారిశ్రామికవేత్తలుగా ఎదిగారన్నారు. రైజ్ కేంద్రంలో విభిన్న అంశాల్లో శిక్షణ కార్యక్రమాలు నిరంతరంగా కొనసాగుతున్నాయని.. ప్రతివారం వివిధ అంశాల్లో వర్క్‌షాప్‌లు సైతం నిర్వహిస్తున్నామని తెలిపారు. ఎప్పటికప్పుడు మహిళలను క్షేత్ర పర్యటనలకు కూడా తీసుకెళ్తున్నట్లు తెలిపారు. అలీప్, ఛాంబర్ ఆఫ్ కామర్స్, ఆర్‌టీఐహెచ్ తదితరాలతో కూడా చేతులు కలిపామన్నారు. రైజ్ కేంద్రంలో ప్రతినెలా ఎన్‌టీఆర్ వికాస ద్వారా జాబ్ మేళాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. తాజా విజయానికి సహకరించిన గౌరవ ముఖ్యమంత్రి, స్థానిక పార్లమెంటు సభ్యులు, శాసనసభ్యులు, సెర్ప్ అధికారులు, మీడియా ప్రతిఒక్కరికీ ధన్యవాదాలు తెలియజేస్తున్నట్లు తెలిపారు. రైజ్‌ను సద్వినియోగం చేసుకోవాలనుకునే ఔత్సాహికులు 70753 85588 నంబరులో సంప్రదించవచ్చని కలెక్టర్ లక్ష్మీశ సూచించారు. సమావేశంలో డీఆర్‌డీఏ పీడీ ఏఎన్‌వీ నాంచారరావు, ఇబ్రహీంపట్నం ఎంపీడీవో డి.శకుంతల, ఏబీపీ బ్లాక్ కోఆర్డినేటర్ పి.శ్రీనివాస్, రైజ్ మేనేజర్ బి.తేజస్విని పాల్గొన్నారు.

# కుల వివక్షతపై కఠిన చర్యలు తీసుకోవాలి

- కోనసీమ ఘటనపై ఆగ్రహం
- అల్ ఇండియా ఎస్సీ, ఎస్టీ, బీసీ,మైనార్టీ వెల్ఫేర్ అసోసియేషన్ జాతీయఉపాధ్యక్షుడు బందెల కిరణ్ రాజ్



**విజయవాడ, మార్చి**

నేటి ఆధునిక సమాజంలో కూడా కుల వివక్షత కొనసాగుతుండడం తీవ్ర ఆందోళనకరమని అల్ ఇండియా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వెల్ఫేర్ అసోసియేషన్ జాతీయ ఉపాధ్యక్షుడు బందెల కిరణ్ రాజ్ ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవల కోనసీమ జిల్లాలోని పి. గన్నవరం మండలం కుందాలపల్లి గ్రామంలో చోటుచేసుకున్న ఘటనపై ఆయన తీవ్రంగా స్పందించారు. ఎస్సీ కులానికి చెందిన వ్యక్తి మరణించగా, ఆయన అంత్యక్రియల కోసం గ్రామ రహదారిపై కూడా అనుమతి ఇవ్వకుండా అడ్డుకోవడం దారుణమని పేర్కొన్నారు. ఇది మన సమాజంలో కుల వివక్ష ఇంకా బలంగా కొనసాగుతున్నదానికి ఉదాహరణగా నిలుస్తుందని అన్నారు. స్వాతంత్ర్యం వచ్చి దశాబ్దాలు గడిచినా, దళితులపై వివక్ష ఏదో ఒక రూపంలో కొనసాగుతూనే ఉందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. భారత రాజ్యాంగ నిర్మాత బీ ఆర్ అంబేద్కర్ సమానత్వం, సామాజిక న్యాయం కోసం కల్పించిన హక్కులకు విరుద్ధంగా ఇలాంటి ఘటనలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. ఈ ఘటనను ఖండిస్తూ బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. దళితులపై జరుగుతున్న వివక్షను అరికట్టడానికి ప్రభుత్వం తక్షణమే స్పందించి, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు చేపట్టాలని కోరారు.

## అనుదీప్ హత్య పై విచారణ జరపాలి

# హంతకులను అరెస్ట్ చేయాలి

కుట్ర దారులపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలి

- లేని పక్షం లో చాట్రాయ్‌లో నిరవధిక నిరసన చేస్తా
- రాష్ట్ర కాపు జేఏసీ అధ్యక్షులు చందు జనార్దన్



**విజయవాడ, మార్చి 21** నూజివీడు నియోజకవర్గం చాట్రాయ్‌లో కాపు కుటుంబానికి చెందిన అంబటి అనుదీప్ మరణంపై సమగ్ర విచారణ జరిపి, హంతకులను వెంటనే అరెస్ట్ చేయాలని రాష్ట్ర కాపు జేఏసీ అధ్యక్షుడు చందు జనార్ధన్ డిమాండ్ చేశారు. శనివారం విజయవాడలో కాపు జేఏసీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ, అనుదీప్ మరణం హత్యేనని మండల ప్రజలు ఆరోపిస్తున్నప్పటికీ, స్థానిక పోలీస్ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. ఈ ఘటనపై ఇప్పటికే అనుదీప్ తండ్రి అంబటి గోపాలరావు చాట్రాయ్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినా, ఇప్పటివరకు చర్యలు తీసుకోలేదని ఆయన పేర్కొన్నారు. ఇటీవల అనుదీప్ దశదినకర్మ కార్యక్రమం చాట్రాయ్‌లో నిర్వహించగా, కాపు జేఏసీ నాయకత్వం, మండల నాయకులు, జనసేన నేతలు కలిసి సుమారు 300 మంది పాల్గొని కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబానికి జేఏసీ తరఫున సానుభూతి తెలిపారు. అనుదీప్ తండ్రి మాట్లాడుతూ తన కుమారుడిని హత్య చేశారని, పోలీస్ యంత్రాంగం నేరస్తులకు సహకరిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. అక్కడ ఉన్న పలువురు కూడా ఇదే అభిప్రాయం వ్యక్తం చేసినట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో, అనుదీప్ హత్యపై సమగ్ర దర్యాప్తు జరిపి దోషులను కఠినంగా శిక్షించాలని, అలాగే నేరస్తులకు సహకరించిన పోలీస్ అధికారులపై కూడా చర్యలు తీసుకోవాలని చందు జనార్ధన్ డిమాండ్ చేశారు. జిల్లా ఉన్నతాధికారులు వెంటనే స్పందించి చర్యలు తీసుకోకపోతే, చాట్రాయ్‌లో రాష్ట్ర కాపు జేఏసీ ఆధ్వర్యంలో నిరవధిక నిరసన కార్యక్రమాలు చేపడతామని ఆయన హెచ్చరించారు.

# అనుమానాస్పద మరణంపై ప్రత్యేక దర్యాప్తు ఆదేశాలు

- నిజం తేల్చాలని జిల్లా పోలీస్ అధికారికి మంత్రి పార్థసారథి సూచన

**నూజివీడు, మార్చి 21**



చాట్రాయి మండలం చాట్రాయి గ్రామంలో ఇటీవల అనుమానాస్పద పరిస్థితుల్లో మరణించిన అంబటి దీపు అనుదీప్ వర్షిత్ ఘటనపై రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి స్పందించారు. మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించి వారికి భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యుల ఆవేదనను విన్న మంత్రి, కేసుపై అనేక అనుమానాలు ఉన్న నేపథ్యంలో పూర్తి స్థాయి దర్యాప్తు అవసరమని పేర్కొన్నారు. వారి అభీష్టానికి అనుగుణంగా, నిష్పక్షపాతంగా విచారణ జరిపిస్తానని హామీ ఇచ్చారు. ఈ మేరకు ఏలూరు జిల్లా పోలీస్ సూపరింటెండెంట్‌తో మాట్లాడిన మంత్రి, ప్రత్యేక దర్యాప్తు (స్పెషల్ ఎంక్వయిరీ) చేపట్టాలని ఆదేశించారు. స్థానిక పోలీసులకే పరిమితం కాకుండా ఇతర ప్రాంతాల అధికారులతో విచారణ జరిపి సమగ్ర నివేదిక సమర్పించాలని సూచించారు. అలాగే ఘటనకు సంబంధించిన సీసీటీవీ ఫుటేజీ, చెరువుగట్టు పరిసర ప్రాంతాలు, గ్రామంలోని ప్రధాన రహదారుల కెమెరా దృశ్యాలను పూర్తిగా పరిశీలించి నిజానిజాలు వెలికితీయాలని ఆదేశించారు. తల్లిదండ్రులతో మాట్లాడిన మంత్రి, కులం, ప్రాంతం, రాజకీయాలకు అతీతంగా న్యాయం జరుగుతుందని హామీ ఇచ్చారు. ఈ విషయం లో ఎవరైనా తప్పు చేసినట్లు తేలితే కఠిన చర్యలు తీసు కుంటామని స్పష్టం చేశారు. మంత్రి వెంట పోలీస్ అధికారులు, కూటమి నాయకులు, స్థానికులు పాల్గొన్నారు.

# అన్నదాతలూ.. ఆందోళన వద్దు





- పంట నష్టానికి పరిహారం ద్వారా ప్రభుత్వం భరోసా
- కొనుగోలు కేంద్రాల ద్వారా కూడా మద్దతుకు చర్యలు
- ఎన్టీఆర్ జిల్లాలో కలెక్టర్ డా. జి.లక్ష్మీశ సుడిగాలి పర్యటన

విజయవాడ, మార్చి 21

అకాల వర్షాలు, గాలులు కారణంగా నష్టపోయిన రైతులు ఎలాంటి ఆందోళన చెందవద్దని.. జరిగిన నష్టానికి ప్రభుత్వం పరిహారం ద్వారా అండగా నిలుస్తుందని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ భరోసా కల్పించారు. శనివారం కలెక్టర్ లక్ష్మీశ జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో సందర్శించి నష్టం వాటిల్లిన పంటలను పరిశీలించి.. రైతులతో మాట్లాడారు. గంపలగూడెం మండలంలోని తునికిపాడులో మొక్కజొన్న పంటను పరిశీలించారు. ఇక్కడ దాదాపు 116 హెక్టార్లలో ఈ పంటకు నష్టం వాటిల్లినట్లు ప్రాథమికంగా అంచనావేసినట్లు వ్యవసాయ అధికారులు వివరించారు. పంట సంరక్షణకు తీసుకోవాల్సిన చర్యలపైనా రైతులకు అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. అనంతరం మేడూరులో ఎనీటైమ్ మనీ (ఏటీఎం) విధానంలో పండిస్తున్న పంటలను పరిశీలించారు. రైతులకు ఏడాది పాటు ఎప్పుడూ ఏదో ఒక రూపంలో పంటల ద్వారా ఆదాయం వచ్చే ఈ విధానంపై విస్తృతంగా అవగాహన కల్పించాల్సిన అవసరముందని ఈ సందర్భంగా కలెక్టర్ అన్నారు. దీనివల్ల పంటల వైవిధ్యంతో పాటు ఆదాయ స్థిరత్వం పెరుగుతుందని ఆయన తెలిపారు. అదేవిధంగా 50 సెంట్ల విస్తీర్ణంలో సేంద్రియ విధానంలో సాగుచేస్తున్న వరిపంటను కూడా పరిశీలించి సాగు విధానాలను అడిగి తెలుసుకున్నారు. సేంద్రియ ఎరువులు, దిగుబడి పరిస్థితులపై రైతులను అడిగి తెలుసుకున్నారు. రసాయనాల వినియోగాన్ని తగ్గిస్తూ సేంద్రియ వ్యవసాయాన్ని ప్రోత్సహించడం ద్వారా భూమి సారాన్ని కాపాడుకోవడంతో పాటు ఆరోగ్యకరమైన ఆహార ఉత్పత్తికి దోహదపడుతుందని కలెక్టర్ లక్ష్మీశ పేర్కొన్నారు. వినగడప వద్ద కట్లేరుపై ఉన్న వంతెనను పరిశీలించారు. ఎ.కొండూరు మండలం చైతన్య నగర్ సమీపంలో ఉన్న అగ్రికల్చర్ మార్కెట్ కమిటీ మార్కెట్ యార్డును రాష్ట్ర ఆర్గానిక్ ప్రొడక్ట్ సర్టిఫికేషన్ అథారిటీ ఛైర్మన్ సావల దేవదత్ తదితరులతో సందర్శించారు. కంచికచర్ల మండలంలోని కీసర వద్ద అరటి తోటను కూడా పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ అకాల వర్షాలపై పూర్తి అప్రమత్తంగా ఉన్నామ ని.. వివిధ పంటలకు సంబంధించి పారదర్శకంగా, జవాబు దారీతనంతో పంట నష్టాలను అంచనా వేయడం జరుగుతోందని.. తుది నివేదికల ఆధారంగా పరిహారం అందుతుందని, అన్నదాతలకు అండగా నిలిచేందుకు ప్రభుత్వం కృషిచేస్తోందన్నారు. ఎవరూ అధైర్యపడాల్సిన అవసరం లేదన్నారు. మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని కూడా త్వరలోనే ఏర్పాటు చేసేందుకు చొరవచూపనున్నట్లు తెలిపారు. అదేవిధంగా పెసర, కంది వంటి పంటలకు కూడా మద్దతు ధర లభించేలా కార్యాచరణతో ముందుకెళ్తున్నట్లు కలెక్టర్ లక్ష్మీశ పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా ఉద్యాన అధికారి పి.బాలాజీ కుమార్, గంపలగూడెం వ్యవసాయ అధికారి వి.హరీష్, రైతు సమాఖ్యల ప్రతినిధులు పాల్గొన్నారు.

# విస్తరిస్తున్న యుద్ధ క్షేత్రం?

## డీగోపై ఇరాన్ తాజా దాడే సంకేతం
## కలవరపరుస్తున్న క్షిపణి సామర్థ్యం

దిల్లీ, మార్చి 21



మూడు వారాలకు పైగా ప్రధానంగా పశ్చిమాసియాకే పరిమితమైన యుద్ధ రంగాన్ని మరింత విస్తరించేందుకు ఇరాన్ చేస్తున్న ప్రయత్నాలు కలవరపరుస్తున్నాయి. తన భూభాగానికి ఏకంగా 4,000 కి.మీ. దూరంలో హిందూ మహాసముద్రంలో ఉన్న అమెరికా-బ్రిటన్ సంయుక్త స్థావరం డీగో గార్సియాపై దాడి రక్షణ నిపుణులనే నివ్వెరపరిచింది. తద్వారా అమెరికా సైనిక స్థావరాల్లో తనకు అందరానివంటూ ఏవీ లేవని ఇరాన్ చాటిచెప్పినట్టయింది. గార్షియా స్థావరంపైకి అది ప్రయోగించిన రెండు క్షిపణుల్లో ఒకటి విఫలం కాగా మరోదాన్ని ఎస్ఎం3 ఇంటర్‌సెప్టర్‌తో కూల్చేసినట్టు అమె రికా చెబుతోంది. కాకపోతే ఇరాన్ క్షిపణుల రేంజ్, సామర్థ్యం అమెరికా ఇప్పటిదాకా భావిస్తున్న దానికంటే చాలా ఎక్కువేనని ఈ దాడితో రుజువైంది. ఇరాన్ క్షిపణుల రేంజ్ మహా అయితే 2,000 కి.మీ. మాత్రమేనని అమెరికా చెబుతూ వస్తోంది. ఇరాన్ కూడా వాటిని ఎన్నడూ ఖండించలేదు. కానీ ఆ దేశం చడీచప్పుడూ లేకుండా క్షిపణి సామర్థ్యాన్ని పెంచుకుంటూ వస్తోందనేందుకు తాజా దాడులు నిదర్శనమంటున్నారు. హిందూ మహాసముద్రం నడొ?'డ్డున ఉన్న చాగోస్ ద్వీపసమూహంలో డీగో గార్సియా అంతర్భాగం. అక్కడి 60 దీవుల్లో ఇదే అతి పెద్దది. 1960ల్లో ఇక్కడి 2,000 పై చిలుకు మూలవాసులను బ్రిటన్ బలవంతంగా ఖాళీ చేయించింది. 1971 నుంచీ ఈ దీవి అమెరికాకు అతి కీలక సైనిక స్థావరంగా మారింది. అప్పట్లో వియత్నాం మొదలుకుని అనంతర కాలంలో ఇరాక్, అఫ్గానిస్తాన్‌పై అమెరికా సాగించిన యుద్ధాల్లో ఈ స్థావరమే కీలక పాత్ర పోషించింది. ప్రత్యర్థి దేశమైన చైనా కార్యకలాపాలపై నిశితమైన నిఘాకు కూడా అగ్ర రాజ్యానికి వీలు కల్పిస్తూ వస్తోంది. ప్రస్తుతం ఈ దీవిలో మోహరించిన 2,500 మంది సైనికుల్లో అత్యధికులు అమెరికన్లే. భారీ బాంబర్లు, నిఘా విమానాలతో పాటు కీలకమైన సైనిక మౌలిక సదుపాయాలన్నీ డీగో సొంతం. అణ్వస్త్ర సామర్థ్యంతో కూడిన బీ2 స్పిరిట్ బాంబర్ యుద్ధ విమానాలను కూడా గతేడాది ఆ దీవిలో అమెరికా మోహరించింది. ఇరాన్ తాజా దాడుల నేపథ్యంలో అక్కడ అత్యాధునిక మిసైల్ డిఫెన్స్ వ్యవస్థలను మోహరించడం కూడా తప్పేలా లేదు. అదే జరిగితే అమెరికాకు ఇప్పటికే తడిసిమోపెడవుతున్న యుద్ధ వ్యయం మరింత పెరగడం ఖాయం. ఈ కోణం నుంచి చూస్తే ఇరాన్ దాడి ప్రాధాన్యం సంతరించుకుందన్నది రక్షణ రంగ నిపుణుల అభిప్రాయం. "శనివారం నాటి దాడి ద్వారా యుద్ధక్షేత్రాన్ని గల్ఫ్ నుంచి హిందూ మహాసముద్రానికి విస్తరించడంలో ఇరాన్ సఫలమైంది. అంతేకాదు, దక్షిణ యూరప్ దాకా ఏ లక్ష్యాన్నైనా ఛేదించగల బాలిస్టిక్ క్షిపణి సామర్థ్యం తనకు సమకూరిందంటూ హెచ్చరిక సంకేతాలు పంపింది"అని వారంటున్నారు.

## వాణిజ్య గ్యాస్ సరఫరా 20శాతం పెంపు
### రేపటి నుంచి అమలు .. కేంద్రం కీలక నిర్ణయం

న్యూఢిల్లీ, మార్చి 21

కమర్షియల్ గ్యాస్ సిలిండర్ల కొరత నేపథ్యంలో వాణిజ్య గ్యాస్ సరఫరాను 20శాతం పెంచుతూ కేంద్ర ప్రభుత్వం శనివారం కీలక నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు పలు రాష్ట్రాలకు కేంద్ర పెట్రోలియం సహజ వాయువుల మంత్రిత్వ శాఖ కార్యదర్శి డాక్టర్ నీరజ్ మిట్టల్ లేఖ రాశారు. రాష్ట్రాలకు అదనంగా మరో 20శాతం కమర్షియల్ గ్యాస్ అందించనున్నట్లు ప్రకటించారు. ఈనెల 23వ తేదీ నుంచి అదనంగా 20 శాతం కమర్షియల్ గ్యాస్ సరఫరా చేయనున్నట్లు తెలిపారు. ఇటీవల 10శాతం కమర్షియల్ గ్యాస్ సరఫరాను కేంద్రం పెంచిందని నీరజ్ మిట్టల్ స్పష్టం చేశా రు. తాజాగా మరోసారి 20 శాతం పెంచుతూ కేంద్రం నిర్ణయం తీసుకుందని తెలిపారు. హోటళ్లు, రెస్టారెంట్లు, దాబాలకు గ్యాస్ కొరత లేకుండా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాలను సూచించారు. పారిశ్రామిక క్యాంటీ న్లు, ఫుడ్ ప్రాసెసింగ్, పాడి పరిశ్రమ, రాష్ట్ర ప్రభుత్వాలు లేదా స్థానిక సంస్థలతో నడిపించే రాయితీ క్యాంటీన్లు, అవుట్లెట్లు, కమ్యూనిటీ కిచెన్లకు సరఫరా అయ్యేలా చూడాలని ఆయా రాష్ట్రాలకు నీరజ్ మిట్టల్ సూచించారు.

# నాణ్యత ఫలితాలు మార్చేయకుండా బ్లాక్‌చైన్ భద్రత

- రూ.25 కోట్లతో తిరుమలలో స్టేట్ ఫుడ్ ల్యాబ్ ప్రారంభం
- మంత్రి సత్యకుమార్ యాదవ్



శ్రీవారి ప్రసాదాల తయారీలో వినియోగించే ముడిసరకుల నాణ్యతలో అక్రమాలకు, కల్తీకి తావు లేకుండా అత్యాధునిక సాంకేతికతను వినియోగించనున్నట్లు వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ చెప్పారు. నాణ్యత పరీక్షల ఫలితాలు తారుమారు (మానిప్యులేట్) చేయడానికి వీల్లేకుండా 'బ్లాక్ చైన్ టెక్నాలజీ'ని ప్రవేశపెడుతున్నట్లు వెల్లడించారు. తిరుమలలో భారతీయ ఆహార భద్రత, ప్రమాణాల ప్రాధికార సంస్థ (ఎఫ్ఎస్ఎస్ఏఐ) ఆధ్వర్యంలో సుమారు రూ.25 కోట్లతో ఏర్పాటు చేసిన స్టేట్ ఫుడ్ ల్యాబరేటరీ ప్రారంభోత్సవం సందర్భంగా మంత్రి మీడియాతో మాట్లాడారు. 'సీఎం సూచనతో కేంద్రం ఈ ప్రతిష్ఠాత్మక ల్యాబ్‌ను మంజూరు చేసింది. దీనికోసం తితిదే 12వేల చదరపు అడుగుల భవనం కేటాయించింది. ఈ ల్యాబ్‌లో అత్యంత సూక్ష్మ కల్తీని సైతం గుర్తించవచ్చు. నీటితోపాటు పాలు, నెయ్యి, నూనె, శనగలు, బాదంపప్పు, యాలకులు వంటి సరకుల నాణ్యతను ఇక్కడ పరీక్షిస్తారు. ఒకేసారి 400 రకాల పెస్టిసైడ్స్, ఫెర్టిలైజర్స్, యాడిటివ్స్, సింథటిక్ రంగులు గుర్తించే సామర్థ్యం దీని సొంతం. ముడిసరకుల సేకరణ నుంచి పోటులో లడ్డూ తయారీ వరకు మనుషుల ప్రమేయం లేకుండా సాంకేతికతను వాడాలని సీఎం ఆదేశించారు. లడ్డూ నాణ్యతను పరీక్షించేందుకు ఫ్రాన్స్ నుంచి రూ.3.5 కోట్లతో 'ఈ-నోస్, ఈ-టంగ్' పరికరాలు తీసుకురాబోతున్నాం. రాష్ట్రంలో ఆహార కల్తీని పూర్తిగా అరికట్టేందుకు చర్యలు తీసుకుంటున్నాం. నెల రోజుల్లో విశాఖపట్నంలో, మూడు నాలుగు నెలల్లో గుంటూరులో ఫుడ్ ల్యాబ్‌లు ప్రారం భించనున్నాం. రాష్ట్రంలో 11 ల్యాబ్‌లను ఆధునికీకరిస్తున్నాం. ఎఫ్ఎస్ఎస్ఏఐ ఆధ్వర్యంలో తిరుమల ల్యాబ్ సిబ్బందికి శిక్షణ ఇస్తున్నాం. ల్యాబ్‌ల నిర్వహణ, పరికరాలు, మానవ వనరుల కోసం ఐదేళ్లపాటు కేంద్ర ప్రభుత్వమే నిధులు సమకూరుస్తుంది' అని మంత్రి వివరించారు.




## ప్రపంచ గమ్యస్థానంగా ఉత్తరాంధ్ర
### 'సీఐఐ స్వర్ణాంధ్ర' సదస్సులో కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు

విశాఖపట్నం, మార్చి 21

ఉత్తరాంధ్ర ప్రాంతం ప్రపంచ గమ్యస్థానంగా మారుతోందని కేంద్ర పౌర విమానయానశాఖ మంత్రి రామ్మోహన్‌నాయుడు అన్నారు. ఒకప్పుడు ఈ ప్రాంతం అభివృద్ధికి దూరంగా ఉండేదని... ఇప్పుడు ప్రపంచస్థాయి సంస్థలు ఇటువైపు చూస్తున్నాయని పేర్కొన్నారు. ప్రపంచం మొత్తం సంక్షోభంలో ఉన్నా... భారత్‌ను భద్రంగా ఉంచిన ఘనత ప్రధాని మోదీకి దక్కుతుందన్నారు. భారత పరిశ్రమల సమాఖ్య (సీఐఐ) ఏపీ ఛాప్టర్ ఆధ్వర్యంలో శనివారం విశాఖపట్నంలో 'స్థిరత్వం, పోటీతత్వం, భవిష్యత్తుకు సిద్ధంగా ఆంధ్రప్రదేశ్' అనే అంశంపై నిర్వహించిన సదస్సులో రామ్మోహన్‌నాయుడు ముఖ్యఅతిథిగా పాల్గొని, మాట్లాడారు. 'సీఎం చంద్రబాబు నాయకత్వంలో రాష్ట్రం తన బలాన్ని ప్రపంచానికి చూపుతోంది. ప్రస్తుతం దేశానికి వస్తున్న పెట్టుబడుల్లో 25.30% రాష్ట్రానికే వస్తున్నాయి. రాష్ట్రంలో మరో 7 ఎయిర్‌పోర్టులను అభివృద్ధి చేస్తున్నాం. అభివృద్ధి వికేంద్రీకరణను దృష్టిలో ఉంచుకొని కూటమి ప్రభుత్వం ప్రతి జిల్లాలోనూ పెట్టుబడులను ఆకర్షిస్తోంది. విమాన తయారీ రంగంలోకీ దేశం అడుగు పెట్టబోతోంది. రష్యా సాంకేతికతతో వంద సీట్ల విమానాల తయారీకి ప్రయత్నాలు జరుగుతున్నాయి. జూన్ నాటికి భోగాపురం ఎయిర్‌పోర్టు అందుబాటులోకి వస్తుంది. మంత్రి లోకేశ్ ఆధ్వర్యంలో ఐటీ రంగం రాష్ట్ర ప్రగతిని మార్చుతోంది' అని రామ్మోహన్‌నాయుడు పేర్కొన్నారు. ఈ సందర్భంగా సీఐఐ ప్రతినిధులు రామ్మోహన్‌నాయుడును సత్కరించారు. సీఐఐ ఏపీ ఛైర్మన్ జి.మురళీకృష్ణ అధ్యక్షతన జరిగిన సమావేశంలో గ్రీన్ కో గ్రూపు ప్రెసిడెంట్ మహేష్, ముత్తూట్ ఫిన్ కార్ప్ ఛైర్మన్, సీఐఐ సదరన్ రీజియన్ ఛైర్మన్ థామస్ జాన్ తదితరులు పాల్గొన్నారు.

### కేకే లైన్ వ్యవహారం తేలాకే...

అనంతరం రామ్మోహన్ నాయుడు మీడియాతో మాట్లాడుతూ.. విశాఖ కేంద్రంగా ఏర్పాటయ్యే రైల్వే జోన్ విషయంలో ప్రస్తుతం కేకే లైన్ వ్యవహారంపై చర్చ జరుగుతోందని, అది కొలిక్కి వచ్చాకే గెజిట్ నోటిఫికేషన్ విడుదలవుతుందన్నారు. కేకే లైన్‌ను విశాఖలో ఉంచాలా, లేదా రాయగడ డివిజన్‌లో కలపాలా..? అనేది రైల్వే శాఖ నిర్ణయిస్తుందని పేర్కొన్నారు.

## పట్టణ వ్యర్థాలతో గ్యాస్ ఉత్పత్తి

రోజుకు మొత్తంగా 125 టన్నుల సామర్థ్యంతో మున్సిపల్ ఘన వ్యర్థాల ఆధారిత బయో ఎనర్జీ ప్రాజెక్టులను అమలు చేయనుంది. ఈ మేరకు పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ ఉత్తర్వులు జారీచేసింది. రాజమహేంద్రవరం, నెల్లూరు, గుంటూరు, ఒంగోలు ప్రాంతాల్లో కొత్తగా ఈ ప్లాంట్లను ఏర్పాటు చేయనుండగా.. విజయవాడలో ఇప్పటికే ఉన్న ప్లాంట్‌ను పునరుద్ధరించి, అప్‌గ్రేడ్ చేయనున్నారు. ప్రతి సీబీజీ ప్లాంట్ సామర్థ్యం రోజుకు 25 టన్నులు ఉంటుంది. కేంద్ర ప్రభుత్వం సవరించిన అంచనాల ప్రకారం 100 టీపీడీ (టన్స్ పర్ డే) ప్లాంట్ ఖర్చు రూ.32 కోట్లు, 25 టీపీడీ ప్లాంట్ ఖర్చు రూ.12.60 కోట్లు, విజయవాడ ప్లాంట్ అప్‌గ్రేడ్ వ్యయం రూ.9.45 కోట్లుగా ఉంది. ఈ ప్రాజెక్టులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, పట్టణ స్థానిక సంస్థలతో పాటు ప్రైవేట్ డెవలపర్లు కలిసి నిధులు సమకూర్చనున్నారు. ప్రైవేట్ డెవలపర్లు 36 శాతం పెట్టుబడి పెట్టి, 20 ఏళ్ల పాటు ప్లాంట్ నిర్వహిస్తే సీబీజీ అమ్మకం ద్వారా ఆదాయం పొందనున్నారు. ఈ ప్రాజెక్టులకు స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ నోడల్ ఏజెన్సీగా వ్యవహరించనుంది. సీఎస్ఐఆర్-ఐఐసీటీ హైదరాబాద్ సాంకేతిక మార్గదర్శకత్వం అందిస్తుంది. పట్టణ స్థానిక సంస్థలు ప్లాంట్ల కోసం భూమి, రోడ్లు, నీరు, విద్యుత్ సదుపాయాలు కల్పించాలి. ఈ ప్రాజెక్టులు స్వచ్ఛ భారత్ మిషన్ లక్ష్యాల సాధనలో కీలకంగా నిలవడంతో పాటు పట్టణ వ్యర్థాల్ని వనరులుగా మలచడంలో ఆదర్శంగా నిలుస్తాయని ప్రభుత్వం భావిస్తోంది.

## అడవుల రక్షణ సామూహిక బాధ్యత

అమరావతి, మార్చి 21 (

'అడవులను రక్షించడం అనేది ఒక ఐచ్ఛికం కాదు.. సామూహిక బాధ్యత. ప్రభుత్వం పచ్చదనాన్ని 50 శాతానికి పెంచాలనే దృఢ సంకల్పంతో ఉంది. ఇందులో భాగంగా మరింత పచ్చని, ఆరోగ్యకరమైన, సుస్థిరమైన భవిష్యత్ దిశగా 'వన మహోత్సవం', 'మహా హరిత గోడ' కార్యక్రమాల అమలు వంటి చర్యలు తీసుకుంటోందని' పేర్కొన్నారు.

## ద్రవ్యోల్బణం తరముకొస్తున్నామోదీ సర్కార్ డొల్ల మాటలు
### రాహుల్ గాంధీ ధ్వజం

దిల్లీ, మార్చి 21 (పశ్చిమాసియాలో ఘర్షణలు తీవ్రమవుతున్ననేపథ్యంలో రూపాయి విలువ పడిపోవడం,పారిశ్రామిక ఇంధన ధరలు పెరగడంపైకాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఆందోళనవ్యక్తంచేశారు. భవిష్యత్తులో భారత్‌లోద్రవ్యోల్బణం ఖాయమని హెచ్చరించారు. ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలోనిప్రభుత్వం స్పష్టమైన ఆర్థిక వ్యూహానికి బదులుగా డొల్ల మాటలు చెబుతోందనివిమర్శించారు. శుక్రవారం అమెరికా డాలర్‌తోపోలిస్తే రూపాయి 93 మార్కు కంటే దిగువకుపడిపోయిన నేపథ్యంలో రాహుల్ ఈ మేరకుఎక్స్‌లో పోస్ట్ పెట్టారు. "డాలర్‌తో పోలిస్తేరూపాయి బలహీనపడి రూ.100 వైపు పయనించడం, పారిశ్రామిక ఇంధనధరలు విపరీతంగా పెరగడం - ఇవి కేవలం సంఖ్యలు మాత్రమే కాదు. రాబోయేద్రవ్యోల్బణానికి స్పష్టమైన సంకేతాలు. విదేశీ సంస్థాగత పెట్టుబడిదారులు భారతస్టాక్ మార్కెట్ నుంచి పెట్టుబడులను ఉపసంహరించుకుంటారు. మోదీ ప్రభుత్వందీనిని సాధారణం (నార్మల్) అని పిలవొచ్చు. కానీ వాస్తవం ఏంటంటే ఉత్పత్తి,రవాణా మరింత ఖరీదైనవిగా మారుతాయి. ఎంఎస్ఎంఈలు అత్యంత తీవ్రంగాదెబ్బతింటాయి. నిత్యావసర వస్తువుల ధరలు పెరుగుతాయి. ఎఫ్ఐఐల డబ్బుమరింత వేగంగా బయటకు తరలిపోతుంది. ఇది స్టాక్ మార్కెట్‌పై మరింతఒత్తిడిని పెంచుతుంది. మరో మాటలో చెప్పాలంటే ఇది ప్రతి కుటుంబంలోని వ్యక్తిజేబుపై ప్రత్యక్షంగా, తీవ్రంగా ప్రభావం చూపడం ఖాయం. త్వరలో జరగబోయేఅసెంబ్లీ ఎన్నికల తర్వాత పెట్రోల్, డీజిల్, ఎల్‌పీజీ ధరలు కూడా పెరుగుతాయి"అని రాహుల్ రాసుకొచ్చారు.

# ప్రపంచ వ్యాప్త ద్రవ్యోల్బణ సెగలే..!

## పశ్చిమాసియా యుద్ధంతో ప్రభావం
## ఎస్‌బిఐ రీసెర్చ్ రిపోర్ట్ వెల్లడి




న్యూఢిల్లీ : పశ్చిమాసియాలో నెలకొన్న యుద్ధంతో ప్రపంచ వ్యాప్తంగా ద్రవ్యోల్బణం ఎగిసే అవకాశం ఉందని ఎస్‌బిఐ రీసెర్చ్ తన నివేదికలో వెల్లడించింది. యుద్ధం ఇతర ప్రాంతాలకు వ్యాపిస్తే మరింత ద్రవ్యోల్బణ అలజడకి కారణం కావచ్చని హెచ్చరించింది. పెరుగుతున్న భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలతో ప్రపంచ ఇంధన రంగం, వాణిజ్యం, ఆర్థిక వ్యవస్థలపై తీవ్ర ప్రభావం చూపవచ్చని నివేదిక పేర్కొంది. అయితే పశ్చిమాసియా ఘర్షణలు భారత్‌పై పెద్ద ప్రభావం చూపకపోవచ్చని తప్పుడు తడకగా రిపోర్ట్ ఉండటం గమనార్హం. బ్యారెల్ చమురు ధర 110 డాలర్లు దాటడంతో భారత ఇంధనం, రవాణపై తీవ్ర ఒత్తిడి నెలకొంది. గ్యాస్ కొరతతో అనేక కంపెనీలు మూతపడుతున్నాయి. మరోవైపు యుద్ధం ప్రభావంతో డాలర్‌తో రూపాయి మారకం విలువ రికార్డ్ కనిష్ఠం 94 చేరువలో నమోదయ్యింది. ఎగుమతులు పడిపోతు న్నాయి. అయినప్పటికీ యుద్ధ ప్రభావం అంతంతే అంటూ ఎస్‌బిఐ నివేదిక పేర్కొనడం సంస్థ విశ్వసనీయతను దెబ్బతీస్తోంది.

భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు పెరిగితే ఇంధన మార్కెట్లు, అంతర్జాతీయ వాణిజ్యం, ఆర్థిక వ్యవస్థల్లో అస్థిరత ఏర్పడవచ్చని రిపోర్ట్ పేర్కొంది. ఒకవేళ ఈ సంఘర్షణ దీర్ఘకాలం కొనసాగితే.. ముడి చమురు ధర ప్రతీ 10 డాలర్లు పెరిగినప్పుడు.. భారత కరెంట్ అకౌంట్ లోటు (సిఎడి) 36 బేసిస్ పాయింట్లు, ద్రవ్యోల్బణం 35–40 బేసిస్ పాయింట్లు పెరిగే ప్రమాదం ఉందని నివేదిక అంచనా వేసింది.

"భారత్‌కు సంబంధించి ప్రధానంగా గల్ఫ్ దేశాల నుండి వచ్చే విదేశీ నగదు, ముడి చమురు దిగుమతులపై ఈ ప్రభావం స్వల్పకాలికంగా ఉండవచ్చు. భారత్ తన ముడి చమురు అవసరాల కోసం సుమారు 90 శాతం దిగుమతులపైనే ఆధారపడుతోంది. ప్రపంచ చమురు వాణిజ్యంలో కీలకమైన హర్మూజ్ నది మార్గంపై ఆధారపడటం ఇంధన భద్రత పరంగా ఒక సవాలుగా మారింది. అయితే.. భారత్ వ్యూహాత్మకంగా తన చమురు దిగుమతులను ప్రస్తుతం 40 కంటే ఎక్కువ దేశాల నుండి తీసుకుంటుంది. ముఖ్యంగా 2022 నుండి రష్యా నుండి దిగుమతులు పెరగడం మనకు రక్షణగా నిలిచింది. మరోవైపు 2025 ఆర్థిక సంవత్సరంలో భారత విదేశీ రెమిటెన్స్‌లు 15 శాతం వృద్ధితో 138 బిలియన్ డాలర్లకు చేరాయి. ఇందులో 38 శాతం వాటా గల్ఫ్ దేశాలదే కావడం గమనార్హం. ఈ నేపథ్యంలో అనిశ్చితి నెలకొన్నప్పటికీ భారత విధానపరమైన నిర్ణయాలు సంక్షోభ ప్రభావాన్ని తట్టుకోవడానికి తోడ్పడతాయి." అని ఎస్‌బిఐ రీసెర్చ్ పేర్కొంది.




## పబ్లిక్ ఇష్యూకు ఎస్‌బిఐ మ్యూచువల్ ఫండ్..!
### సెబీకి దరఖాస్తు

న్యూఢిల్లీ : దేశీ అతిపెద్ద ఫండ్ హౌస్ ఎస్‌బిఐ మ్యూచువల్ ఫండ్ పబ్లిక్ ఇష్యూ కోసం సెబీకి ప్రాథమిక పత్రాలను సమర్పించింది. రూ.12.5 లక్షల కోట్ల ఆస్తులను నిర్వహిస్తున్న ఈ సంస్థ ఆఫర్ ఫర్ సేల్ (ఒఎఫ్ఎస్) రూపంలో 20.37 కోట్ల ఈక్విటీ షేర్లను విక్రయించనుంది. ఇందులో ప్రధాన ప్రమోటర్లయిన స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, అముండి ఇండియా హోల్డింగ్ తమ వాటాలను తగ్గించుకోనున్నాయి. ఈ మెగా ఐపిఒ నిర్వహణ కోసం కోటక్ మహీంద్రా, ఐసిఐసిఐ సెక్యూరిటీస్ వంటి ప్రముఖ మర్చంట్ బ్యాంకర్ల కన్సార్టియంను కంపెనీ నియమించింది. "భారతదేశంలో మొట్టమొదటి నాన్ యుటిఐ మ్యూచువల్ ఫండ్‌గా మా ప్రస్థానం చారిత్రాత్మకమైనది. ఈ ఐపిఒ ద్వారా మరింత పారదర్శకతను పెంచుతూ, దేశీయ మూలధన మార్కెట్లో మా నాయకత్వాన్ని మరింత బలోపేతం చేసుకుంటాము" అని ఆ సంస్థ పేర్కొంది.

## రంజాన్ వేళ ... తగ్గిన బంగారం రేట్లు ...!



రంజాన్ పండుగ వేళ ... బంగారం రేట్లు భారీగా తగ్గాయి. మంగళవారం భారీగా పెరిగిన పసిడి రేట్లు నేడు తగ్గుముఖం పట్టాయి. యూఎస్ ఫెడరల్ రిజర్వ్ విధాన నిర్ణయం, మధ్యప్రాచ్య సంఘర్షణ, ప్రపంచ ఆర్థిక స్థితిగత ులపై యుద్ధ ప్రభావం నేపథ్యంలో పెట్టుబడిదారుల అంచనాలు తలకిందుల వుతున్నాయి. ఈ అనిశ్చిత పరిస్థితులు బంగారం ధరల స్థిరత్వాన్ని దెబ్బతీస్తున్నా యి. ఫెడ్ వడ్డీ రేట్ల కోత ప్రశ్నార్థకంగా మారడం దీనికి తోడైంది.రంజాన్ పండుగ వేళ .... నేడు పసిడి రేట్లు మళ్లీ తగ్గుదల బాట పట్టాయి. ముంబైలో 10 గ్రాముల 24 క్యారెట్ల బంగారం ధర రూ. 1,50,070 కాగా, 22 క్యారెట్లు రూ. 1,37,140గా నమోదైంది. కిందటి ముగింపు సెషన్ తో పోల్చుకుంటే వీటి రేట్లల్లో భారీ తగ్గుదల కనిపించింది. అంతర్జాతీయ మార్కెట్లో కూడా బంగారం, వెండి ధరలు తగ్గాయి. ఔన్స్ బంగారం 4,574.34 డాలర్లకు దిగింది. అంతకుముందు సెషన్ కంటే 2.51 శాతం తగ్గింది. వెండి 3.82 శాతం వృద్ధితో ఔన్స్‌కు 73.96 డాలర్లకు చేరుకుంది. మార్చి 20న దేశంలోని వివిధ నగరాల్లో బంగారం ధరలు కొద్దిగా మారాయి. ఢిల్లీ, జైపూర్లలో 10 గ్రాముల 24 క్యారెట్ల బంగారం రూ. 1,50,420, 22 క్యారెట్లు రూ. 1,37,890కి లభించగా, ముంబై, హైదరాబాద్ వంటి ప్రధాన నగరాల్లో 24 క్యారెట్ల బంగారం రూ. 1,50,270, 22 క్యారెట్లు రూ. 1,37,740 వద్ద ట్రేడ్ అయ్యింది.

# అమెరికాకు నిలిచిన మసాలా ఎగుమతులు

## ఆర్డర్లు లేక
## ఎగుమతిదారుల్లో ఆందోళన




న్యూఢిల్లీ :అమెరికా సామ్రాజ్యవాదంతో పశ్చిమాసియాలో నెలకొన్న యుద్ధోన్మాదం భారత ఎగుమతులను తీవ్ర ప్రభావితం చేస్తోంది. భారత సుగంధ ద్రవ్యాల ఎగుమతులు స్తంభించాయి. భారత్ నుండి ఏటా సుమారు 500 మిలియన్ డాలర్ల (దాదాపు రూ.4700 కోట్లు) విలువైన మసాలా దినుసులు అమెరికాకు ఎగుమతి అవుతుండగా.. ప్రస్తుత అనిశ్చితి వల్ల అక్కడి కొనుగోలుదారులు కొత్త ఆర్డర్లు ఇచ్చేందుకు వెనుకాడుతున్నారు. సాధారణంగా ప్రతి ఏటా నవంబర్ నెలలో ఎగుమతిదారులు, కొనుగోలుదా రులు ప్రాథమిక ఒప్పందాలు చేసుకున్నప్పటికీ, ప్రస్తుతం షిప్పింగ్ మార్గాల్లో అంతరాయం, పెరిగిన బీమా ప్రీమియంలు, యుద్ధ రిస్క్ సర్‌ఛార్జీల కారణంగా కొనుగోలుదారుల నుండి ఎటువంటి స్పందన రావడం లేదని ఎగుమతిదారులు వాపోతున్నారు. గత ఆర్థిక సంవత్సరంలో మసాలా దిగుమతుల సాగు విస్తీర్ణం 5.09 మిలియన్ హెక్టార్లకు లేదా 1.4 శాతం పెరిగి ఉత్పత్తి 12.99 మిలియన్ టన్నులకు చేరుకున్నప్పటికీ, ఎగుమతులు నిలిచిపోవడంతో దేశీయంగా మిగులు నిల్వలు పెరిగి ధరలు పడిపోయే ప్రమాదం ఉందని ఈ రంగం నిపుణులు హెచ్చరిస్తున్నారు. ముఖ్యంగా మిరియాలు, యాలకులు, మిరపకాయలు, ధనియాలు, కరివేపాకు పొడి వంటి ఉత్పత్తుల ఎగుమతులపై ఈ ప్రభావం స్పష్టంగా కనిపిస్తోంది. యుద్ధం కారణంగా సముద్ర మార్గాల్లో రవాణా ఖర్చులు భారీగా పెరగడం మరియు కంటైనర్ల కొరత ఏర్పడటంతో ఎగుమతిదారులు ప్రత్యామ్నాయ మార్కెట్లను వెతుక్కోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. "యుద్ధం ప్రారంభమైనప్పటి నుండి అమెరికా కొనుగోలుదారుల నుండి ఎటువంటి ఆర్డర్లు లేవు. ఇది ఎగుమతిదారులలో ఆందోళన కలిగిస్తోంది. అనిశ్చితి, రవాణా ఇబ్బందుల వల్ల రైతులు తమ ఉత్పత్తులకు గిట్టుబాటు ధర లభించక ఆర్థికంగా నష్టపోయే అవకాశం ఉంది. కాబట్టి ప్రభుత్వం వెంటనే స్పందించి ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషించాలి" అని ఓ ఎగుమతిదారు తెలిపారు.



## 2028లో ప్రపంచ ఇండోర్ అథ్లెటిక్స్‌కు ఒడిశా ఆతిథ్యం

భువనేశ్వర్ : ఒడిశా అరుదైన అవకాశం దక్కించుకుంది. 2028లో జరగనున్న ప్రపంచ అథ్లెటిక్స్ ఇండోర్ ఛాంపియన్‌షిప్ పోటీలకు భువనేశ్వర్‌లోని కళింగ ఇండోర్ స్టేడియం ఆతిథ్యమివ్వనుంది. ఈ మేరకు భారత అథ్లెటిక్స్ సమాఖ్య (ఎఎఫ్ఐ) అధ్యక్షులు బహదూర్ సింగ్ సగూ తెలిపారు. కాగా ఈ ఏడాది పోటీ లకు పోలండ్‌లోని టోరున్ ఆతిథ్యమిస్తోంది. వైభవంగా ఈ క్రీడా పోటీలు ప్రారంభమయ్యాయి. ఇదే సందర్భంలో జరిగిన ప్రపంచ అథ్లెటిక్స్ కౌన్సిల్ సమా వేశంలో 2028 ఎడిషన్ మ్యాచ్‌లకు భారత్‌కు కేటాయించినట్లు బహదూర్ పేర్కొన్నారు.

## మహిళా కోచ్ తప్పనిసరి
### ఫిఫా నిబంధనల్లో మార్పు



జ్యూరిచ్ (స్విట్జర్లాండ్) : మహిళా సాకర్ కోచ్‌లకు ఇక నుంచి మరిన్ని అవకాశాలు రానున్నాయి. అంతర్జాతీయ ఫుట్‌బాల్ అసోసియేషన్ల సమాఖ్య (ఫిఫా) ఈ మేరకు నిబంధనల్లో మార్పులు తీసుకొచ్చింది. కొత్త నిబంధన ప్రకారం..మహిళల టోర్నమెంట్లలో ప్రతి జట్టు హెడ్ కోచ్‌గా కానీ, లేదా అసిస్టెంట్ కోచ్‌గా కానీ కనీసం ఒకరైనా మహిళా కోచ్‌ను నియమించుకోవాలని ఫిఫా నిర్దేశించింది. 2023లో జరిగిన మహిళల ప్రపంచ కప్ టోర్నమెంట్‌లో పాల్గొన్న 32 జట్లలో కేవలం 10 మంది మాత్రమే మహిళా కోచ్‌లకు స్థానం దక్కింది. మహిళలకు అవకాశాలు పెంచాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని, వారికి అన్ని విభాగాల్లోనూ మార్గం సుగమం చేయాలని ఫిఫా చీఫ్ ఫుట్‌బాల్ అధికారి జిల్ ఎల్లిస్ తెలిపారు.

# అప్పుడు 7 కిలోలు తగ్గా: శ్రేయస్ అయ్యర్




ఇంటర్నెట్ డెస్క్: తనను రూ.26.75 కోట్లకు కొనుగోలు చేసిన పంజాబ్ కింగ్స్‌ను ఐపీఎల్ 2025 సీజన్‌లో కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ ఫైనల్‌కు చేర్చాడు. బ్యాటర్‌గానూ ఉత్తమ ప్రదర్శనతో ఆకట్టుకున్నాడు. ఆర్సీబీ చేతిలో ఓటమితో రన్నరప్‌గా నిలిచినా.. పంజాబ్ కింగ్స్ పోరాటం మాత్రం అదిరిపోయింది. అయితే, శ్రేయస్‌కు భారత జట్టు తరఫున మాత్రం పెద్దగా అవకాశాలు రాలేదు. గాయం వల్ల ఇటీవల ముగిసిన టీ20 ప్రపంచకప్‌లోనూ చోటు దక్కలేదు. దీంతో తనకు గతేడాది చాలా కష్టంగా గడిచిందని తాజాగా ఓ ఇంటర్వ్యూలో వెల్లడించాడు. గాయం వల్ల దాదాపు ఏడు కేజీల బరువు కూడా తగ్గినట్లు తెలిపాడు. గాయం నుంచి కోలుకొని రావడం చాలా కష్టమని వెల్లడించాడు. ఒక్క క్షణం వృథా చేయొద్దు.. ఈసారి మరింత పోటీ: విరాట్ కోహ్లీ వార్నింగ్"గాయం వల్ల నేను దాదాపు ఏడు కేజీలు బరువు తగ్గా. దానినుంచి కోలుకొని రావడం పెద్ద సవాల్‌గా నిలిచింది. నాకైన గాయం చాలా ప్రమాదకరమైందే. అయితే, రెండు నెలలు తీవ్రంగా కష్టపడిన తర్వాత.. ఇప్పుడు నా శరీరాకృతి బాగుంది. కానీ, ఫిట్‌గా ఉంటూనే ఏడు కేజీల బరువు పెరగాలంటే చాలా శ్రమించాలి. నాకు సవాళ్లు అంటే చాలా ఇష్టం. తప్పకుండా ఆ పరిస్థితిని అధిగమిస్తా. ఇలాంటివి ఎన్నోసార్లు అనుభవించా. కమ్‌బ్యాక్ చేసి భారత జట్టుకూ ఆడిన రోజులు ఉన్నాయి" అని శ్రేయస్ తెలిపాడు.

### అంచనాలు భారీగానే..

"గతేడాది మేం ఫైనల్‌కు వచ్చాం. రన్నరప్‌గా నిలిచాం. దీంతో ఈసారి మాపై భారీగానే అంచనాలు ఉంటాయి. ఎప్పుడు అడుగు వేసినా.. విజయం సాధించేందుకే ప్రయత్నిస్తాం. నా కన్ను ట్రోఫీ పైనే ఉంది. గత రెండు నెలలుగా మేమంతా ఓ కుటుంబంలా కలిసి ఉన్నాం. ఒకరినొకరం అర్థం చేసుకున్నాం. ప్రతి మ్యాచ్‌కు రెండు లేదా మూడు రోజుల ముందే ప్రణాళికలు సిద్ధం చేసుకుంటాం. మైదానం ఆవల ఉండే బాండింగ్‌తోనే మ్యాచ్‌లో మెరుగ్గా రాణించేందుకు ఎక్కువ అవకాశం ఉంటుంది" అని శ్రేయస్ తెలిపాడు.

### అంచనాలు అందుకుంటాం!

ఐపీఎల్ 2026 సీజన్‌లో టైటిల్ ఫేవరెట్లలో ఒకటిగా పంజాబ్ కింగ్స్ బరిలోకి దిగుతోంది. పంజాబ్ కింగ్స్‌కు కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ ప్రధాన బలం. గతేడాది సీజన్‌లో కెప్టెన్ష్ అయ్యర్ పంజాబ్‌ను ఫైనల్ చేర్చాడు. కానీ తుది పోరులో రాయల్ చాలెంజర్స్ బెంగళూరు చేతిలో ఓడిపోయి రన్నరప్‌కే పరిమితమయింది. కానీ ఈసారి మాత్రం అభిమానులు తమపై పెట్టుకున్న అంచనాలను నిజం చేస్తూ ఐపీఎల్ కప్పు కొల్లగొడతామని శ్రేయస్ అయ్యర్ ధీమా వ్యక్తం చేశాడు. ఐపీఎల్ 19వ సీజన్‌కు సిద్ధమవుతున్న తరుణంలో అయ్యర్ పలు ఆసక్తికర అంశాలను పంచుకున్నాడు .'గాయం వల్ల నేను దాదాపు ఏడు కేజీలు బరువు తగ్గాను. దాని నుంచి కోలుకొని రావడం పెద్ద సవాల్‌గా నిలిచింది. నాకైన గాయం చాలా ప్రమాదకరమైనది. అయితే రెండు నెలల తీవ్రంగా కష్టపడిన తర్వాత ఇప్పుడు శరీరాకృతి బాగుంది. కానీ ఫిట్‌గా ఉంటూనే ఏడు కేజీల బరువు పెరగాలంటే చాలా శ్రమించాలి. నాకు సవాళ్లు అంటే చాలా ఇష్టం. తప్పకుండా పరిస్థితిని అధిగమిస్తా. ఇలాంటివి ఎన్నోసార్లు అనుభవించా. కమ్‌బ్యాక్ చేసి భారత జట్టుకు ఆడిన రోజులు ఉన్నాయి. గతేడాది మేం ఫైనల్‌కు వచ్చాం. రన్నరప్‌గా నిలిచాం.దీంతో ఈసారి మాపై అంచనాలు భారీగా ఉంటాయి. ఆ అంచనాలు అందుకోవడానికి కష్టపడతాం. విజయాలు సాధించి ట్రోఫీని అందుకుంటాం. ప్రతి మ్యాచ్‌కు మూడు రోజుల ముందే ప్రణాళికలు సిద్ధం చేసుకుంటాం. మైదానం ఆవల ఉండే బాండింగ్‌తోనే మ్యాచ్‌లో మెరుగ్గా రాణించేందుకు ఎక్కువ అవకాశం ఉంటుంది' అని శ్రేయస్ తెలిపాడు. ఇక పంజాబ్ కింగ్స్ ఈ సీజన్‌లో తమ తొలి మ్యాచ్‌ను మార్చి 31న గుజరాత్ టైటాన్స్‌తో ఆడనుంది.



# గాయంతో ఐపిఎల్‌కు ఆకాశ్ దీప్ దూరం

## ఆఫ్గన్‌తో టెస్ట్‌మ్యాచ్‌కు సందేహమే

ముంబయి : భారత సీమర్ ఆకాశ్ దీప్ గాయం కారణంగా ఇండియన్ ప్రిమియర్ లీగ్ (ఐపిఎల్) మ్యాచ్‌లకు దూరం కానున్నారు. దీంతో కొల్‌కతా నైట్ రైడర్స్ (కెకెఆర్) జట్టు పేస్ బౌలింగ్ విభాగానికి ఎదురుదెబ్బ తగిలింది. ఆకాశ్ దీప్ నడము కింది భాగంలో స్ట్రెస్ రియాక్షన్ కారణంగా ఆయన 8 వారాల పాటు జట్టుకు దూరంగా ఉండనున్నారు. ఈ గాయం కారణంగా జూన్ ఆరంభంలో ఆఫ్ఘనిస్తాన్‌తో జరిగే ఏకైక టెస్టుకు ఆకాశ్ అందు బాటులో ఉంటారా? లేదా? అనేది కూడా సందేహమే! 'ఆకాష్ దీప్ నడుము కింది భాగంలో స్ట్రెస్ రియాక్షన్‌కు గురయ్యాడు. కోలుకోవడానికి కనీసం 8–12 వారాలు పట్టవచ్చు. అతను ఐపిఎల్‌లో ఆడటం లేదు. ఆఫ్ఘనిస్తాన్‌తో జరిగే మ్యాచ్‌కు ఎంపికయ్యే అవకాశాలు చాలా తక్కువ," అని బిసిసిఐకి చెందిన సంబంధిత అధికారులు తెలిపారు. జమ్మూ కాశ్మీర్‌తో జరిగిన రంజీ ట్రోఫీ సెమీఫైనల్‌లో చివరిసారిగా బరిలోకి దిగిన 29 ఏళ్ల బెంగాల్ పేసర్ ఆకాశ్ ఫిట్‌నెస్‌తో లేనట్లు కనిపించారు. తొలి ఇన్నింగ్స్‌లో కేవలం 13 ఓవర్లు, రెండో ఇన్నింగ్స్‌లో ఏడు ఓవర్ల కన్నా తక్కువ బౌలింగ్ చేశారు. అప్పటి నుండి అతను బెంగళూరులోని బిసిసిఐ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో విశ్రాంతి తీసుకుంటున్నారు. ఈ నెల 18న బుధవారం కొల్‌కతాలో ప్రారంభమైన కెకెఆర్ సన్నాహక శిబిరానికి కూడా ఆయన హాజరుకాలేదు. మూడుసార్లు ఛాంపియన్‌గా నిలిచిన కెకెఆర్ జట్టులో గాయపడినవారి జాబితాలో ఇప్పటికే భారత పేసర్ హర్షిత్ రాణా, శ్రీలంక ఆటగాడు మతీషా పతిరానా గాయపడ్డారు.

# థైరాయిడ్ సమస్యలతో బాధపడుతున్నారా.. ? రోజు ఇలాంటివి తీసుకుంటే మేలు జరుగుతుంది..!

ఈ రోజుల్లో, థైరాయిడ్ సమస్యలు మహిళల్లో చాలా సాధారణం అవుతున్నాయి. ఇది తీవ్రమైన జీవనశైలి వ్యాధి, ఇది చాలా కాలంగా సరైన ఆహారం మరియు నిశ్చల జీవనశైలిని అనుసరించడం వల్ల మహిళల్లో కనిపిస్తుంది. నిజానికి, థైరాయిడ్ అనేది మన మెడపై ఉన్న ఒక చిన్న గ్రంథి, దీని ఆకారం సీతాకోకచిలుకలా ఉంటుంది. కొన్ని ముఖ్యమైన హార్మోన్ల ఉత్పత్తిలో ఈ గ్రంథి చాలా కీలక పాత్ర పోషిస్తుంది. థైరాయిడ్ గ్రంథి సరిగ్గా పని చేయనప్పుడు, అది తగినంత హార్మోన్లను విడుదల చేయదు. దీని వలన జీవక్రియ మందగిస్తుంది. లేదా వేగవంతం అవుతుంది. శరీరంలోని ఇతర హార్మోన్ల ఉత్పత్తిలో జీవక్రియ చాలా ముఖ్యమైన పాత్ర పోషిస్తుంది. థైరాయిడ్ పనితీరు సరిగా లేకపోవడం వల్ల శరీరంలో హార్మోన్ల సమతుల్యత దెబ్బతింటుంది. దీని కారణంగా మహిళలు క్రమం తప్పకుండా పీరియడ్స్, తీవ్రమైన నొప్పి, తిమ్మిరి, వంధ్యత్వం, అనేక ఇతర తీవ్రమైన సమస్యలను ఎదుర్కోవలసి ఉంటుంది. అయితే, ఒక మంచి విషయం ఏమిటంటే ఆహారం, ఆరోగ్యకరమైన జీవనశైలిలో కొన్ని ముఖ్యమైన మార్పులతో మీరు థైరాయిడ్ పనితీరును మెరుగుపరచవచ్చు. థైరాయిడ్‌తో బాధపడే స్త్రీలు వాటిని ఆహారంలో భాగంగా చేసుకుంటే మంచి ఫలితం ఉంటుంది.



థైరాయిడ్ గ్రంథి పనితీరును మెరుగుపరచడంలో సహాయపడే కొన్ని ఆహారాలను ఇక్కడ తెలుసుకుందాం.. మజ్జిగ తాగితే మంచిది.. మాంసకృత్తులు, కాల్షియం, విటమిన్ బి, అనేక ముఖ్యమైన పోషకాలతో సమృద్ధిగా ఉన్న మజ్జిగ ప్రేగులకు చాలా ఉపయోగకరంగా ఉంటుంది. ఇది శక్తివంతమైన ప్రోబయోటిక్. ఇది ప్రేగులలో మంచి బ్యాక్టీరియాను పెంచడంలో సహాయపడుతుంది. దీన్ని తాగడం వల్ల జీర్ణక్రియ మెరుగుపడుతుంది. థైరాయిడ్ పనితీరు మెరుగుపడుతుంది. అనేక సమస్యలను దూరం చేస్తుంది. బీట్‌రూట్, క్యారెట్ జ్యూస్ తాగండి.. ఈ జ్యూస్‌లో విటమిన్ ఎ, బి, సి, ఐరన్, ఫోలిక్ యాసిడ్‌తో పాటు లైకోపీన్, ఫైటోన్యూట్రియెంట్లు పుష్కలంగా ఉన్నాయి. ఇవి శక్తివంతమైన యాంటీఆక్సిడెంట్ లక్షణాలను కలిగి ఉంటాయి. ఈ జ్యూస్ తాగడం వల్ల థైరాయిడ్ గ్రంధికి అవసరమైన పోషణ అందుతుంది. దాని పనితీరు మెరుగుపడుతుంది. ఆకుపచ్చ కూరగాయల జ్యూస్.. ఆకుకూరల రసంలో పోషకాలు, యాంటీఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి. వాటిలో చాలా ముఖ్యమైన విటమిన్లు, ఖనిజాలు పుష్కలంగా ఉన్నాయి. ఈ జ్యూస్ తాగడం వల్ల శరీరంలోని రక్తహీనత తొలగిపోయి రక్త ప్రసరణ కూడా మెరుగుపడుతుంది. అదనంగా, అవి థైరాయిడ్ పనితీరును మెరుగుపరచడంలో, లక్షణాలను మెరుగుపరచడంలో సహాయపడతాయి. మూలికల టీ.. మిల్క్ టీకి బదులుగా, చమోమిలే టీ, గ్రీన్ టీ, అల్లం టీ, ఫెన్నెల్, జీలకర్ర, ఆకుకూరల వంటి కొన్ని హెర్బల్ టీలు తాగడం థైరాయిడ్ మహిళలకు చాలా ఉపయోగకరంగా ఉంటుంది. ఇవి శరీరంలో హార్మోన్ల సమతుల్యతను మెరుగుపరచడంలో సహాయపడతాయి. అంతేకాకుండా, ఇది ఆరోగ్యానికి అద్భుతమైన ప్రయోజనాలను కూడా అందిస్తుంది. పసుపు పాలు.. ఇది ఆరోగ్యానికి ఆరోగ్యకరమైన, చాలా ప్రయోజనకరమైన పానీయం. ఇది ప్రతిరోజూ పసుపు తాగాలని నిపుణులు చెబుతున్నారు. యాంటీ ఆక్సిడెంట్లు, యాంటీ ఇన్ఫ్లమేటరీ గుణాలు పుష్కలంగా ఉన్న ఈ పానీయం థైరాయిడ్ గ్రంథి వాపును తగ్గిస్తుంది. దీన్ని తీసుకోవడం వల్ల శరీరంలో హార్మోన్ల సమతుల్యత మెరుగుపడుతుంది.

# అడపాదడపా ఉపవాసం చేస్తున్నారా.? అనారోగ్యాన్ని కొనితెచ్చుకున్నట్టే.. ఇదిగో క్లారిటీ..

ఇంటర్మిటెంట్ ఫాస్టింగ్(అడపాదడపా ఉపవాసం) వల్ల గుండె జబ్బులు వస్తాయని, స్ట్రోక్ వస్తుందని గత నాలుగైదు రోజులుగా ఎన్నో సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. మనం ఆహారాన్ని తీసుకున్న వెంటనే నోట్లో నుంచే జీర్ణక్రియ అనేది ప్రారంభమవుతుంది. లాలాజలంలో టయలిన్ అనే ఎన్‌జైమ్ ఉంటుంది. మన జీర్ణాశయంలో 4 గంటల పాటు ఉండి అక్కడ జీర్ణాశయంలో ఉండే హైడ్రోక్లోరిక్ యాసిడ్.. కాలేయం నుంచి వచ్చే కాలేయ రసాలు బైల్ యాసిడ్స్, క్లోమం నుంచి వచ్చే ఎన్‌జైమ్‌లు అన్ని కూడా ఈ ఆహారంతో కలుస్తాయి. ఈ ప్రాసెస్ అంతా జరగడానికి జీర్ణాశయం నుంచి మన ఆహారం బయటకు వెళ్లడానికి 6 గంటల సమయం పడుతుంది. జీర్ణాశయం నుంచి ఆహారం కిందకు వెళ్లేనే మరలా మనకు ఆకలి వేసినట్టు అనిపిస్తుంది. కానీ అక్కడే మనం పప్పులో కాలేస్తాం. అసలైన జీర్ణ వ్యవస్థ.. అసలైన ఆహారం జీర్ణం కావడం 6 గంటల తర్వాతే ప్రారంభమవుతుంది. దీనిని ఇంటర్ డైజెస్టివ్ ఫేస్ అని అంటారు. ఈ ఆహారం జీర్ణకోశం నుంచి కిందకు వెళ్లిన తర్వాత దాదాపు 3 మీటర్ల పొడుగున ఉండే చిన్న ప్రేగుల ద్వారా వెళ్తూ ఉంటుంది. అప్పుడు మన ఆహారంలో ఉన్న పదార్థాల్ని గ్లూకోజ్ గానూ ప్రోటీన్ లాగానే విభజించి వాటిని చిన్న ప్రేగులలో ఉన్న విల్లై ద్వారా అబ్సార్బ్ చేసుకొని అవి మరలా బ్లడ్‌లో కలిసి లివర్‌కు వెళ్లి కొంత స్టోర్ అయ్యి మనకు శక్తిని ప్రసాదిస్తాయి. తరువాత మిగిలిన వ్యర్థ పదార్థాలు పెద్ద ప్రేగులోకి వెళ్లి వీలైనంత నీటిని పీల్చుకొని విసర్జన జరుగుతుంది. ఇలా జీర్ణం కావడానికి మొత్తం 24 గంటల సమయం పడుతుంది. మన శరీరానికి కావలసిన శక్తిని ప్రసాదించేది ఇంటర్ డైజెస్టివ్ ఫేస్ అనే 16 గంటల సమయమే.. మనం చాలామంది జీర్ణకోశంలో ఆహారం ఉంటేనే మనకి శక్తి వస్తుంది అని అనుకుంటాం అది తప్పు. మరి ఈ మధ్య కాలంలో ఇంటర్మిటెంట్ ఫాస్టింగ్ చేస్తే హార్ట్ స్ట్రోక్స్ వస్తాయంటూ వైరల్‌గా మారింది. దీన్ని వైద్యులు కొట్టిపారేశారు. చైనాలో ఓ 200 మందికి ఫోన్ చేసి ప్రశ్నలడిగి, అవే ప్రశ్నలు అమెరికాలో ఉండే 200 మందికి అడిగి ఇక గుండె జబ్బులు వస్తాయి అంటున్నారని.. కానీ వాస్తవానికి దీనికి ఎటువంటి శాస్త్రీయమైన ఆధారాలు జతపరచలేదని.. ఇది ఒక బేసిక్ స్టడీ మాత్రమే కానీ దీనికి ఎటువంటి ప్రామాణికత లేదంటున్నారు. బాగా గమనించినట్లయితే చాలా జంతువులు, పక్షులు అన్నీ కూడా ఒక పూటనే తింటాయని.. మనుషుల మాదిరి చాలాసార్లు తినవంటున్నారు. తక్కువసార్లు తినడం వల్ల



జీర్ణ వ్యవస్థకు కొంచెం గ్యాప్ ఇవ్వడం వల్ల పేగులలో ఆహారం బాగా జీర్ణమయ్యి ఇంకా బాగా శరీరంలోకి అబ్సార్బ్ అవుతుంది అంటున్నారు. అందుకే ఇంటర్మిటెంట్ ఫాస్టింగ్ అనేది నిజంగా ఫాస్టింగ్ కాదని మామూలుగా చేయాల్సిన పనే అంటున్నారు. అది కాకపోతే మనం ఎక్కువసార్లు తినడం అలవాటు చేసుకున్నాం. శరీర నిర్మాణంలో జీర్ణాశయం అనేది ఒక స్టోరేజ్ పాయింట్. పాత కాలంలో ఆహారం సదా దొరకదు. కాబట్టి మనకు జీర్ణాశయం అనేది పరిణామ క్రమంలో డెవలప్ అయింది. అనగా మనం ఆహారాన్ని ఒకేసారి తీసుకొని దానిని నిదానంగా కిందికి పంపిస్తూ జీర్ణం జరగడానికి అలవాటు పడిపోయాం. కానీ ఈ మారిన నవీన యుగంలో ఆహారాన్ని బయట స్టోరేజ్ చేసే పరిస్థితి వచ్చింది. కాబట్టి మనకు ఎప్పుడు పడితే అప్పుడు ఆహారం దొరుకుతుంది. అందుకని ఎక్కువసార్లు మనం తినాల్సిన అవసరం లేదంటున్నారు. మనం ఎంత తినాలి అని అనుకుంటే.. అంతా మనకు కావలసిన, మనకు నచ్చిన పదార్థం ఒక పూట తిన్నా గాని 24 గంటలకు సరిపోతుందని అంటున్నారు.

# నోరూరించే పిజ్జా..! ఒక్క ముక్క మీ జీవితాన్ని ఏం చేస్తుందో తెలుసా..?



ప్రస్తుతం అత్యంత ప్రజాదరణ పొందిన జంక్ ఫుడ్స్‌లో పిజ్జా ఒకటి. పిజ్జాని చాలా మంది తరచూ తింటూ ఉంటారు. కానీ అది జంక్ ఫుడ్. టేస్ట్‌కి చాలా మంచిది. కానీ ఆరోగ్యం కోసం కాదు. పిజ్జాతో అనేక అనారోగ్య సమస్యలు వస్తాయంటున్నారు ఆరోగ్య నిపుణులు. పిజ్జా అతిగా తినడం వల్ల కలిగే అనారోగ్య సమస్యలను నిర్లక్ష్యం చేస్తే మొదటికే మోసం వస్తుందని హెచ్చరిస్తున్నారు. పిజ్జాలో సోడియం స్థాయిలు ఎక్కువగా ఉంటాయి. మీరు ప్రతిరోజూ అలాంటి పిజ్జా తింటే, అది అధిక రక్తపోటుకు దారితీస్తుంది. మీరు ఒకేసారి మొత్తం పిజ్జా తింటే, మీరు మీ రోజువారీ సోడియం తీసుకోవడం అధికంగా చేస్తున్నారని అర్థం. దీనివల్ల రక్తపోటు పెరుగుతుంది. ఇది గుండె సమస్యలను కలిగిస్తుంది. పిజ్జా తినడం వల్ల వచ్చే మరో ప్రమాదకరమైన వ్యాధి గుండెపోటు. మాంసాలతో తయారు చేసిన పిజ్జా తింటే, అది ఊబకాయం, కొన్ని క్యాన్సర్, గుండె సమస్యలను కలిగిస్తుంది. ఈ ప్రాసెస్ చేసిన మాంసాలను ఎక్కువగా తినడం గుండె ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావం చూపుతుంది. తరచుగా పిజ్జా తినడం వల్ల వచ్చే సమస్యలలో మధుమేహం ఒకటి. పిజ్జా తినడం వల్ల బ్లడ్ షుగర్ లెవల్స్ పెరిగి క్రమంగా డయాబెటిస్‌గా మారుతుంది. పిజ్జా వంటి అధిక కొవ్వు ప్రాసెస్ చేసిన ఆహారాలు తినడం వల్ల కడుపు, పెద్దప్రేగు క్యాన్సర్ వచ్చే ప్రమాదం పెరుగుతుంది. దానికి తోడు బరువు విపరీతంగా పెరిగిపోతుంది. దీంతో ఇతర సమస్యలు కూడా పెరుగుతున్నాయి. పిజ్జాతో ముందుగా వచ్చే అతి పెద్ద సమస్య మలబద్ధకం..! పిజ్జా కోసం వాడే మైదా సరిగా జీర్ణం కాదు. ఒక స్లైస్? చీజ్? పిజ్జాలో 400 కెలరీలు ఉంటాయి. ఒక్క స్లైస్‌తో ఆపలేము కదా! ఫలితంగా.. వేగంగా బరువు పెరిగిపోతారు. రిఫైన్డ్ ఫ్లోర్‌తో తయారు చేయడంతో పిజ్జా చాలా హెవీగా ఉంటుంది. ఏ పని చేయలేకపోతాము. అయితే.. పిజ్జాని అప్పుడప్పుడు తినడంలో తప్పు లేదు.కానీ దానిని ఎక్కువగా తినడమే సమస్య! అప్పుడప్పుడు క్వాంటిటీ తగ్గించి తినండి.

# బేబీ కార్న్ తింటే ఇన్ని లాభాలా..?

## తప్పకుండా తెలుసుకోవాల్సిన విషయాలు ఇవే..

బేబీ కార్న్ రుచికరమైన, పోషకమైన ఆహారం. ఇది పూర్తిగా ఆకులతో చుట్టబడినందున పురుగుమందుల ప్రభావాల ఉండదు. బేబీ కార్న్‌లో భాస్వరం పుష్కలంగా లభిస్తుంది. అంతే కాకుండా కార్బోహైడ్రేట్లు, ప్రోటీన్లు, కాల్షియం, ఐరన్, విటమిన్లు కూడా ఇందులో లభిస్తాయి. కొలెస్ట్రాల్ లేకుండా, ఫైబర్ పుష్కలంగా ఉండటం వలన ఇది తక్కువ కేలరీల ఆహారం. ఇది గుండె రోగులకు చాలా ఉపయోగకరంగా ఉంటుంది. బేబీ కార్న్‌లో లుటీన్, జియాక్సంతిన్ వంటి అవసరమైన కెరోటినాయిడ్లు ఉంటాయి. ఇవి కంటి ఆరోగ్యాన్ని సరైన రీతిలో నిర్వహించడానికి ప్రయోజనకరంగా ఉంటాయి. బేబీ కార్న్‌లోని పొటాషియం మరియు ఫైబర్ కలయిక రక్తపోటును నియంత్రించడంలో, హృదయ ఆరోగ్యాన్ని పెంపొందించడంలో సహాయపడుతుంది. బేబీ కార్న్ అనేది యాంటీఆక్సిడెంట్ పవర్‌హౌస్. ఇది రోగనిరోధక వ్యవస్థకు అవసరమైన బూస్ట్‌ని ఇవ్వడం ద్వారా అనారోగ్యం నుండి శరీరం రక్షణకు మద్దతు ఇస్తుంది. బేబీ కార్న్ మంచి ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి అవసరమైన విటమిన్లు, ఖనిజాల యొక్క గొప్ప మూలం. బేబీ కార్న్ డయాబెటిస్ ఉన్న వ్యక్తులకు రక్తంలో చక్కెర స్థాయిలను స్థిరంగా ఉంచడానికి సహాయపడుతుంది. జీర్ణక్రియ సమస్యలతో బాధపడేవారికి బేబీ కార్న్ దివ్యౌషధం. బేబీ కార్న్‌లోని అధిక ఫైబర్ కంటెంట్ జీర్ణక్రియలో సహాయపడుతుంది. సాధారణ ప్రేగు కదలికలను ప్రోత్సహిస్తుంది. మీరు స్థూలకాయం సమస్యతో సతమతమవుతున్నట్లయితే బేబీ కార్న్ తప్పనిసరిగా తినాలి. బేబీ కార్న్ చర్మానికి చాలా ఉపయోగకరంగా పరిగణించబడుతుంది. నిజానికి, విటమిన్ సి బేబీ కార్న్‌లో పుష్కలంగా లభిస్తుంది. ఇది కాకుండా, బేబీ కార్న్‌లో ఉండే పోషకాలు చర్మ కణాలను పునరుజ్జీవింపజేస్తాయి. మీ చర్మం మృదువుగా కనిపిస్తుంది. కొలెస్ట్రాల్ తగ్గాలంటే బేబీ కార్న్ తినాలి. నిజానికి, బేబీ కార్న్‌లో ఉండే ఫైబర్ కొలెస్ట్రాల్‌ను నియంత్రించడంలో సహాయపడుతుంది.



# గుట్టగా మారిన పొట్టకు ఛూమంత్రం.. సరిగ్గా ఆ సమయంలో తాగారంటే వెన్నలా కరగాల్సిందే..




యాపిల్ సైడర్ వెనిగర్‌లో అనేక ఔషధ గుణాలు ఉన్నాయి. ఇది ఆరోగ్యానికి చాలా మేలు చేస్తుంది. మీరు దీన్ని నీటిలో కలిపి ప్రతిరోజూ తాగితే, బరువు తగ్గడంతోపాటు అనేక తీవ్రమైన వ్యాధులను నివారించడంలో సహాయపడుతుంది. అంతేకాకుండా.. ఆరోగ్యానికి కూడా చాలా మేలు చేస్తుందని వైద్య నిపుణులు పేర్కొంటున్నారు. కొంచెం గోరు వెచ్చని నీటిలో ఆపిల్ సైడర్ వెనిగర్ కలిపి తాగడం వల్ల కలిగే ఐదు ప్రయోజనాలు, ఎప్పుడు తాగితే మంచిది అనే విషయాలను ఇప్పుడు తెలుసుకోండి.. రోగనిరోధక శక్తిని పెంచుతుంది: యాపిల్ వెనిగర్ తీసుకోవడం వల్ల రోగనిరోధక శక్తి పెరుగుతుంది. ఇది యాంటీమైక్రోబయల్ లక్షణాలను కలిగి ఉంది. ఇది ప్రమాదకరమైన బ్యాక్టీరియా నుంచి శరీరాన్ని దూరంగా ఉంచుతుంది. రక్తంలో చక్కెర నియంత్రణలో ఉంటుంది: రీసెర్చ్‌గేట్‌లో ప్రచురించిన ఒక అధ్యయనం ప్రకారం.. యాపిల్ సైడర్ వెనిగర్ రక్తంలో చక్కెరను నియంత్రించడంలో సహాయపడుతుంది. ఇందులో ఉండే యాంటీ గ్లైసెమిక్ ఎఫెక్ట్, యాంటీ డయాబెటిక్ లక్షణాలు దీనికి కారణం.. జీర్ణక్రియ సమస్యల నుంచి ఉపశమనం: యాపిల్ సైడర్ వెనిగర్ తీసుకోవడం వల్ల జీర్ణక్రియ సులభం అవుతుంది. ఇది అజీర్ణం, గ్యాస్ వంటి కడుపు సమస్యల నుంచి కూడా ఉపశమనం అందిస్తుంది. కొలెస్ట్రాల్ తగ్గిస్తుంది: ఆపిల్ సైడర్ వెనిగర్ చెడు కొలెస్ట్రాల్‌ను తగ్గించడం ద్వారా మంచి కొలెస్ట్రాల్‌ను పెంచడంలో సహాయపడుతుంది. బరువు తగ్గడంలో కూడా మేలు చేస్తుంది: యాపిల్ వెనిగర్ ఊబకాయాన్ని తగ్గించడంలో ప్రయోజనకరంగా పరిగణిస్తారు. హార్వర్డ్ హెల్త్ ప్రకారం, 2009లో 175 మందిపై జరిపిన ఒక అధ్యయనం ప్రకారం, 3 వారాల పాటు 1-2 టీస్పూన్ల వెనిగర్‌ను తీసుకునే వ్యక్తులు 2-4 పౌండ్ల బరువును తగ్గారని కనుగొన్నారు. ఈ సమయంలో తీసుకోవడం వల్ల వేలు జరుగుతుంది.. 1-2 టీస్పూన్ల యాపిల్ వెనిగర్‌ను నీటిలో కలిపి ఉదయం ఖాళీ కడుపుతో తాగడం చాలా ప్రయోజనకరమని వైద్య నిపుణులు పేర్కొంటున్నారు.

# మధుమేహ వ్యాధిగ్రస్తులు కుంకుమ పువ్వు తీసుకుంటే.. కేవలం 8 వారాలలో ఈ మార్పు చూడోచ్చు!



ప్రపంచంలోనే అత్యంత ఖరీదైన మసాలా దినుసు ఏదంటే టక్కున గుర్తొచ్చేది కుంకుమపువ్వు. ఈ పువ్వు ఉత్పత్తికి సాగు చేసే విధానం కారణంగా, కుంకుమపువ్వు ధర అత్యధికంగా ఉంటుంది. నిజానికి.. ఇతర మసాలా దినుసుల కంటే కుంకుమపువ్వు వలన కలిగే ఆరోగ్య ప్రయోజనాలు చాలా ఎక్కువ. అవేంటో తెలుసుకుందాం.. కొన్నిసార్లు కోపం రావడం, కొన్నిసార్లు ఏడవడం.. ఇలాంటి మానసిక కల్లోలం తరచుగా రావడం అస్సలు మంచిది కాదు. ఈ పరిస్థితిలో కుంకుమపువ్వు సహాయం తీసుకోవచ్చు. కుంకుమపువ్వు మనస్సును ఆరోగ్యంగా ఉంచుతుందని, డిప్రెషన్ లక్షణాలను తగ్గిస్తుందని అధ్యయనాలు చెబుతున్నాయి. ఆందోళనను తగ్గించడంలోనూ కుంకుమ పువ్వు సహాయపడుతుంది. కుంకుమపువ్వులో యాంటీఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి. ఇవి హానికరమైన ఫ్రీ రాడికల్స్‌తో పోరాడుతాయి. ఆక్సీకరణ ఒత్తిడిని తగ్గిస్తాయి. కుంకుమపువ్వు తినడం వల్ల గుండె జబ్బులు, క్యాన్సర్ వంటి అనేక వ్యాధుల ప్రమాదాన్ని తగ్గిస్తుంది. దీర్ఘకాలిక వ్యాధుల ప్రమాదాన్ని తగ్గించడానికి ఆహారంలో కుంకుమపువ్వును తప్పక తీసుకోవాలి. ముఖ్యంగా కుంకుమపువ్వు మహిళల ఆరోగ్యానికి మేలు చేస్తుంది. ప్రీ-మెన్‌స్ట్రువల్ సిండ్రోమ్ సమస్యకు కుంకుమపువ్వు మేలు చేస్తుంది. అంటే రుతుక్రమం రాకముందే కలిగే మానసిక, శారీరక అనారోగ్యాన్ని కుంకుమపువ్వు దూరం చేస్తుంది. కాలు నొప్పి, మూడ్ స్వింగ్స్ వంటి లక్షణాలను నియంత్రిస్తుంది. రోజూ కుంకుమపువ్వు కలిపిన టీ లేదా పాలు తాగడం వల్ల బరువు కూడా తగ్గవచ్చు. కుంకుమపువ్వు ఆకలిని అణిచివేసి, బరువు తగ్గడానికి సహాయపడుతుంది. అంతేకాకుండా ఈ మసాలాలో ఉండే యాంటీఆక్సిడెంట్లు ఊబకాయాన్ని నివారిస్తాయి. జీవక్రియ రుగ్మతలను తొలగిస్తాయి. కుంకుమపువ్వు గుండె ఆరోగ్యానికి కూడా మేలు చేస్తుంది. కుంకుమపువ్వులోని యాంటీఆక్సిడెంట్ కంటెంట్ కొలెస్ట్రాల్, ట్రైగ్లిజరైడ్ స్థాయిలను తగ్గించడంలో సహాయపడుతుంది. గుండెను ఆరోగ్యంగా ఉంచుతుంది. గుండె సమస్యలను నివారించడానికి ఆహారంలో కుంకుమపువ్వు తీసుకోవచ్చు. రోజువారీ ఆహారంలో కొద్దిగా కుంకుమపువ్వు తీసుకుంటే మధుమేహ వ్యాధిగ్రస్తులకు కూడా మంచిది. కుంకుమపువ్వు కేవలం 8 వారాలలో రక్తంలో గ్లూకోజ్ స్థాయిలను తగ్గిస్తుంది. కుంకుమపువ్వు టైప్-2 డయాబెటిస్ ప్రమాదాన్ని కూడా తగ్గిస్తుంది.

# సహజంగా శరీరంలో కొలెస్ట్రాల్ కరిగించే ఆహారాలు ఇవే.. తప్పక తీసుకోండి




నేటి కాలంలో అనేక మంది చిన్న వయసులోనే కొలెస్ట్రాల్ సమస్యతో బాధపడుతున్నారు. కొలెస్ట్రాల్ ప్రాథమికంగా ఒక రకమైన లిపిడ్. శరీరానికి అవసరమైన విధులు నిర్వర్తించడానికి ఇది చాలా అవసరం. ఈ కొలెస్ట్రాల్ ఈస్ట్రోజెన్, టెస్టోస్టెరాన్ వంటి హార్మోన్లను తయారు చేయడానికి సహాయపడుతుంది. ఈ కారణాల వల్ల శరీరంలో కొలెస్ట్రాల్ ఉండటం చాలా ముఖ్యం. అయితే దీని పరిమాణం పెరిగితే మాత్రం ప్రమాదమే. మన శరీరంలో చెడు కొలెస్ట్రాల్, మంచి కొలెస్ట్రాల్ అనే రెండు రకాల కొలెస్ట్రాల్ ఉంటాయి. చెడు కొలెస్ట్రాల్ లేదా మొత్తం పెరిగినప్పుడు అనేక సమస్యలు వస్తాయి. ఈ కొలెస్ట్రాల్‌ను తగ్గించడానికి కొన్ని ఆహారాలు తీసుకోవాలి. అవేంటో ఇక్కడ తెలుసుకుందాం.. ఈ రోజుల్లో చాలా మంది ఓట్ మీల్ తింటున్నారు. ఇందులో కొలెస్ట్రాల్‌ను కరిగించి నియంత్రించడంలో సహాయపడే కరిగే ఫైబర్ ఉంటుంది. ఇందులో మోనోశాచురేటెడ్ కొవ్వు కూడా ఉంటుంది. అలాగే కొన్ని రకాల పండ్లు కూడా కొలెస్ట్రాల్ స్థాయిలను తగ్గించడంలో సహాయపడతాయి. వీటిల్లో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు గుండెను ఆరోగ్యంగా ఉంచడంతోపాటు కొలెస్ట్రాల్‌ను తగ్గిస్తాయి. యాపిల్స్‌లో ఫైబర్ పుష్కలంగా ఉంటుంది. ఇదిచెడు కొలెస్ట్రాల్ స్థాయిలను నియంత్రించడంలో సహాయపడుతుంది. కాబట్టి రోజూ యాపిల్స్ తప్పక తినాలి. రెడ్ మీట్, ఫాస్ట్ ఫుడ్, జంక్ ఫుడ్ వంటి ఆహారాలను పూర్తిగా మానుకోవాలి. అవి కొలెస్ట్రాల్‌ను పెంచుతాయి. అలాగే, ప్రాసెస్ చేసిన ఆహారాలు, కేకులు, కుకీలు, పేస్ట్రీలు, జున్ను, నెయ్యి, వెన్న, చీజ్, జామ్ వంటి వాటికి కూడా దూరంగా ఉండాలి. మీగడ పాలు, దానితో చేసిన ఆహారం, నెయ్యి-వెన్న వీలైనంత తక్కువగా తీసుకోవాలి.అలాగే తగినంత నీళ్లు త్రాగాలి.దానితో పాటు క్రమం తప్పకుండా వ్యాయామం చేయడం తప్పనిసరి. సరైన ఆహారాల అలవాట్లు సగం జబ్బులను నయం చేస్తుంది.

# స్పోర్ట్స్

# ఇంపాక్ట్ ప్లేయర్‌గా రోహిత్..



ఐపీఎల్‌లో అత్యధిక టైటిళ్లు గెలిచిన జట్లలో ముంబై ఇండియన్స్ ఒకటి. ఐదు సార్లు(2013, 2015, 2017, 2019, 2020) విజేతగా నిలిచింది. 8 ఏళ్ల వ్యవధిలో 5 టైటిళ్లు అందుకున్న ముంబై.. గత ఐదు సీజన్లలో మాత్రం ఒక్కసారి కూడా ఫైనల్ చేరలేకపోయింది. గత సీజన్‌లో ప్లే ఆఫ్స్ చేరినా.. ఫైనల్‌కు అర్హత సాధించలేకపోయింది. ఈ సారి ఎలాగైనా టైటిల్ గెలవాలనే యోచనలో ఉంది.జట్టు నిండా స్టార్ ఆటగాళ్లున్నా.. మునపటిలా ముంబై సత్తా చాటలేకపోతుంది. కానీ ఇటీవల టీమిండియా టీ20 ప్రపంచకప్ నిలబెట్టుకోవడంలో కీలక పాత్ర పోషించిన బుమ్రా, సూర్యకుమార్, హార్దిక్, తిలక్ ఫుల్‌ఫామ్‌లో ఉండటం జట్టుకు కలిసొచ్చే అంశం. అయితే అంతర్జాతీయ స్థాయిలో సక్సెస్‌ఫుల్ కెప్టెన్లుగా గుర్తింపు పొందిన రోహిత్ శర్మ, సూర్యకుమార్ యాదవ్, మిచెల్ సాంట్నర్‌లు ఉన్న జట్టును హార్దిక్ పాండ్యా ఎలా నడిపిస్తాడనేది కీలకం. ముంబైకి ఐదు టైటిళ్లు అందించిన రోహిత్ శర్మ ఈసారి కూడా ఇంపాక్ట్ ప్లేయర్‌గానే బరిలోకి దిగే అవకాశాలు ఉన్నాయి. అంతర్జాతీయ టీ20లతో పాటు టెస్ట్ క్రికెట్‌కు వీడ్కోలు పలికిన రోహిత్.. కేవలం వన్డేల్లో మాత్రమే ఆడుతున్నాడు. ఐపీఎల్ 2026 సీజన్ కోసం ప్రాక్టీస్ కూడా మొదలుపెట్టాడు. రోహిత్ శర్మతో కలిసి క్వింటన్ డికాక్ ఓపెనింగ్ చేయనుండగా.. సూర్యకుమార్ యాదవ్, తిలక్ వర్మ, విల్ జాక్స్ మిడిలార్డర్‌లో ఆడనున్నారు. హార్దిక్ పాండ్యా, నమన్ ధీర్‌లు ఫినిషర్ పాత్ర పోషించనున్నారు. ఎలాంటి పరిస్థితుల్లోనైనా మ్యాచ్‌ను ప్రత్యర్థి నుంచి లాగేసుకోవడంలో వీరికి అపార అనుభవం ఉంది. బ్యాటింగ్ ఆర్డర్‌లో ఒక్క డికాక్ మినహా మిగిలిన వాళ్లంతా భారత ఆటగాళ్లే కావడంతో.. విదేశీ ఆటగాళ్ల సేవలను వినియోగించుకునే విషయంలో ఫ్రాంచైజీ మంచి వెసులు బాటు ఉంది. విదేశీ కోటాలో డికాక్, రికెల్టన్, రూథర్‌ఫర్డ్, సాంట్నర్, విల్ జాక్స్, బాష్, ట్రెంట్ బౌల్డ్, ఘజన్‌ఫర్ అందుబాటులో ఉండగా.. డికాక్, జాక్స్, సాంట్నర్, బౌల్ట్ తుది జట్టులో ఉండటం ఖాయం. పరిస్థితులను బట్టి రూథర్‌ఫర్డ్, ఘజన్‌ఫర్‌ను ఆడించవచ్చు. బౌలింగ్ భారాన్ని బుమ్రా మోయనున్నాడు. దీపక్ చాహర్, ట్రెంట్ బౌల్ట్ నుంచి సహకారం అందితే ముంబై ఇండియన్స్‌కు తిరుగుండదు. విల్ జాక్స్, మిచెల్ సాంట్నర్‌తో పాటు మయాంక్ మార్కండే స్పిన్ బాధ్యతలు మోయనున్నారు.

ముంబై ఇండియన్స్ తుది జట్టు(అంచనా) రోహిత్ శర్మ, క్వింటన్ డికాక్(కీపర్), సూర్యకుమార్ యాదవ్, తిలక్ వర్మ, విల్ జాక్స్, హార్దిక్ పాండ్యా, నమన్ ధీర్/షెర్ఫేన్ రూథర్‌ఫోర్డ్, మిచెల్ సాంట్నర్, దీపక్ చాహర్/శార్దూల్ ఠాకూర్, జస్‌ప్రీత్ బుమ్రా, ట్రెంట్ బౌల్ట్, మయాంక్ మార్కండే(ఇంపాక్ట్)

## ఐపీఎల్‌లో కోహ్లీ-గేల్ బెస్ట్ ఓపెనింగ్ పార్టనర్‌షిప్


ఇండియన్ ప్రీమియర్ లీగ్ 2026 త్వరలో ప్రారంభం కానుంది. టాటా ఐపీఎల్ 2026  2026 మార్చి 28 నుంచి ప్రారంభం కానుంది. దీంతో ఇప్పటి నుంచే టోర్నమెంట్‌పై ఆసక్తి నెలకొంది. ముఖ్యంగా లీగ్‌లో బెస్ట్ ఓపెనింగ్ జోడీల గురించి ప్రస్తావన వస్తే.. ఎవరెవరి పేర్లు చెప్పాలో తెలిపాడు. రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు మాజీ కెప్టెన్ ఫాఫ్ డు ప్లెసిస్. ఐపీఎల్ చరిత్రలోనే 8 బెస్ట్ ఓపెనింగ్ పార్టనర్‌షిప్ జోడీలకు ర్యాంకులు ఇచ్చాడు. ఐపీఎల్ 2026 సీజన్‌కు ముందు జరిగిన ఒక కార్యక్రమంలో ఫాఫ్ డు ప్లెసిస్ ఈ ర్యాంకింగ్స్ ప్రకటించాడు. ఇందులో గౌతమ్ గంభీర్ - రాబిన్ ఉతప్ప జోడీకి ఫస్ట్ ర్యాంక్ ఇవ్వడం విశేషం. వీరిద్దరూ కోల్‌కతా నైట్ రైడర్స్  తరఫున ఆడుతూ 39 ఇన్నింగ్స్‌ల్లో 1,478 పరుగులు చేశారు. ఇక రెండో స్థానంలో ముంబై ఇండియన్స్‌కు చెందిన రోహిత్ శర్మ - ఇషాన్ కిషన్ జోడీని ఎంపిక చేశాడు. వీరిద్దరూ కలిసి 43 ఇన్నింగ్స్‌ల్లో 1,547 పరుగులు సాధించారు. విరాట్ కోహ్లీ , క్రిస్ గేల్ జోడీకి డు ప్లెసిస్ మూడో ర్యాంక్ ఇచ్చాడు. వీరిద్దరూ కేవలం 28 ఇన్నింగ్స్‌ల్లోనే 1,210 పరుగులు చేశారు. వీరి యావరేజ్ 46.53గా ఉండటం విశేషం. అంతకంటే ముఖ్యమైన విషయం ఏమిటంటే.. వీరిద్దరూ కలిసి ఐపీఎల్‌లో నాలుగు సెంచరీ పార్టనర్‌షిప్‌లు నెలకొల్పారు. ఒకానొక దశలో వీరిని చూసి బౌలర్లు వణికిపోయేవారు. ఆర్సీబీకి డు ప్లెసిస్ కెప్టెన్‌గా చేసినా సరే.. కోహ్లీ- గేల్ జోడీకి అతడు మూడో ర్యాంక్ ఇవ్వడం విశేషం. బెస్ట్ ఐపీఎల్ ఓపెనర్స్ లిస్టులో మురళీ విజయ్ - మైకేల్ హస్సీ (జూఖ) కి డు ప్లెసిస్ 4వ ర్యాంక్ ఇచ్చాడు. 2011లో చెన్నై టైటిల్ గెలవడంలో వీరి పాత్ర చాలా ఉంది. వీరిద్దరూ కలిసి 1,360 పరుగులు చేశారు. తనతో కలిసి కోహ్లీ ఆడిన ఓపెనింగ్ జోడీకి డు ప్లెసిస్ 5వ స్థానం ఇచ్చారు. వీరిద్దరూ 2023లో ఒక్క సీజన్‌లోనే 939 పరుగులు చేసి రికార్డు సృష్టించారు. మొత్తం మీద 1,890 పరుగులు సాధించి ఆల్-టైమ్ రెండో స్థానంలో ఉన్నారు. ఐపీఎల్ చరిత్రలో 2,000 కంటే ఎక్కువ పరుగులు చేసిన ఏకైక ఓపెనింగ్ పార్టనర్‌షిప్ డేవిడ్ వార్నర్ - శిఖర్ ధావన్ మాత్రమే. అయినప్పటికీ డు ప్లెసిస్ వీరికి 8వ స్థానం ఇవ్వడం అందరినీ ఆశ్చర్యపరిచింది. అలాగే ఫాఫ్ , రుతురాజ్ గైక్వాడ్ జోడీ కేవలం 19 ఇన్నింగ్స్‌ల్లోనే 884 పరుగులు చేసి 46.52 యావరేజ్ సాధించారు. మొత్తానికి డు ప్లెసిస్ నిలకడ కంటే మ్యాచ్‌ను గెలిపించే ప్రభావం చూపే జోడీలకే ఎక్కువ ప్రాధాన్యత ఇచ్చినట్లు కనిపిస్తోంది. గౌతమ్ గంభీర్ - రాబిన్ ఉతప్ప మధ్య ఉన్న అవగాహన వల్లే కేకేఆర్ రెండుసార్లు ఛాంపియన్‌గా నిలిచిందని ఈ సౌతాఫ్రికా బ్యాటర్ విశ్లేషించాడు.

## యశ్ దయాల్‌పై ఆర్‌సీబీ వేటు..?

ఐపీఎల్ 2026 సీజన్ ప్రారంభానికి ముందు డిఫెండింగ్ ఛాంపియన్ రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు(ఆర్‌సీబీ) సంచలన నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. మైనర్ బాలికపై అత్యాచార ఆరోపణలు ఎదుర్కొంటున్న తమ లెఫ్టార్మ్ పేసర్ యశ్ దయాల్‌పై వేటు వేసినట్లు ప్రచారం జరుగుతోంది. అయితే ఈ వ్యవహారంపై రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు(ఆర్‌సీబీ) ఇప్పటి వరకు ఎలాంటి అధికారిక ప్రకటన చేయలేదు. కానీ అతన్ని జట్టుకు దూరంగా ఉంచారనే విషయం మాత్రం స్పష్టమవుతోంది. అప్‌కమింగ్ ఐపీఎల్ 2026 సీజన్‌కు ఇంకా వారం రోజుల సమయం మాత్రమే ఉండగా.. యశ్ దయాల్ ఇంకా ఆర్‌సీబీ ప్రాక్టీస్ క్యాంప్‌లో పాల్గొనలేదు. టీమ్ బస్సుపై కూడా యశ దయాల్ మినహా జట్టులోని ఆటగాళ్లందరి ఫొటోలు ఉండటం ఈ వార్తలకు బలం చేకూరుస్తోంది. పెళ్లి చేసుకుంటానని నమ్మించి తనపై ఐదేళ్లుగా అత్యాచారం చేస్తున్నాడని ఓ యువతి యశ్ దయాల్‌పై పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ కేసు విషయం వెలుగులోకి వచ్చిన కొద్ది రోజులకే మరో అమ్మాయి కూడా తనను అత్యాచారం చేశాడని పోలీసులను ఆశ్రయించింది. ఆమె వయసు 17 ఏళ్లే కావడంతో పోలీసులు పోక్సో యాక్ట్ కింద కేసు నమోదు చేశారు. ఈ రెండు కేసుల నేపథ్యంలోనే యశ్ దయాల్‌పై ఆర్‌సీబీ వేటు వేసినట్లు అర్థమవుతుంది. అతని స్థానంలో ఉమేశ్ యాదవ్‌ను తీసుకోవాలని టీమ్‌మేనేజ్‌మెంట్ ఆలోచిస్తున్నట్లు జాతీయ మీడియా పేర్కొంది. అయితే అతనికి కొన్ని ఫిట్‌నెస్ సమస్యలు ఉన్నాయని, దాంతోనే యశ్ దయాల్‌కు ప్రత్యామ్నాయ ప్లేయర్ ఎవరా? అనేది ఆర్‌సీబీ తేల్చుకోలేకపోతుందంట. అత్యాచారం కేసులో అరెస్టు అయి బెయిల్‌పై బయటకు వచ్చిన యశ్ దయాల్.. గత నెల సీక్రెట్‌గా పెళ్లి చేసుకున్నాడు. ఫిబ్రవరి 4న నోయిడాలో పెళ్లి చేసుకున్నట్టు వార్తలు వచ్చాయి. వధూవరుల కుటుంబ సభ్యులతో పాటు అతి కొద్ది మంది బంధుమిత్రులు మాత్రమే ఈ పెళ్లికి హాజరయ్యారు. యశ్ దయాల్ పెళ్లికి క్రికెటర్లు ఎవ్వరూ హాజరుకాలేదు. యశ్ దయాల్.. తన పెళ్లి గురించి ఎలాంటి ప్రకటన చేయలేదు. కానీ అతని భార్య శ్వేతా పుందిర్ ఇన్‌స్టా రీల్ ద్వారా తమ పెళ్లి విసయాన్ని బయటపెట్టింది. సోషల్ మీడియా కంటెంట్ క్రియేటర్ అయిన శ్వేతా పుందిర్‌కి ఇన్‌స్టాగ్రామ్‌లో సుమారు 6 లక్షల మంది ఫాలోవర్లు ఉన్నారు. అలాగే ఇంటర్నేషనల్ లెజెండ్స్ లీగ్‌లో బ్రాడ్ కాస్టర్‌గా కూడా ఆమె వ్యవహరించింది. ఐపీఎల్ 2025 సీజన్‌లో ఆర్‌సీబీ విజేతగా నిలవడంలో యశ్ దయాల్ 13 వికెట్లతో కీలక పాత్ర పోషించాడు. ఐపీఎల్ 2023 సీజన్‌లో గుజరాత్ టైటాన్స్ తరఫున బరిలోకి దిగిన యశ్ దయాల్.. రింకూ సింగ్ ధాటికి వరుసగా ఒకే ఓవర్‌లో 5 సిక్సర్లు సమర్పించుకున్నాడు. ఈ మ్యాచ్ తర్వాత తీవ్ర డిప్రెషన్‌కు గురైన యశ్ దయాల్ కొన్నాళ్లు ఆటకు దూరంగా ఉన్నాడు.ఐపీఎల్ 2024 సీజన్‌లో యశ్ దయాల్‌ను ఆర్‌సీబీ రూ.3.2 కోట్ల భారీ ధరకు కొనుగోలు చేయగా.. అతను 15 వికెట్లు తీసి ఆకట్టుకున్నాడు. దాంతో ఐపీఎల్ 2025 మెగా వేలానికి ముందు రూ.5 కోట్లకు యశ్ దయాల్‌ను రిటైన్ చేసుకుంది. ఆట పరంగా యశ్ దయాల్ తిరుగులేదు. కానీ అనవసర కేసులతో తన కెరీర్‌ను నాశనం చేసుకున్నాడని ఫ్యాన్స్ కామెంట్ చేస్తున్నారు.




## సీఎస్‌కేకు భారీ ఎదురుదెబ్బ



### ఆస్ట్రేలియా పేసర్ ఎల్లిస్ జట్టుకు దూరం

ఈ మార్చి 28న ఐపీఎల్ 2026 ప్రారంభంకానుంది. అయితే ఐపీఎల్ 19వ సీజన్‌కు ముందు సీఎస్‌కేకు భారీ ఎదురుదెబ్బ తగిలింది. స్టార్ బౌలర్ మొత్తం సీజన్‌కు దూరమయ్యాడు. ఐపీఎల్ 2026లో, రుతురాజ్ గైక్వాడ్ సారథ్యంలోని చెన్నై సూపర్ కింగ్స్ తమ ఆరో టైటిల్‌ను గెలవాలని లక్ష్యంగా పెట్టుకుంది. అయితే, ఈ లక్ష్యం సీఎస్ కేకు మరింత కష్టతరం కావచ్చు. చెన్నై ఫాస్ట్ బౌలర్ నాథన్ ఎల్లిస్ గాయం కారణంగా ఈ సీజన్ మొత్తానికి దూరమయ్యాడు.  ఎల్లిస్ లేకపోవడం చెన్నై సూపర్ కింగ్స్‌కు పెద్ద దెబ్బ. చెన్నై తరపున చివరి ఓవర్లలో ఎల్లిస్ బాగా బౌలింగ్ చేస్తాడు. డెత్ ఓవర్లలో బౌలింగ్ చేసిన అనుభవం కూడా ఉంది. గతంలో పంజాబ్ కింగ్స్ తరఫున ఆడాడు. ఐపీఎల్ 2025 వేలంలో సీఎస్‌కే అతన్ని కొనుగోలు చేసింది.    ఈ ఆస్ట్రేలియన్ బౌలర్ ఈ సీజన్‌లో మిగిలిన మ్యాచ్‌లలో ఆడటం లేదు. అతని స్థానంలో సీఎస్‌కే ఇంకా ఎవరినీ ప్రకటించలేదు. ఇక ఐపీఎల్ 2026కు ముందు సీఎస్‌కే మతిషా పతిరానాను విడుదల చేసింది. ఆ తర్వాత వేలంలో ఎల్లిస్‌ను తమ జట్టులోకి తీసుకున్నారు.  సీఎస్‌కే ఫాస్ట్ బౌలింగ్‌కు నాయకత్వం వహించాల్సి ఉన్న ఎల్లిస్, గాయం కారణంగా టోర్నమెంట్ మొత్తానికి దూరమయ్యాడు. 2025లో సీఎస్కే అతడిని రూ.2 కోట్లకు కొనుగోలు చేసింది. అతను గతంలో 2021 నుండి 2025 వరకు పంజాబ్ తరపున ఆడాడు. తన ఐపీఎల్ కెరీర్‌లో 17 మ్యాచ్‌లు ఆడి, 19 వికెట్లు పడగొట్టాడు.  ఎల్లిస్ కండరాల గాయంతో బాధపడుతున్నట్లు సమాచారం. కాగా చెన్నై ఫాస్ట్ బౌలింగ్ దళాన్ని పరిశీలిస్తే, వారి విదేశీ బౌలర్లలో మాట్ హెన్రీ, జాక్ ఫౌల్క్ ఉన్నారు. ఇంగ్లాండ్ ఆల్-రౌండర్ జేమీ ఓవర్టన్ కూడా చెన్నై జట్టులో భాగమే. భారత పేసర్లలో ఖలీల్ అహ్మద్, అన్షుల్ కంబోజ్, ముఖేష్ చౌదరి, గుర్జప్నీత్ సింగ్ ఉన్నారు. వారి ఫాస్ట్ బౌలింగ్ దళం బలంగా కనిపిస్తున్నప్పటికీ, ఎల్లిస్ నిష్క్రమణ ఒక పెద్ద దెబ్బ.

## ఉప్పల్‌లో అభిషేక్ శర్మ ఊచకోత!

### సీజన్ ప్రారంభానికి ముందే సిక్సర్ల వర్షం

ఐపీఎల్ 2026 సీజన్ ప్రారంభానికి ముందే సన్‌రైజర్స్ హైదరాబాద్ వైస్ కెప్టెన్, విధ్వంసకర ఓపెనర్ అభిషేక్ శర్మ ఆకాశమే హద్దుగా చెలరేగాడు. హైదరాబాద్‌లోని ఉప్పల్ స్టేడియం వేదికగా శనివారం జరిగిన ఇంట్రా స్క్వాడ్ ప్రాక్టీస్ మ్యాచ్‌లో అభిషేక్ శర్మ 42 బంతుల్లో 94 పరుగులు చేశాడు. సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టుతో కలిసిన అభిషేక్ శర్మ.. శనివారం సాయంత్రం నిర్వహించిన ప్రాక్టీస్ మ్యాచ్‌లో సన్‌రైజర్స్-ఏ తరఫున బరిలోకి దిగాడు. తొలి బంతి నుంచే దూకుడుగా ఆడిన అభిషేక్ శర్మ 42 బంతుల్లో 94 పరుగులతో టాప్ స్కోరర్‌గా నిలిచాడు. అభిషేక్ శర్మతో పాటు హెన్రీచ్ క్లాసెన్(31 బంతుల్లో 49), సలిల్ అరోరా (16 బంతుల్లో 47)రాణించారు. కెప్టెన్ ఇషాన్ కిషన్ మాత్రం 15 బంతుల్లో 18 పరుగులు చేసి వెనుదిరిగాడు. ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన సన్‌రైజర్స్ -ఏ టీమ్ 9 వికెట్లకు 253 పరుగుల భారీ స్కోర్ చేసింది. సన్‌రైజర్స్-బీ బౌలర్లలో జయదేవ్ ఉనాద్కట్ (5/48) ఐదు వికెట్లతో సత్తా చాటగా.. నితీష్ రెడ్డి(3/32) మూడు వికెట్లు తీసాడు. బ్రైడన్ కార్స్‌కు ఒక వికెట్ దక్కింది. సన్‌రైజర్స్ -బీ టీమ్ తరఫున కూడా అభిషేక్ శర్మ, ఇషాన్ కిషన్‌లు ఓపెనర్లుగా బరిలోకి దిగారు. హర్షల్ పటేల్ బౌలింగ్‌లో ఇషాన్ కిషన్ 10 పరుగులే చేసి నితీష్ కుమార్ రెడ్డికి క్యాచ్ ఇచ్చి వెనుదిరిగాడు. రెండోసారి బ్యాటింగ్‌లో అభిషేక్ శర్మ నిరాశపర్చాడు. రెండు భారీ సిక్స్‌లు బాది ప్రఫుల్ హింగే బౌలింగ్‌లో కీపర్ క్యాచ్‌గా వెనుదిరిగాడు. మార్చి 28న డిఫెండింగ్ ఛాంపియన్ రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు(ఆర్‌సీబీ)తో చిన్నస్వామి స్టేడియం వేదికగా జరిగే తొలి మ్యాచ్‌తోనే సన్‌రైజర్స్ హైదరాబాద్ తమ క్యాంపైన్‌ను ప్రారంభించనుంది. మోకాలి గాయంతో ఆరంభ మ్యాచ్‌లకు ప్యాట్ కమిన్స్ దూరమయ్యాడు. దాంతో ఇషాన్ కిషన్‌కు తాత్కాలిక కెప్టెన్సీ బాధ్యతలు అప్పగించారు.




## సన్‌రైజర్స్ హైదరాబాద్‌కు భారీ ఎదురుదెబ్బ

### విదేశీ ఆల్‌రౌండర్ జాక్ ఎడ్వర్డ్స్ దూరం



ఈ మార్చి 28న ఐపీఎల్ 2026 ప్రారంభం కానుంది. ఈ క్రమంలో సన్‌రైజర్స్ హైదరాబాద్‌కు భారీ ఎదురుదెబ్బ తగిలింది. విదేశీ ఆల్‌రౌండర్ జాక్ ఎడ్వర్డ్స్ ఐపీఎల్ 2026 సీజన్ నుంచి తప్పుకున్నాడు. గాయం కారణంగా జాక్ ఈ ఐపీఎల్ సీజన్ మొత్తం దూరంగా ఉండబోతున్నాడు. ఇప్పటికే వెన్ను నొప్పి కారణంగా పాట్ కమిన్స్ కొన్ని మ్యాచులకు దూరంగా ఉండనున్న సంగతి తెలిసిందే. అయితే.. గాయం కారణంగా జాక్ ఈ సీజన్ మొత్తం దూరం కావాల్సి వచ్చింది. ఈ సీజన్‌లో హైదరాబాద్ శిబిరంలో గాయపడిన రెండవ క్రికెటర్‌గా ఎడ్వర్డ్స్ నిలిచాడు. కెప్టెన్ కమిన్స్ ఇప్పుడిప్పుడే వెన్నునొప్పి నుంచి కోలుకుంటున్నాడు. ఈ సీజన్‌లోని మొదటి కొన్ని మ్యాచ్‌లకు కమిన్స్ దూరంగా ఉండనున్నాడు. దీంతో ఇషాన్ కిషన్ జట్టుకు నాయకత్వం వహించనుండగా, అభిషేక్ శర్మ వైస్ కెప్టెన్‌గా వ్యవహరించనున్నాడు.  ఇదిలా ఉండగా.. మార్చి 19న ముగ్గురు క్రికెటర్లు ఈ సీజన్ నుంచి వైదొలిగారు. ఈ జాబితాలో చెన్నై సూపర్ కింగ్స్ ఆటగాడు నాథన్ ఎల్లిస్, రాజస్థాన్ రాయల్స్ నుంచి సామ్ కర్రన్ ఉన్నారు. పంజాబ్ కింగ్స్ కొనుగోలు చేసిన లాకీ ఫెర్గూసన్ సైతం కుటుంబ పరిస్థితుల నేపథ్యంలో ఈ సీజన్‌కు దురమయ్యాడు.   పోటీ నుంచి ఎల్లిస్ నిష్క్రమణను సీఎస్కే సీఈఓ కాశీ విశ్వనాథన్ ఇప్పటికే ధృవీకరించారు. అతని స్థానంలో మరొకరి కోసం ఫ్రాంచైజీ ప్రస్తుతం అన్వేషిస్తోందని పేర్కొన్నారు. ఒట్నీల్ బార్ట్‌మన్ పాకిస్థాన్ సూపర్ లీగ్ ఒప్పందం నుంచి వైదొలగడానికి సిద్ధంగా ఉన్నట్లు వార్తలు వస్తున్న విషయం తెలిసిందే. అతడిని తీసుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలుస్తోంది.   మరోవైపు సన్‌రైజర్స్ హైదరాబాద్, రాజస్థాన్ రాయల్స్ ప్రస్తుతం ఒక విదేశీ ఆల్ రౌండర్ కోసం అన్వేషిస్తున్నాయి. హైదరాబాద్ ఓ విదేశీ పేసర్‌ను తీసుకుంటుందనే వార్తలు వస్తున్నాయి.

# విశ్వజి



## ఫేస్ ప్యాక్ లు, హెయిర్ ఆయిల్స్ ఏమీ అక్కర్లేదు..జస్ట్ ఇది తింటే దట్టమైన జుట్టు, మెరిసే చర్మం

ఆరోగ్యవంతమైన జుట్టు, అందమైన చర్మం ప్రతీ ఒక్కరి కల. ఈ కలను నిజం చేయడానికి కొందరు అయితే చేయని ప్రయత్నం ఉండదు. రకరకాల క్రీమ్స్, ఆయిల్స్, షాంపూలు, సీరమ్స్,మార్కెట్లో ఏది కొత్తగా వచ్చినా వెంటనే కొనేసి ప్రయత్నించేస్తుంటారు. కొన్నిసార్లు ఫలితం ఉంటుంది, మరికొన్నిసార్లు నిరాశే మిగులుతుంది. అయితే మీ అందాన్ని రెట్టింపు చేసే అద్భుతమైన పరిష్కారం మీ వంటగదిలోనే దాగి ఉందని మీకు తెలుసా? ఎలాంటి దుష్ప్రభావాలు, రసాయనాల బెడద లేని ఒక సహజసిద్ధమైన ఫుడ్ మీ చర్మాన్ని, జుట్టును లోపలి నుండి పోషించి, ఆరోగ్యంగా మారుస్తుంది. పోషకాహార నిపుణురాలు సిమ్రాన్ చోప్రా తన ఇన్ స్టాగ్రామ్ అకౌంట్ లో షేర్ చేసిన ఓ వీడియోలో..జుట్టు, చర్మ ఆరోగ్యానికి సామయపడే ఆరోగ్యకరమైన స్నాక్ గురించి తెలియజేశారు. అదే ఫైనాఫిల్ రైతా. పెరుగు, పైనాపిల్ కలయికతో చేసే పైనాపిల్ రైతా.. మన చర్మ, కేశ సౌందర్యానికి అవసరమైన పోషకాలను అందించి, వాటిని ఆరోగ్యంగా, కాంతివంతంగా ఉంచడంలో కీలక పాత్ర పోషిస్తుంది. ఇది కేవలం ఆరోగ్యకరమైనదే కాదు, తినడానికి కూడా ఎంతో రుచిగా ఉంటుంది. పైనాపిల్ రైతా స్కిన్, హెయిర్ కి ఎలా మేలు చేస్తుంది? ఫైనాఫిల్ ఇలా పైనాపిల్‌లో విటమిన్ సి పుష్కలంగా ఉంటుంది. ఈ విటమిన్ సి మన శరీరంలో 'కొల్లాజెన్' అనే ప్రొటీన్ ఉత్పత్తికి అత్యంత అవసరం. కొల్లాజెన్ అంటే మన చర్మానికి ఒక ఆధారం లాంటిది. ఇది చర్మాన్ని బిగుతుగా, మృదువుగా ఉంచుతుంది, ముడతలు రాకుండా కాపాడుతుంది. వయసు పెరిగే కొద్దీ తగ్గే కొల్లాజెన్ ఉత్పత్తిని పైనాపిల్ ప్రేరేపిస్తుంది. అంతేకాకుండా కొల్లాజెన్ జుట్టు కుదుళ్లను బలపరిచి, జుట్టు రాలడాన్ని తగ్గించి ఒత్తుగా పెరిగేలా చేస్తుంది. జుట్టుకు మెరుపునిస్తుంది. పైనాపిల్ లో ఉండే బ్రోమెలైన్ అనే ఎంజైమ్ ఒక శక్తివంతమైన యాంటీ ఇన్ ఫ్లమేటరీ (వాపును తగ్గించే) ఏజెంట్ గా పనిచేస్తుంది. ఇది చర్మంపై మంట, ఎరుపుదనం, మొటిమల వల్ల కలిగే వాపును తగ్గిస్తుంది. చనిపోయిన చర్మ కణాలను తొలగించి చర్మాన్ని శుభ్రంగా, మచ్చలు లేకుండా, కాంతివంతంగా మార్చడంలో సహాయపడుతుంది. పెరుగు అలా ఇంట్లో తయారుచేసిన పులియని పెరుగు ఒక అద్భుతమైన ప్రోబయోటిక్. మన జీర్ణవ్యవస్థకు మేలు చేసే మంచి బ్యాక్టీరియా ఇందులో ఉంటుంది. చాలా చర్మ, జుట్టు సమస్యలకు మూలం మన కడుపులోని అసమతుల్యతే. జీర్ణవ్యవస్థ సరిగ్గా లేకపోతే పోషకాలు సరిగా అందవు, వ్యర్థాలు పేరుకుపోతాయి. ఇది మొటిమలు, చర్మం నిర్జీవంగా మారడం, జుట్టు రాలడం వంటి సమస్యలకు దారితీస్తుంది. పెరుగులోని ప్రోబయోటిక్స్ జీర్ణవ్యవస్థను ఆరోగ్యంగా ఉంచి ఈ సమస్యల నుండి మనల్ని కాపాడతాయి. కడుపు చల్లగా ఉంటే చర్మం కూడా ప్రశాంతంగా, ఆరోగ్యంగా ఉంటుంది. పెరుగులో ప్రోటీన్, విటమిన్ బి కాంప్లెక్స్ సమృద్ధిగా ఉంటాయి. ప్రోటీన్ చర్మ కణాల మరమ్మత్తుకు, కొత్త కణాల ఉత్పత్తికి అవసరం. ఇది జుట్టు కుదుళ్లను బలపరిచి, జుట్టు పెరుగుదలను ప్రోత్సహిస్తుంది. విటమిన్లు చర్మానికి తేమను అందించి, ఆరోగ్యంగా ఉంచుతాయి. జుట్టుకు మెరుపునిచ్చి, చిట్లడాన్ని తగ్గిస్తాయి.

## బొప్పాయి గింజలతో ఇన్ని లాభాలా..?



బొప్పాయి పండు తీసుకుంటే ఆరోగ్యానికి ఎంతో మంచిది. శరీరానికి శక్తిని కూడా ఇస్తుంది. అయితే, బొప్పాయి పండు విత్తనాలను మనం చెత్తగా భావించి పడేస్తాము. కానీ, ఈ విత్తనాల ద్వారా ఎన్నో లాభాలు ఉన్నాయి. ఈ నల్లటి బొప్పాయి గింజలు బరువు తగ్గడంలో ఎంతో సహాయపడతాయి. పోషకాలతో సమృద్ధిగా ఉన్న ఈ విత్తనాలు అనేక తీవ్రమైన వ్యాధులతో పోరాడే శక్తిని కలిగి ఉంటాయి. కాగా, బొప్పాయి గింజలు ఎలాంటి సమస్యలలో పని చేస్తాయో మనం ఇప్పుడు తెలుసుకుందాం. తరచుగా అజీర్ణం, మలబద్ధకం వంటి సమస్యలు ఉంటే బొప్పాయి గింజలు ఒక వరంలా పనిచేస్తాయి. ఇందులో 'పపైన్' అనే ఎంజైమ్ ఉంటుంది. కావున ఈ పండు విత్తనాలు ప్రోటీన్లను విచ్ఛిన్నం చేయడంలో, ఆహారాన్ని బాగా జీర్ణం చేయడంలో ఎంతో సహాయపడుతుంది. దీనిని క్రమం తప్పకుండా తీసుకోవడం ద్వారా జీర్ణవ్యవస్థను బలపరుస్తుంది. అంతేకాకుండా కడుపు సంబంధిత సమస్యలను దూరం చేస్తుంది. నేటి కాలంలో మనం తీసుకునే ఆహారం, జీవనశైలి కాలేయంపై చెడు ప్రభావాన్ని చూపుతాయి. అయితే బొప్పాయి గింజలు కాలేయాన్ని క్లీన్ చేసి ఆరోగ్యంగా ఉంచడంలో ఎంతో సహాయపడతాయి. ఈ పండు గింజలు కాలేయాన్ని దెబ్బతీసే ఫ్రీ రాడికల్స్ నుండి కాపాడుతాయి. అంతేకాకుండా కాలేయ సిర్రోసిస్ వంటి తీవ్రమైన సమస్యలలో కూడా ఈ పండి విత్తనాలు సహాయపడతాయి. మన మూత్రపిండాలు మన శరీరం నుండి వ్యర్థ పదార్థాలను తొలగించడానికి పనిచేస్తాయి. బొప్పాయి గింజలు మూత్రపిండాల ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి కూడా సహాయపడతాయి. ఈ బొప్పాయి పండు గింజలు మూత్రపిండాలను క్లీన్ చేయడంలో, దాని పనితీరును మెరుగుపరచడంలో ఎంతో సహాయపడతాయి.

### బొప్పాయి గింజలను ఆహారంలో ఎలా చేర్చుకోవాలి?

బొప్పాయి గింజలు కొద్దిగా చేదుగా ఉంటాయి. కావున వాటిని ఎండబెట్టి పొడిగా చేసి సలాడ్లు లేదా గంజిలో కలిపి తీసుకోవచ్చు. ప్రారంభం దశలో ఈ పొడిని తక్కువ పరిమాణంలో తీసుకోవడం మంచిది. తర్వాత నెమ్మదిగా పెంచుతూ పోతే సరిపోతుంది.

## పిగ్మెంటేషన్‌కు చెక్!



యువతులను ఎక్కువగా వేధించే సమస్య.. పిగ్మెంటేషన్. బుగ్గలు, నుదురుపై ఏర్పడే ఈ నల్లటి మచ్చలు.. అమ్మాయిల ముఖ వర్చస్సును దెబ్బతీస్తాయి. వీటిని పోగొట్టుకునేందుకు రకరకాల క్రీములు వాడుతుంటారు. అయితే, ఇంట్లో దొరికే పదార్థాలతోనే.. ఈ సమస్యకు చెక్ పెట్టొచ్చని సౌందర్య నిపుణులు చెబుతున్నారు. ఒక గిన్నెలో రెండు టేబుల్‌స్పూన్ల ఓట్‌మీల్, ఒక టేబుల్‌స్పూన్ పెరుగు, అర టేబుల్‌స్పూన్ టమాటా రసం వేసి.. బాగా కలపాలి. ఈ మిశ్రమాన్ని నల్లని మచ్చలపై రాసి.. 15–20 నిమిషాల తర్వాత కడిగేసుకోవాలి. టమాటాలో ఉండే సహజసిద్ధమైన బ్లీచింగ్ గుణాలు.. చర్మాన్ని శుభ్రపరుస్తాయి. ఓట్‌మీల్.. ఎక్స్‌ఫోలియేటింగ్ ఏజెంట్‌గా పనిచేస్తుంది. పిగ్మెంటేషన్‌ను తగ్గిస్తుంది. ఇక పెరుగు.. ముఖాన్ని మృదువుగా చేస్తుంది. కలబంద గుజ్జు, తేనె.. ఒక్కో టేబుల్‌స్పూన్ తీసుకోవాలి. ఇందులో రెండు టేబుల్‌స్పూన్ల పొప్పడి గుజ్జు వేసి.. ప్యాక్‌లాగా చేసుకోవాలి. దీన్ని పిగ్మెంటేషన్ ఉన్న చోట రాసి అరగంటపాటు ఆరనివ్వాలి. ఆ తర్వాత కడిగేసుకోవాలి. కలబందలోని సుగుణాలు.. చర్మంలో కొలాజెన్ స్థాయులను పెంచుతాయి. ముఖాన్ని మెరిపిస్తాయి. ఇక ముఖంపై మచ్చలను తొలగించడంలో తేనె సమర్థంగా పనిచేస్తుంది. పొప్పడిలో ఉండే పపైన్ అనే ఎంజైమ్.. చర్మంపైన నల్లని మచ్చలు, మొటిమలను తగ్గిస్తుంది. గుప్పెడు పుదీనా ఆకులను మెత్తటి పేస్ట్‌లా చేసుకోవాలి. దీన్ని పిగ్మెంటేషన్ ఉన్న ప్రాంతాల్లో అప్లయి చేసి.. 10–15 నిమిషాల తర్వాత కడిగేసుకోవాలి. చర్మానికి రక్త ప్రసరణను మెరుగుపరచడంలో పుదీనా సాయపడుతుంది. సోయాపాలు, నిమ్మరసం, టమాటా గుజ్జు ఒక టేబుల్‌స్పూన్ చొప్పున తీసుకొని.. మెత్తటి పేస్ట్‌గా చేసుకోవాలి. నల్లని మచ్చలమీద ఈ మిశ్రమాన్ని అప్లయి చేసి.. పది నిమిషాలపాటు సున్నితంగా మసాజ్ చేసుకోవాలి. ఆ తర్వాత 10–15 నిమిషాలు బాగా ఆరనిచ్చి.. చల్లటి నీళ్లతో కడిగేసుకుంటే సరి. టమాటాలో ఉండే లైకోపీన్ వంటి యాంటి ఆక్సిడెంట్లు.. చర్మాన్ని యూవీ కిరణాల నుంచి రక్షిస్తాయి. చర్మ ఆరోగ్యానికి భరోసా ఇస్తాయి.ఆరెంజ్ తొక్కలను ఎండబెట్టి.. పొడిగా చేసుకోవాలి. అందులో కొద్దిగా పచ్చిపాలు కలిపి మెత్తని పేస్ట్‌గా తయారు చేసుకోవాలి. ఈ మిశ్రమాన్ని పిగ్మెంటేషన్ ఉన్నచోట అప్లయి చేసుకొని.. ఇరవై నిమిషాల తర్వాత చల్లటి నీటితో కడిగేసుకోవాలి. ఆరెంజ్‌లో ఉండే విటమిన్ సి, యాంటి ఆక్సిడెంట్లు.. చర్మాన్ని కాంతిమంతంగా మారుస్తాయి.

# మార్కెట్

## టాటా హారియర్ ఈవీ వచ్చేసిందోచ్

### ప్రారంభ ధర రూ.21.49 లక్షలు
### సింగిల్ చార్జింగ్‌తో 627 కిలోమీటర్లు

న్యూఢిల్లీ : దేశీయ ఆటోమొబైల్ దిగ్గజం టాటా మోటర్స్ సరికొత్త ఈవీ మాడల్‌ను మార్కెట్‌కు పరిచయం చేసింది. ఎస్‌యూవీ విభాగాన్ని మరింత బలోపేతం చేయడంలో భాగంగా సంస్థ నూతన హారియర్ ఈవీను అందుబాటులోకి తీసుకొచ్చింది. ఈ ఏడాది మొదట్లో నూఢిల్లీలో జరిగిన ఆటో ఎక్స్‌పోలో ప్రదర్శించిన ఈ మాడల్ ఆరు నెలల తర్వాత ప్రవేశపెట్టింది. ఈ కారు ప్రారంభ ధర రూ.21.49 లక్షలు. 75 కిలోవాట్ల బ్యాటరీ, 65 కిలోవాట్ల బ్యాటరీతో తయారైన ఈ మాడల్ సింగిల్ చార్జింగ్‌తో 627 కిలోమీటర్లు ప్రయాణించనున్నది. కేవలం 6.3 సెకండ్లలోనే 100 కిలోమీటర్ల వేగాన్ని అందుకోనున్న ఈ కారు గంటకు 200 కిలోమీటర్లకు పైగా వేగంతో దూసుకుపోనున్నది. పనోరమిక్ సన్‌రూఫ్, 14.5 ఇంచుల టచ్‌స్క్రీన్ ఇన్ఫోటైన్‌మెంట్ సిస్టమ్, డ్యూయల్–జోన్ ట్మక్లైమెట్ కంట్రోల్ సిస్టమ్, 360 డిగ్రీల కెమెరా, 12.25 ఇంచుల పూర్తిస్థాయిలో కలర్ టచ్‌స్క్రీన్, లెవల్ 2 అడాస్, ఆరు ఎయిర్‌బ్యాగ్‌లు వంటి ఫీచర్స్ ఉన్నా యి. ఈ ఎలక్ట్రిక్ ఎస్‌యూవీ బుకింగ్‌ను ఇప్పటికే ప్రారంభించింది. బ్యాటరీ ప్యాక్‌పై జీవితకాలం వ్యారెంటీ కల్పిస్తున్నట్లు సంస్థ ప్రకటించింది. ప్రస్తుతం నెలకు 25 వేల యూనిట్లు అమ్ముడవుతున్న ప్రీమియం ఎస్‌యూవీ సెగ్మెంట్‌లో ఈ వాహనంతో మరింత పెరిగే అవకాశం ఉన్నదని టాటా మోటర్స్ ప్యాసింజర్ వాహన ఎండీ శైలేష్ చంద్ర తెలిపారు.



## స్టీల్, అల్యూమినియంపై 50 శాతం సుంకాలు..



### ఉత్తర్వులపై సంతకాలు చేసిన ట్రంప్

రెండోసారి అమెరికా అధ్యక్ష బాధ్యతలు చేపట్టిన డొనాల్డ్ ట్రంప్ వాణిజ్య యుద్ధానికి తెరతీసిన విషయం తెలిసిందే. ఇందులో భాగంగానే స్టీల్, అల్యూమినియంపై దిగుమతి సుంకాన్ని 25 శాతం నుంచి 50 శాతానికి పెంచుతున్నట్లు ఇటీవలే ప్రకటించారు. ఇందుకు సంబంధించిన ఉత్తర్వులపై ట్రంప్ తాజాగా సంతకాలు చేశారు. టారిఫ్‌లు అమెరికా కాలమానం ప్రకారం.. బుధవారం తెల్లవారుజామున 12:01 గంటల నుంచి అమల్లోకి వచ్చాయి. యూకేతో వాణిజ్య ఒప్పందం అమలులో ఉన్న నేపథ్యంలో వారికి మాత్రం టారిఫ్‌లు 25 శాతంగానే ఉండనున్నాయి. కాగా, స్టీల్, అల్యూమినియంపై దిగుమతి సుంకాన్ని 25 శాతం నుంచి 50 శాతానికి పెంచుతున్నట్లు ట్రంప్ గత వారం ప్రకటించిన విషయం తెలిసిందే. స్వదేశీ స్టీల్ పరిశ్రమను బలోపేతం చేయాలన్న ఉద్దేశంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించారు. తమ ప్రభుత్వం నిర్ణయం వల్ల స్థానిక స్టీల్ పరిశ్రమకు ఊతం వస్తుందని, జాతీయ సరఫరా పెరుగుతుందని, దీంతో చైనాపై ఆధారపడే సందర్భాలు తగ్గుతాయని ట్రంప్ పేర్కొన్నారు. అమెరికా స్టీల్ పరిశ్రమ అభివృద్ధి కోసం 14 బిలియన్ల డాలర్లు పెట్టుబడి పెట్టనున్నట్లు చెప్పారు. జపాన్‌కు చెందిన నిప్పాన్ స్టీల్‌తో ఒప్పందం కుదుర్చుకున్నట్లు ట్రంప్ వెల్లడించారు. అయితే ఆ డీల్‌కు చెందిన తుది నిర్ణయం ఇంకా తీసుకోవాల్సి ఉందన్నారు. స్టీల్ పరిశ్రమలో ఇక నుంచి ఉద్యోగులు తీసివేత ఉండదని, ఔట్ సోర్సింగ్ కూడా ఉండదన్నారు. ప్రతి స్టీల్ పరిశ్రమ కార్మికుడికి 5 వేల డాలర్ల బోనస్ అదనంగా వస్తుందని పెన్సిల్వేనియాలోని పిట్స్‌బర్గ్‌లో జరిగిన ర్యాలీలో ట్రంప్ చెప్పుకొచ్చారు.

## విద్యా రుణాలపై వడ్డీరేటు తగ్గించిన పీఎన్‌బీ

న్యూఢిల్లీ : పంజాబ్ నేషనల్ బ్యాంక్(పీఎన్‌బీ).. విద్యాలక్ష్మి స్కీం కింద విద్యా రుణాలు తీసుకునేవారికి వడ్డీరేటును 20 బేసిస్ పాయింట్లు తగ్గిస్తున్నట్టు మంగళవారం ప్రకటించింది. విద్యా రుణాలు తీసుకునేవారిని ప్రోత్సహించాలనే ఉద్దేశంతో బ్యాంక్ ఈ నిర్ణయం తీసుకున్నట్టు తెలిపింది. ఉన్నత విద్యను అభ్యసించే విద్యార్థులకు ఆర్థిక ప్రయోజనాలు కల్పించాలనే ఉద్దేశంతో బ్యాంక్ ఈ ప్రత్యేక స్కీంను తీసుకొచ్చింది. దేశవ్యాప్తంగా 860కి పైగా ఉన్నత ఎడ్యుకేషన్ ఇనిస్టిట్యూషన్‌లో అడ్మిషన్ పొందిన విద్యార్థులకు రుణాలు ఇవ్వనున్నట్లు బ్యాంక్ వర్గాలు వెల్లడించాయి. 7.5 శాతం వార్షిక వడ్డీతో విద్యా రుణాలు మంజూరు చేస్తున్నది.



# ఆంధ్రప్రదేశ్

## తిరుమలలో ఆహార పరీక్షా కేంద్రం

### ఫుడ్ ల్యాబ్‌ను ప్రారంభించిన చంద్రబాబు

తిరుమల,మార్చి21 : తిరుమలలోని పిండి మర ప్రాంతంలో నూతనంగా నిర్మించిన 'వాటర్ అండ్ ఫుడ్ అనాలసిస్ ల్యాబ్' ను సీఎం చంద్రబాబు ప్రారంభించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో టీటీడీ ఈ ల్యాబ్‌ను అత్యంత ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసింది. సుమారు రూ.25 కోట్ల ఖర్చుతో అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా దీనిని తీర్చిదిద్దారు. సుమారు 12 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో, రెండు అంతస్తుల్లో ఈ ల్యాబ్‌ను నిర్మించారు. ల్యాబ్‌లో సుమారు 50 రకాల అత్యాధునిక యంత్రాలను అమర్చారు, ఇవి ఆహార పదార్థాల్లోని అతి సూక్ష్మమైన లోపాలు కూడా గుర్తించగలవు. భక్తులకు అందించే అన్నప్రసాదాలు , లడ్డూ ప్రసాదాల విషయంలో ఎక్కడా రాజీ పడకుండా నిబంధనల ప్రకారం పరీక్షలు నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమంలో మంత్రులు, టీటీడీ చైర్మన్, ఈవోతో పాటు ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. భక్తుల భద్రత, సౌకర్యాల పర్యవేక్షణ కోసం తిరుమలలో ఏర్పాటు చేసిన 'ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్' ప్రాధాన్యతను సీఎం వివరించారు. పారిశుద్ధ్యం నుంచి భద్రత వరకు ప్రతి అంశాన్ని ఈ వ్యవస్థ ద్వారా నిరంతరం పర్యవేక్షిస్తామని, భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చూడటమే తమ లక్ష్యం అని స్పష్టం చేశారు.

## హర్మూజ్ జలసంధిని తెరవండి

### ఇరాన్‌కు 22 దేశాలు విజ్ఞప్తి

న్యూఢిల్లీ,మార్చి21 : హర్మూజ్ జలసంధిని తెరవాలని ఇరాన్‌కు 22 దేశాలు విజ్ఞప్తి చేశాయి. దాడులు కూడా ఆపాలని కోరాయి. చమురు క్షేత్రాలు, వాణిజ్య నౌకలపై దాడులను ఖండించాయి. ఇరాన్ చర్యల వల్ల అన్ని దేశాలపై దుష్ప్రభావం పడుతోందని పేర్కొన్నాయి. ఈమేరకు యూఏఈ, యూకే, ఫ్రాన్స్, జర్మనీ, ఇటలీ, నెదర్లాండ్స్, జపాన్, దక్షిణ కొరియా, ఆస్ట్రేలియా, కెనడా, న్యూజిలాండ్, డెన్మార్క్, బహ్రెయిన్ తదితర దేశాలు సంయుక్త ప్రకటన చేశాయి. గల్ఫ్‌లోని నిరాయుధ వాణిజ్య నౌకలు, చమురు, గ్యాస్ కేంద్రాలు సహా పౌర మౌలిక సదుపాయాలపై ఇటీవల ఇరాన్ జరిపిన దాడులు, హర్మూజ్ జలసంధిని మూసివేయడాన్ని ఖండిస్తున్నాం. సముద్ర చట్టాలకు సంబంధించి ఐరాస ఒప్పందంతో పాటు స్వేచ్ఛాయుత నౌకాయానం అనేది అంతర్జాతీయ చట్టంలో ఓ ప్రాథమిక సూత్రం. ఇరాన్ చర్యలు ప్రపంచంలోని అన్ని ప్రాంతాల ప్రజలపై, ముఖ్యంగా అత్యంత బలహీన వర్గాలపై ప్రభావం పడుతోందని యూఏఈ విదేశాంగ శాఖ ఓ సంయుక్త ప్రకటన విడుదల చేసింది. ఇందులో 22 దేశాలు సంతకాలు చేశాయి.

## ఇజ్రాయిల్ యుద్ధవిమానం కూల్చివేత

### ప్రకటించుకున్న ఇరాన్

టెహ్రాన్,మార్చి21 : పశ్చిమాసియాలో ఉద్రిక్తతలకు అడ్డుకట్ట పడటం లేదు. తమ భూభాగంపై దాడికి దిగిన ఇజ్రాయెల్ యుద్ధ విమానాన్ని కూల్చేసినట్టు ఇరాన్ మిలిటరీ శనివారంనాడు ప్రకటించింది. దీనికి ఒకరోజు ముందే అమెరికా ఎఫ్-35 స్టెల్త్ యుద్ధ విమానాన్ని ఢీ కొట్టామని ఇరాన్ ప్రకటించుకుంది. ఇజ్రాయెల్ యుద్ధవిమానంపై దాడి జరిగినట్టు ఇజ్రాయెల్ కూడా గుర్తించిందని 'టెహ్రాన్ టైమ్స్' తెలిపింది. తమ యుద్ధవిమానాన్ని టా÷-గ్గం÷ట్ చేస్తూ ఉపరితలం నుంచి గగనతలంపైకి క్షిపణిని ప్రయోగించారని ఇజ్రాయల్ మిలిటరీ పేర్కొంది. ఏ తరహా యుద్ధ విమానం అనేది మాత్రం వెల్లడించలేదు. కాగా, ఇరాన్ గగనతలంపై ఇజ్రాయెల్ విమానంపై క్షిపణి ప్రయోగం జరిగిందని, అయితే విమాన సిబ్బంది ప్రామాణిక విధానాలను అనుసరించడం ద్వారా ముప్పును తప్పించారని, ఎలాంటి నష్టం లేకుండా మిషన్‌ను పూర్తి చేశారని 'ది టైమ్స్ ఆఫ్ ఇజ్రాయెల్' పేర్కొంది. ఇరాన్ క్షిపణి అతి సమీపానికి రావడంతో పైలట్ వృత్తిపరమైన నైపుణ్యంతో అత్యంత వేగంగా స్పందించి దాడిని తప్పించినట్టు ఆ కథనం పేర్కొంది. విమానానికి నష్టం జరిగినట్టు ఎలాంటి సమాచారం లేదు. కాగా, ఇరాన్‌లోని నతాంజ్ అణుశుద్ధి కేంద్రంపై ఇటీవల దాడులు జరిపిన అమెరికా-ఇజ్రాయెల్ దళాలు శనివారంనాడు మరోసారి విరుచుకుపడ్డాయి. ఈ దాడుల్లో ఎలాంటి రేడియోధార్మిక పదార్థాలు లీక్ అవ్వలేదని, పరిసర ప్రాంత నివాసితులకు ప్రమాదం వాటిల్లలేదని వార్తా సంస్థలు తెలిపాయి. ఈ దాడిని ఇరాన్ తీవ్రంగా ఖండించింది. ఇజ్రాయెల్ నేరపూరిత చర్యల్లో భాగంగానే ఈదాడి జరిపిందని, అణుభద్రతా నిబంధనలు, అంతర్జాతీయ చట్టాలకు తూట్లు పొడిచిందని నిప్పులు చెరిగింది.

## మాజీ ఎమ్మెల్యే హనుమంతరాయ చౌదరి కన్నుమూత

అనంతపురం,మార్చి21 : అనంత జిల్లా కళ్యాణదుర్గం తెలుగుదేశం పార్టీ మాజీ ఎమ్మెల్యే ఉన్న హనుమంతరాయ చౌదరి కన్నుమూశారు.. ఆయన వయస్సు 81 సంవత్సరాలు.. శనివారం ఉదయం ఆయన తుదిశ్వాస విడిచారు.. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మార్క్ ఫెడ్ చైర్మన్ గా ఆయన ఆరేళ్ల పాటు పనిచేశారు. ఉమ్మడి అనంతపురం జిల్లా టీడీపీ అధ్యక్షుడిగా పదేళ్ల పాటు పనిచేశారు. కళ్యాణదుర్గం మండలం గరుడాపురం పంచాయతీ వార్డు మెంబర్ స్థాయి నుంచి ఎమ్మెల్యే స్థాయి వరకు ఎదిగారు. నెల రోజులుగా గుండె, శ్వాసకోశ సంబంధిత సమస్యతో ఇబ్బందులు పడుతూ.. అనంతపురంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఇవాళ తెల్లవారుజామున తుది శ్వాస విడిచినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. హనుమంతరాయ చౌదరి స్వగ్రామం కళ్యాణదుర్గం మండలం ఎర్రంపల్లిలో ఆదివారం అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు ఆయన కుటుంబ సభ్యులు ప్రకటించారు ..

## హిప్పో దాడిలో పశువైద్యురాలు మృతి

### ఘటనపై విచారం వ్యక్తం చేసిన మంత్రి

### ప్రభుత్వం తరపున 30లక్షల పరిహారం ప్రకటన

బెంగళూరు,మార్చి21 : కర్ణాటకలో పెను విషాద ఘటన ఒకటి చోటుచేసుకుంది. హిప్పోపోటమస్ దాడిలో పశు వైద్యురాలు ప్రాణాలు కోల్పోయింది. గర్భంతో ఉన్న హిప్పోను చెక్ చేయడానికి వెళ్లిన సమయంలో ఈ సంఘటన చోటుచేసుకుంది. ఘటనకు సంబంధించిన పూర్తి వివరాల్లోకి వెళితే.. బెంగళూరుకు చెందిన 27 ఏళ్ల సమీక్షా రెడ్డి త్యావరకొప్ప టైగర్, లయన్ సఫారీలో కాంట్రాక్ట్ బేసిస్ కింద పశువైద్యురాలిగా సేవలు అందిస్తోంది. గురువారం రాత్రి 10.30 గంటల సమయంలో ఆమె జూలోని సన్ కాపర్ పక్షికి చికిత్స చేయడానికి వెళ్లింది. పక్షికి చికిత్స పూర్తయిన తర్వాత గర్భంతో ఉన్న హిప్పో టెంపరేచర్ చేయడానికి ఎన్‌క్లోజర్‌లోకి వెళ్లింది. ఈ నేపథ్యంలోనే ఆ హిప్పో ఆమెపై దాడి చేసింది. తలతో బలంగా సమీక్షారెడ్డిని కొట్టింది. దీంతో ఆమె ఊపిరితిత్తులు, లివర్ తీవ్రంగా దెబ్బతిన్నాయి.

# నక్కపల్లి వద్ద మిట్టల్ స్టీల్ ఫ్యాక్టరీ

### 23న శంకుస్థాపన చేయనున్న సిఎం చంద్రబాబు

### కేంద్రమంత్రులు కుమారస్వామి, రామ్మోహన్ నాయుడు రాక

### రూ.1,35,964 కోట్ల భారీ పెట్టుబడితో ఈ ప్రాజెక్టు నిర్మాణం



విశాఖపట్టణం,మార్చి21 : అనకాపల్లి జిల్లా నక్కపల్లి వద్ద ఏర్పాటు కానున్న ఉక్కు కర్మాగారం కోసం సోమవారం సిఎం చంద్రబాబు, కేంద్రమంత్రి కుమారస్వామిలు శంకుస్థాపన చేయనున్నారు.ఏపీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కేంద్ర మంత్రులతో కలిసి ఈనెల 23వ తేదీన భూమిపూజ చేయనున్నారు. కేంద్ర ఉక్కు శాఖ మంత్రి హెచ్.డి. కుమారస్వామి, పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, ఇతర ముఖ్య నేతలు ఈ కార్యక్రమంలో పాల్గొననున్నారు. సుమారు రూ.1,35,964 కోట్ల భారీ పెట్టుబడితో ఈ ప్రాజెక్టు రూపుదిద్దుకుంటోంది. ఇది రాష్ట్ర చరిత్రలోనే అతిపెద్ద పారిశ్రామిక పెట్టుబడులలో ఒకటి. ఈ పరిశ్రమ ద్వారా ప్రత్యక్షంగా, పరోక్షంగా సుమారు లక్ష మందికి ఉపాధి అవకాశాలు లభించనున్నాయి. నక్కపల్లి, పాయకరావుపేట, చుట్టుపక్కల ప్రాంతాల యువతకు ఉద్యోగ అవకాశాలు లభించనున్నాయి. ఉక్కు కర్మాగారం వస్తే దానిపై ఆధారపడే వందలాది చిన్న తరహా పరిశ్రమలు చుట్టుపక్కల ఏర్పడతాయి. తద్వారా పరోక్ష ఉపాధి భారీగా పెరుగుతుంది. ఆర్సెలార్ మిట్టల్ - నిప్పాన్ స్టీల్ సంస్థలు ఏడాదికి 17.8 మిలియన్ మెట్రిక్ టన్నుల ఉక్కు ఉత్పత్తిని లక్ష్యంగా పెట్టుకున్నాయి. ఈ సంస్థలు అత్యంత ఆధునికమైన, పర్యావరణహితమైన సాంకేతికతను ఇక్కడ ఉపయోగించనున్నాయి. గత 21 నెలలుగా ఏపీ ప్రభుత్వం చేపట్టిన పారిశ్రామిక విధానాలు, సులభతర వాణిజ్యం, వేగవంతమైన అనుమతుల వల్లే ఈ ప్రాజెక్టు పట్టాలెక్కింది. విశాఖపట్నం పోర్టుకు సమీపంలో ఉండటంతో ముడిసరుకు రవాణా , ఎగుమతులకు ఈ ప్రాంతం వ్యూహాత్మకంగా చాలా కీలకం. ఈ ప్రాజెక్టు ఒక ఫ్యాక్టరీ మాత్రమే కాదని, ఆంధ్రప్రదేశ్‌ను 'భారతదేశ ఉక్కు రాజధాని'గా మార్చే దిశగా వేసిన బలమైన అడుగని ప్రభుత్వ వర్గాలు పేర్కొన్నాయి. ఇలా ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక రంగంలో గొప్ప ముందడుగు పడింది. ఏపీ పారిశ్రామిక ప్రస్థానంలో ఆర్సెలార్ మిట్టల్ - నిప్పాన్ స్టీల్ ఇండియా ప్రాజెక్టు ఒక మైలురాయిగా నిలవబోతుంది. గత 21 నెలల కూటమి ప్రభుత్వ కృషితో ఈ భారీ ప్రాజెక్టు సాకారం కాబోతోంది. అనకాపల్లి జిల్లా నక్కపల్లి వద్ద ఏర్పాటు కానున్న ఈ ఉక్కు కర్మాగారం ఉత్తరాంధ్ర రూపురేఖలను మార్చేయనుంది.

## జగన్ హయాంలో ఆర్థికంగా రాష్ట్రం దివాళా

### అరసవిల్లి అభివృద్ధి పనులకు రామ్మోహన్ శ్రీకారం

శ్రీకాకుళం,మార్చి21 : జగన్ హయాంలో ఏపీ ఆర్థికంగా చాలా నష్టపోయిందని కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు ధ్వజమెత్తారు. వైసీపీ హయాంలో జరిగిన పొరపాట్లను తమ ప్రభుత్వంలో సరిచేస్తున్నామని చెప్పుకొచ్చారు. ఈ మేరకు వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డిపై రామ్మోహన్ నాయుడు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయ అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. రూ.4 కోట్లతో ఇంద్రపుష్కరిణి పున:నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో మంత్రి అచ్చెన్నాయుడు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రామ్మోహన్ నాయుడు మాట్లాడారు. అరసవల్లి ఆలయ అభివృద్ధికి కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టిందని తెలిపారు. అరసవల్లి ఆలయంలో రూ.4 కోట్లతో మాస్టర్ ప్లాన్‌లో భాగంగా అభివృద్ధి పనులు చేపట్టామని రామ్మోహన్ నాయుడు వెల్లడించారు. రథసప్తమి వేడుకలు రాష్ట్ర పండుగగా నిర్వహించామని చెప్పుకొచ్చారు. కేంద్ర ప్రభుత్వం నుంచి ప్రసాదం స్కీమ్‌లో అరసవల్లి నిధులు తీసుకువచ్చే ప్రయత్నం చేస్తామని తెలిపారు. రూ.4 కోట్లతో పుష్కరిణి అభివృద్ధికి చర్యలు చేపట్టామని అన్నారు. భక్తుల సౌకర్యాన్ని దృష్టిలో పెట్టుకుని ఆలయ అభివృద్ధికి చర్యలు చేపట్టామని వివరించారు. శ్రీకాకుళం కార్పొరేషన్‌ను అన్నివిధాలా అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. కార్గిల్ పార్క్ అత్యున్నత ప్రమాణాలతో రూపుదిద్దుకుందని రామ్మోహన్ నాయుడు పేర్కొన్నారు.

## ఆధ్యాత్మిక కేంద్రాలుగా టిటిడి ఆలయాలు

### తిరుమల పవిత్రతకు భంగం వాటిల్లకుండా కఠిన చర్యలు

### కాలుష్య రహితంగా తిరుమల క్షేత్రం అభివృద్ధి

### అధికారులకు సిఎం చంద్రబాబు సూచనలు

తిరుమల,మార్చి21 : తిరుమల తిరుపతి దేవస్థానం పరిధిలోని ఆలయాలను అత్యంత అధునాతన ఆధ్యాత్మిక కేంద్రాలుగా అభివృద్ధి చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు టిటిడి బోర్డు సభ్యులకు సూచించారు. తిరుమల పవిత్రతకు భంగం కలిగించే చర్యలను అరికట్టేందుకు అత్యాధునిక సీసీ కెమెరాలు, ఫేస్ రికగ్నిషన్ వ్యవస్థలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. తిరుమలలో ఇప్పటికే ఈ వ్యవస్థను ప్రయోగాత్మకంగా అమలు చేస్తున్నట్లు అధికారులు సీఎంకు వివరించారు. తిరుమలలో భవిష్యత్తులోనూ కాలుష్యానికి అవకాశం లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు.తిరుమలలో పర్యటించిన సీఎం.. శనివారం వైకుంఠం క్యూ కాంప్లెక్స్‌లోని ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఆధారిత ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో బోర్డు సభ్యులు, అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. తిరుమలలో భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకూడదన్నారు. ముందస్తుగానే సమస్యలను గుర్తించి వెంటనే పరిష్కరించే విధంగా వ్యవస్థను మరింత బలోపేతం చేయాలన్నారు. భక్తులు క్యూలైన్లలోకి ప్రవేశించిన సమయం నుంచి శ్రీవారి దర్శనం పూర్తి చేసుకొని తిరుగుప్రయాణం అయ్యే వరకు వారికి అందుతున్న సౌకర్యాలను కమాండ్ కంట్రోల్ సెంటర్ ద్వారా పర్యవేక్షించాలని ఆదేశించారు. మరిన్ని ఆలయాల నిర్మాణం ద్వారా భక్తి భావాన్ని పెంపొందించేందుకు కార్యాచరణ సిద్ధం చేయాలని సీఎం పేర్కొన్నారు. అన్నదానం, ప్రాణదాన టస్టు సేవలు విజయవంతంగా కొనసాగుతున్నాయని, ప్రాణదానం ట్రస్టు సేవలను విస్తరించి మెరుగైన వైద్య సేవలు అందించాలని సీఎం సూచించారు. శ్రీవారి సేవలో పాల్గొనే సేవకులకు వారి నైపుణ్యానికి తగ్గట్టుగా శిక్షణ ఇచ్చి, వారి సేవలను తితిదే పరిధిలోని అన్ని ఆలయాల్లో వినియోగించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. తితిదేలో అమలు చేస్తున్న విధానాలు దేశంలోని ఇతర ఆలయాలకు మార్గదర్శకాలుగా నిలిచేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ ద్వారా క్యూలైన్ మేనేజ్‌మెంట్ విధానాన్ని అమలు చేయాలన్నారు.

## ఇరాన్ ముడి చమురుపై ఆంక్షలు ఎత్తివేత

న్యూఢిల్లీ,మార్చి21 : ప్రపంచవ్యాప్తంగా ఇంధన సంక్షోభం నెలకొన్న నేపథ్యంలో అమెరికా పలు కీలక నిర్ణయాలు తీసుకుంటోంది. రష్యా ముడి చమురుపై అమెరికా ఇప్పటికే సడలింపులు ఇచ్చిన సంగతి తెలిసిందే. తాజాగా సముద్రంలో నిలిచిపోయిన ఇరాన్ ముడి చమురుపై కూడా ఆంక్షలు ఎత్తేస్తున్నట్టు అమెరికా ప్రకటించింది. ఈ నేపథ్యంలో ఆ చమురును భారత్ సహా ఇతర ఆసియా దేశాల రిఫైనరీలు కొనుగోలు చేసే యోచనలో ఉన్నట్టు తెలుస్తోంది. ఈ మేరకు అంతర్జాతీయ వార్తా సంస్థ ఓ కథనంలో పేర్కొంది .ఇరాన్‌కు చెందిన 170 మిలియన్ బ్యారెళ్ల ముడి చమురు, యుద్ధం ప్రారంభమయ్యే నాటికి సముద్రంలో ఉంది. యుద్ధం మొదలు కావడంతో అది సముద్రంలోనే నిలిచిపోయింది. ఈ చమురును సరఫరాలోకి తీసుకొచ్చే క్రమంలో అమెరికా ఉపశమన చర్యలు ప్రారంభించింది. మార్చి 20 లేదా అంతకు ముందు నౌకల్లోకి లోడ్ చేసి, ఏప్రిల్ 19 నాటికి డిశ్చార్జ్ కావాల్సిన ముడి చమురుకు 30 రోజుల సడలింపు ఇస్తున్నట్టు అమెరికా ఆర్థిక శాఖ మంత్రి బెసెంట్ ఓ ప్రకటన చేశారు. ఆ ముడి చమురుకు సంబంధించి ప్రభుత్వ ఆదేశాలు, చెల్లింపుల విషయంలో అమెరికా నుంచి స్పష్టత కోసం ఆసియా దేశాలకు చెందిన పలు రిఫైనరీలు వేచి చూస్తున్నట్టు సమాచారం .రష్యాకు చెందిన 130 మిలియన్ బ్యారెళ్ల ముడి చమురును కొనుగోలు చేసేందుకు కూడా అమెరికా సడలింపులు ఇచ్చిన సంగతి తెలిసింది. రష్యా ముడిచమురుతో పాటు తాజాగా ఇరాన్ ముడి చమురు కూడా మార్కెట్‌లోకి వస్తే ఇంధన సంక్షోభం నుంచి కాస్త ఉపశమనం లభిస్తుందని పరిశీలకులు అంచనా వేస్తున్నారు. కాగా, తమ వద్ద ముడి చమురు నిల్వలు లేవని ఇరాన్ ప్రకటించడం గమనార్హం.

## మొయినాబాద్ ఫామ్‌హౌజ్ సీజ్

### అసైన్డ్ భూమిలో రోహిత్ రెడ్డి ఫామ్‌హౌజ్

### రెవెన్యూ విచారణలో బాగోతం బట్టబయలు

హైదరాబాద్,మార్చి21 : మాజీ ఎమ్మెల్యే పైలట్ రోహిత్ రెడ్డికి చెందిన మొయినాబాద్ ఫామ్ హౌస్ వ్యవహారం ఇప్పుడు పెను దుమారం రేపుతోంది. అజీజ్ నగర్‌లోని సర్వే నెంబర్ 177/33 పరిధిలో ఉన్న సుమారు 2.20 ఎకరాల విస్తీర్ణంలో నిర్మించిన ఈ ఫామ్ హౌస్ పూర్తిగా ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా అసైన్డ్ భూమిలో కట్టినట్లు రెవెన్యూ అధికారులు జరిపిన విచారణలో నిర్ధారణ అయ్యింది. మొయినాబాద్ పోలీసులు ఫామ్‌హౌస్‌ను స్వాధీనం చేసుకుని సీజ్ చేశారు. డ్రగ్స్ పార్టీ నిర్వహించిన సమయంలో ఫామ్‌హౌస్‌లో జరిగిన పార్టీకి హాజరైన వారి విలాసవంతమైన వాహనాలను కూడా పోలీసులు సీజ్ చేశారు. ఈ ఫామ్‌హౌస్‌ను అసైన్డ్ భూమిలో నిర్మించినట్లు రెవెన్యూ అధికారులు ప్రాథమికంగా గుర్తించారు. 2006లో ఈ భూమి రోహిత్ రెడ్డి తండ్రి విఠల్ రెడ్డి పేరుతో రిజిస్ట్రేషన్ అయినట్లు రికార్డులు చెబుతున్నప్పటికీ, భూభారతి రికార్డుల ప్రకారం అది జంగయ్య అనే వ్యక్తి పేరు మీద ఉన్నట్లు అధికారులు గుర్తించారు. అసలు ప్రభుత్వానికి చెందిన అసైన్డ్ భూమిపై రిజిస్ట్రేషన్ ఎలా జరిగిందనే అంశంపై ప్రస్తుతం రెవెన్యూ , పోలీస్ యంత్రాంగం లోతుగా ఆరా తీస్తోంది. ఈ అక్రమ నిర్మాణంపై కఠిన చర్యలు తీసుకోవాలని సిఫార్సు చేసిన రెవెన్యూ శాఖ, ఫామ్ హౌస్‌ను సీజ్ చేయాల్సిందిగా ఇప్పటికే అధికారులకు నివేదిక అందించింది. పోలీసుల విచారణలో భాగంగా ప్రస్తుతం ఈ ఫామ్ హౌస్ వారి కస్టడీలోనే ఉంది. అక్కడికి పార్టీ కోసం వచ్చిన వారి విలాసవంతమైన వాహనాలను కూడా పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. మొత్తం ఐదు లగ్జరీ కార్లను సీజ్ చేసి, ఆ సమాచారాన్ని కోర్టుకు నివేదించారు. పార్టీకి హాజరైన వారు తమ వాహనాలను అక్కడే వదిలేసి వెళ్లడంతో పోలీసులు వాటిని సీజ్ చేసి విచారణను వేగవంతం చేశారు. త్వరలోనే ఈ ఫామ్ హౌస్ సీజ్ ప్రక్రియ పూర్తయ్యే అవకాశం కనిపిస్తోంది.

## కాకినాడ పోర్టులో చౌకబియ్యం పట్టివేత

### విదేశాలకు తరలిస్తుండగా అధికారుల దాడి

కాకినాడ,మార్చి21 : విదేశాలకు ఎగుమతి చేసేందుకు అక్రమంగా తరలిస్తున్న పీడీఎస్ బియ్యాన్ని కాకినాడ యాంకరేజ్ పోర్టులో అధికారులు స్వాధీనం చేసుకున్నారు. కాకినాడ జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి సత్యనారాయణ ఆధ్వర్యంలో దాడులు నిర్వహించి.. మొత్తం 5 లారీల్లోని 140 మెట్రిక్ టన్నుల బియ్యాన్ని సీజ్ చేశారు. ఈ బియ్యం విలువ రూ.65 లక్షలు ఉంటుందని అంచనా. అయితే ఎవరు వీటిని సరఫరా చేస్తున్నది తెలియాల్సి ఉంది. గతంలో పేర్నినాని తరలించిన బియ్యం వ్యవహారం సద్దు మనగక ముందే మరోమారు పెద్ద ఎత్తున బియ్యం పట్టుబడడం విశేషం.

## కోతుల దాడిలో వృద్ధురాలు మృతి

కాకినాడ,మార్చి21 : కోతుల మూక దాడిలో ఓ వృద్ధురాలు మృతి చెందింది. ఈ ఘటన కాకినాడ జిల్లాలోని ప్రత్తిపాడు మండలం పెద్దిపాలెంలో చోటు చేసుకుంది. గ్రామ శివారులో జీడిమామిడి తోటను ఆనుకుని ఉన్న ఇంట్లో దానబోయిన చిన్నబుల్లి (68) నివాసం ఉంటున్నారు. గేదెకు నీరు పెట్టేందుకు వెళ్లగా అక్కడ ఉన్న కోతులు ఒక్కసారిగా దాడి చేశాయి. 20కి పైగా కోతులు ఒక్కసారిగా మీదపడి దాడి చేయడంతో తప్పించుకునే వీలు లేకుండా పోయింది. ఈ దాడిలో తీవ్రంగా గాయపడిన ఆమె.. అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయింది. చిన్నబుల్లి తనకు ఉన్న 3 ఎకరాల తోటలో తన కుమార్తె కుటుంబంతో కలిసి అక్కడే నివాసం ఉంటోంది. ఈ ప్రాంతంలో కోతుల దాడిలో గాయపడిన ఘటనలు చాలా జరిగాయని.. అయితే ప్రాణాలు కోల్పోవడం ఇదే మొదటిసారని గ్రామస్థులు వాపోయారు.

## జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం

### లారీని ఢీకొన్న ట్రావెల్స్ బస్సు

### 15 మంది ప్రయాణికులకు తీవ్ర గాయాలు

ఆదిలాబాద్,మార్చి21 : జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. గుడిహత్నూర్ సమీపంలోని 44వ నంబర్ జాతీయ రహదారిపై ఈ ప్రమాదం జరిగింది. ట్రావెల్స్‌కు చెందిన బస్సు ఓవర్‌టేక్ చేయబోయే క్రమంలో ముందున్న లారీని బలంగా ఢీకొట్టింది. ఈ ఘటనతో బస్సు ముందుభాగం పూర్తిగా నుజ్జునుజ్జు అయింది. ముఖ్యంగా క్యాబిన్ భాగం పూర్తిగా దెబ్బతింది. బస్సు ఆదిలాబాద్ నుండి హైదరాబాద్ వెళ్తుండగా ఈ ఘటన జరిగింది. ఈ ప్రమాదంలో మొత్తం 15 మంది ప్రయాణికులు గాయపడినట్లు సమాచారం. ఘటన జరిగిన వెంటనే స్థానికులు, పోలీసులు సహాయక చర్యలు చేపట్టి గాయపడిన వారిని బయటకు తీసి చికిత్స కోసం ఆదిలాబాద్ లోని రిమ్స్ ఆసుపత్రికి తరలించారు. ప్రమాదానికి ఓవర్‌టేకింగ్ కారణమని ప్రాథమికంగా పోలీసులు భావిస్తున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

## అసోంలో ఇక హిమంతకు ఉద్వాసనే

### కాంగ్రెస్ కూటమి గెలుస్తుందన్న గొగోయ్

గువాహటి,మార్చి21 : అస్సాం అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ 100 సీట్లలో పోటీ చేస్తోందని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు గౌరవ్ గొగోయ్ తెలిపారు. ఐదు పార్టీలతో కాంగ్రెస్ పొత్తు పెట్టుకున్నట్టు చెప్పారు. బీజేపీ వ్యతిరేక ఓట్లలో చీలిక ఉండకపోవచ్చని, తద్వారా హిమంత బిశ్వ శర్మ సారథ్యంలోని ప్రభుత్వం అధికారం కోల్పోతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. అస్సాంలో మొత్తం 126 అసెంబ్లీ స్థానాలు ఉండగా, కాంగ్రెస్ ఇంతవరకూ 94 మంది అభ్యర్థులను ప్రకటించింది.'అస్సాంలోని ఆరు విపక్ష పార్టీలైన కాంగ్రెస్, అస్సాం జాతీయ పరిషత్, రైజోర్ దళ్, సీపీఎం, సీపీఐ (ఎంఎల్), ఆల్ పార్టీ హిల్ లీడర్స్ కాన్ఫరెన్స్ కలిసి పోటీ చేస్తున్నాయి. కాంగ్రెస్ పార్టీ 100 మంది అభ్యర్థులను బరిలోకి దింపుతోంది. బీజేపీ వ్యతిరేక ఓట్లు చీలే అవకాశం ఉండదనుకుంటున్నాం. హిమంత బిశ్వా శర్మ సారథ్యంలోని ప్రభుత్వం అధికారం కోల్పోతుందని ఆశాభావంతో ఉన్నాం' అని గొగోయ్ చెప్పారు.

ఒయ్యారి చిత్రం





## భావోద్వేగభరిత ముగింపు

ప్రతి ఇంట్లో జరిగే సంఘటనలతో రూపొందించిన సినిమా 'పిఠాపురంలో.. అలా మొదలైంది'. ఇది కచ్చితంగా అందర్నీ ఆకట్టుకునేలా ఉంటుంది" అన్నారు దర్శకుడు మహేశ్ చంద్ర. ఆయన తెరకెక్కించిన ఈ చిత్రంలో రాజేంద్ర ప్రసాద్, పృథ్వీరాజ్, కేదార్ శంకర్, మణి చందన తదితరులు ప్రధాన పాత్రలు పోషించారు. దుండిగళ్ల బాలకృష్ణ, ఆకుల సురేశ్ పటేల్, ఎఫ్ఎం మురళి నిర్మించారు. అన్నపూర్ణమ్మ కీలక పాత్ర పోషించింది. ఈ చిత్ర ట్రైలర్‌ను ఇటీవల హైదరాబాద్‌లో విడుదల చేశారు. నటులు శ్రీకాంత్, శివాజీ రాజా, ఎం.ఎం శ్రీలేఖ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. "ఈ చిత్ర క్లైమాక్స్ చాలా భావోద్వేగభరితంగా ఉంటుంది" అన్నారు దర్శకుడు మహేశ్ చంద్ర. ఆయన త్వరలోనే 'ప్రేయసి రావే'కి సీక్వెల్ చేస్తానని ప్రకటించారు. ఇప్పటికే శ్రీకాంత్‌కు కథ చెప్పగా.. ఆయన చాలా ఆనందపడ్డారని తెలిపారు.

## 'ఇరుముడి' కోసం రీమిక్స్ పాట?



రవితేజ కథానాయకుడిగా శివ నిర్వాణ దర్శకత్వంలో తెరకెక్కుతున్న చిత్రం 'ఇరుముడి'. మైత్రీ మూవీ మేకర్స్ సంస్థ నిర్మిస్తోంది. ప్రియా భవానీ శంకర్ కథానాయిక. సాయికుమార్, బేబీ నక్షత్ర, అజయ్ ఘోష్ తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. చిత్రీకరణ దశలో ఉన్న ఈ సినిమాలో రవితేజ అయ్యప్ప స్వామి భక్తుడిగా కనిపించనున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలోనే దీనికోసం ఎంతో ప్రాచుర్యం పొందిన అయ్యప్ప గీతం "ఎక్కినాడు పల్లకి"ని రీమిక్స్ చేయనున్నట్లు వార్తలు వినిపిస్తున్నాయి. తాజాగా ఈ అంశంపై సంగీత దర్శకుడు జీవీ ప్రకాశ్ కుమార్ స్పందించారు. ఆ పాటను రీమిక్స్ చేయమని ప్రేక్షకులు, అభిమానుల నుంచి డిమాండ్ వస్తున్న మాట వాస్తవమని.. దర్శక – నిర్మాతలు తుది నిర్ణయం తీసుకోవాల్సి ఉందని తెలియజేశారు. మరి త్వరలోనే దీనిపై స్పష్టత వస్తుందేమో చూడాలి. తండ్రీ–కూతురు అనుబంధాలతో ముడిపడిన ఎమోషన్ యాక్షన్ ఎంటర్‌టైనర్ ఇది. ఈ ఏడాది ఆఖర్లో తెరపైకి రానుంది.

## నా గుండెని.. మళ్లా పగలగొట్టినవ్!



"నువ్వు వచ్చిన తర్వాతే పగిలిపోయిన నా గుండెని అతకబెట్టుకున్నే. నువ్వు మళ్లా పగలగొట్టినవ్. నన్ను ఇడసబెట్టు.. పోవే" అంటున్నాడు హర్ష్ రోషన్. మరి తన ప్రేమ కథేంటి? ఆ ప్రేమ ప్రయాణంలో ఎదురైన సవాళ్లేంటి? తెలియాలంటే 'బ్యాండ్ మేళం' చూడాల్సిందే. 'కోర్ట్' విజయం తర్వాత రోషన్, శ్రీదేవి కలిసి నటించిన రెండో చిత్రమిది. కోన వెంకట్ ప్రొడక్షన్‌లో సతీశ్ జవ్వాజీ తెరకెక్కించారు. కావ్య, శ్రావ్య నిర్మాతలు. సాయికుమార్ కీలక పాత్ర పోషించారు. ఈ సినిమా ఈనెల 26న థియేటర్లలోకి రానుంది. ఈ నేపథ్యంలోనే కథానాయకుడు చిరంజీవి శనివారం ఈ చిత్ర ట్రైలర్‌ని విడుదల చేశారు. టీనేజ్‌లో ఉన్న బావ – మరదలు ప్రేమకథతో ముస్తాబైన చిత్రమిది. వాళ్లిద్దరి ప్రేమలో ఉండే సున్నిత భావోద్వేగాలు, గిల్లికజ్జాల్ని ట్రైలర్‌లో వినోదాత్మకంగా చూపించారు. మరి హీరోకి తన మరదలి ప్రేమను దక్కించుకోవడంలో ఎదురైన సవాళ్లేంటి? వాటిని ఎలా అధిగమించాడు? అన్నది సినిమా చూసి తెలుసుకోవాలి. "ఇక నుంచి నేను దాని ముఖం చూడను రా. ఇప్పుడది నా గుండెల్లో లేదు. నా జిందగిలో కూడా లేదు" అంటూ ట్రైలర్ ఆఖర్లో హర్ష్ రోషన్ చెప్పిన డైలాగ్ ఆకర్షణగా నిలిచింది. ఈ సినిమాకి సంగీతం: విజయ్ బుల్గానిన్, ఛాయాగ్రహణం: సతీశ్ ముత్యాల.



## గతాన్ని గుర్తు చేసే 'తిమ్మరాజుపల్లి టీవీ'

"90ల తరానికి వాళ్ల గతాన్ని గుర్తు చేసే సినిమా 'తిమ్మరాజుపల్లి టీవీ'. దీన్ని చూస్తున్నంత సేపూ ఆ ఊరి ప్రజలతో కనెక్ట్ అయిపోతారు. వాళ్ల అమాయకత్వాన్ని అనుభూతి చెందుతారు. ఆరోజుల్లో టీవీకి ఇంత ప్రాధాన్యత ఉందా అనుకుంటారు" అన్నారు హీరో కిరణ్ అబ్బవరం. ఇప్పుడాయన స్వయంగా నిర్మించిన ఈ చిత్రంతో సాయితేజ్, వేద జలంధర్ నాయకానాయికలుగా తెరకు పరిచయమవుతున్నారు. దీనికి వి.మునిరాజు దర్శకత్వం వహించారు. ఈ సినిమా ఏప్రిల్ 17న థియేటర్లలోకి రానుంది. ఈ నేపథ్యంలోనే శనివారం హైదరాబాద్‌లో విలేకర్ల సమావేశాన్ని ఏర్పాటు చేశారు.



## అల్లు అర్జున్.. కొత్త సినిమాల సంగతులు చాలానే!



అల్లు అర్జున్ చేయనున్న సినిమాలపై ఎప్పటికప్పుడు స్పష్టత వస్తున్నప్పటికీ... ఆ సినిమాల వెనక సంగతులు మా త్రం అభిమానుల్ని ఊరిస్తున్నాయి. అల్లు అర్జున్ – అట్లీ కల యికలో రూపొందుతున్న సినిమా పేరేమిటి? విడుదల ఎప్పు డు? అందులో లుక్, ఆ కథా ప్రపంచం ఎలా ఉంటుం ది? అలాగే అల్లు అర్జున్ – లోకేశ్ కనగరాజ్ కలయికలో సిని మా ఎప్పుడు మొదలవుతుంది? అందులో హీరోయిన్, ఇతర తారాగణం ఎవరు? – ఇలా బోలెడన్ని సంగతులు తెలి యాల్సి ఉంది. అట్లీ దర్శకత్వంలో రూపొందుతున్న సినిమా పట్టాలెక్కి చాలా రోజులైనా, ఏ విషయం కూడా బయటకు రాకుండా అత్యంత గోప్యంగా ముంబయిలో చిత్రీ కరణ జరుపుతున్నారు. లోకేశ్ కనగరాజ్ దర్శకత్వంలో రూపొం దనున్న సినిమాని కూడా అధికారికంగా ప్రకటిం చినప్పటికీ, మిగతా విషయాలపై స్పష్టత ఇవ్వలేదు. ఆ సంగతులన్నీ బయటకు రావడానికి తగిన సమయం రానే వచ్చింది. అల్లు అర్జున్ పుట్టినరోజు ఏప్రిల్ 8. ఆరోజే ఆయ న, అట్లీ కలయికలో రూపొందుతున్న సినిమా లుక్‌ని విడు దల చేయ నున్నారు. దాంతోపాటుగా సినిమా పేరు, విడుదల తేదీని కూడా ప్రకటించే అవకాశాలున్నట్టు సమాచారం. ఇప్పటికే అందుకు సంబంధించిన కసరత్తులో చిత్రబృందం నిమగ్నమై నట్టు తెలుస్తోంది. లోకేశ్ కనగరాజ్ దర్శకత్వంలో రూపొం దనున్న సినిమా ప్రారంభ విశేషాలు కూడా ఆరోజే అని సమాచారం. వీటితోపాటు కొత్త సినిమాలపై కూడా స్పష్టత వచ్చే అవకాశాలున్నాయని, 3 రోజులపాటు అల్లు అర్జున్ సినిమాల విశేషాల సందడి కొనసాగే అవకాశం ఉందని తెలిసింది.

## ఆదర్శవంతమైన కోడలా... దుష్టశక్తా?

ఇటీవలే 'హక్' చిత్రంలో షా బానో అనే శక్తిమంతమైన మహిళా పాత్రలో కనిపించి.. నటనతోనే ప్రేక్షకుల్ని కట్టిపడేసింది కథానాయిక యామీ గౌతమ్. తదుపరిగా కొత్త కోడలి అవతారంలో మెట్టినింటి వారిని భయపెట్టేందుకు సిద్ధమైపోయినట్లు పేర్కొంటూ రాబోయే చిత్రాన్ని ప్రకటించింది. యామీ ప్రధాన పాత్రలో బాలాజీ మోహన్ దర్శకత్వం వహిస్తున్న సినిమా 'నయ్యి నవెల్లి'. అమెజాన్ ఎంజీఎం స్టూడియోస్ సమర్పిస్తోన్న ఈ చిత్రాన్ని ఆనంద్ ఎల్.రాయ్, హిమాన్షు శర్మ సంయుక్తంగా నిర్మిస్తున్నారు. ఈ విషయాన్ని ఇన్‌స్టాలో అధికారికంగా ప్రకటిస్తూ టైటిల్ పోస్టర్‌ని ఆవిష్కరించింది చిత్రబృందం. "కొత్త కోడలిగా.. మేరట్‌లో గందరగోళంగా ఉన్న ఓ కుటుంబంలో అడుగుపెట్టిన అమ్మాయి.. దానిని స్వర్గంలా మారుస్తుంది. తను నిజంగానే ఆదర్శవంతమైన కోడలా? బహుశా వేరే లోకం నుంచి వచ్చిన దుష్ట శక్తి కూడా కావచ్చు కదా! అని తన కుటుంబంలోనే ఒకరికి అనుమానం. మరి అలాంటి విచిత్రమైన పరిస్థితుల నుంచి ఆ కుటుంబం ఎలా బయటపడింది?"అనే కథాంశంతో ఈ సినిమా హారర్ కామెడీగా రూపొందనుందని చిత్రవర్గాలు తెలిపాయి.

Printed, Published & Owned by B. Srinivas, Printed at Sree Seshasai EnterprisesPlot no. 98/1, Co-operative Industrialp Estate,Gandhi Nagar, near Balanagar Medchel -Malkajgiri Dist.Hyderabad 500037 (T.S). Published at Plot S11, 3rd Floor, Ballard estate Margadarshi building Tarnaka Secundrabad, Hyderabad 500 007 (T.S), Editor : B. Srinivas, PRGI.REGN.NO. APTEL/2003/11288, Gmail: ninadamnews@gmail.com, CELL: +91 8333068787